జూన్. విడిసంచిక రూ. [illegible]




సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక




సంపాదకుఁడు, ప్రకాశకుఁడు: ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుటము : ౩. — భావ, జ్యేష్ఠము. — సంచిక : ౧.

ఆంధ్రభూమి ముద్రణాలయము—వేపేరి, మదరాసు.

ఆంధ్రులచే స్థాపించబడిన

# ది డెక్కన్ అష్యూరెన్సు కంపెనీ

(లిమిటెడ్)

ను ప్రోత్సాహించుడు.

స్వల్ప ప్రీమియములు! నవీన పద్ధతులు!

## ప్రత్యేక సౌకర్యములు

1. స్త్రీపురుషులకు సమానమైన ప్రీమియమురేట్లు.
2. రు. 250, రు. 500, రు. 750 లకు కూడ పట్టాలు జారీచేయబడును.
3. ఆటోమాటిక్ నాన్ ఫర్ఫీచరు.
4. గృహనిర్మాణమునకై పట్టాదారులకు ఋణము లియ్యబడును.
5. అంగవైకల్యనష్టపరిహారము.
6. వ్యాధిగ్రస్థులైన పట్టాదారులకు వైద్యసహాయసౌకర్యములు.
7. ఆకస్మికమరణములకు రెట్టింపుభీమా మొత్తం.
8. ప్రత్యేక పునరుద్ధారణ పద్ధతులు.
9. రు. 10,000లకు మించిన భీమాలకు రిబేటుపద్ధతులు.
10. ధర్మకార్యార్థపు భీమాలకు ప్రత్యేక రిబేటు.
11. కారణాంతరములచే క్లయిము పరిష్కారము ఆలశ్యమైన వడ్డీతో క్లయిము మొత్తం నొసంగుట.

ఉత్తరప్రత్యుత్తరములు తెలుగునకూడ జరుపబడును.

ప్రతి పట్టణమునందు పలుకుబడికలిగిన ఏజంట్లు కావలెను.

ధారాళమైన కమీషను రేట్లు.

హెడ్డాఫీసు: బెజవాడ.

బ్రాంచీలు. మదరాసు, బెంగుళూరు, హైదరాబాదు (డెక్కన్).

# సువర్ణసుందరరసము

## సర్వప్రమేహములు

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరము లేదు. అనేకులు వాడి మెచ్చి యున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్షరసాయనశాల, ముక్త్యాల

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :.

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయముచేయును. ప్రశస్తమైన రసాయనము. వెల: తులము 1 కి: రు 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రి గారు, ఎ.ఎం.ఎ.సి



# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలుపడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనమువల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్థకౌషధము.

# జీవామృతము

(పూర్ణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.
ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

**ఆయుర్వేదాశ్రమము.**

151, గోవిందప్పనాయకవీథి, తపాలుపెట్టె287,
మదరాసు.

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటీవ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకనే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారలు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని పాలసీదారులే వాటాదారులగుట.

మీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# స్వాతంత్ర్యము

ఉద్యోగపు దాస్యమునుండియు, నిరుద్యోగపు విచారమునుండియు,
స్వాతంత్ర్యమును పొందుటకు "స్టార్" ఏజన్సీని తీసికొనుడు—

1. జీతము మీదగాని లేక ధారాళమైన కమీషన్ మీదగాని
2. వంశపారంపర్యమగు పారితోషికము.
3. బీదలకు, భాగ్యవంతులకు వీలైన శాస్త్రీయమైన భీమాపద్ధతులు
4. ఒడంబడిక మూలమైన ఉద్యోగనిశ్చయము.

కంపెని అభివృద్ధి

| | | | |
|---|---|---|---|
| 1. | పూర్తిచేసిన భీమావ్యాపారమొత్తము | రు. | 20,00,000 పైగా |
| 2. | చెల్లించిన క్లైముమొత్తము | రు. | 2,50,000 |
| 3 | సంవత్సరపుఆదాయము | రు. | 2,00,000 |
| 4. | గవర్నమెంటుసెక్యూరిటీలు | రు. | 1,00,000 |


వివరములకు :— ఎం. ఎస్. ఆర్. ఏ. గుప్త, మేనేజింగు ఏజంటు.

## ది స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అష్యూరెన్సు కంపెని, లిమిటెడ్.

హెడ్డాఫీసు : 23-24, సెకండులైన్ బీచ్, మద్రాసు.



# Tri-Colour Process Blocks




M
C
Appaswamy Chetty & Co.
PROCESS ENGRAVERS
64 Savarimuthu St Mannady MADRAS



# కామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన
**తాత కృష్ణమూర్తి, బి.ఏ;యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారికభాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం.ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలది. క్రౌన్ సైజు, వెల 12 అణాలు.

ఈ మనోహరగ్రంథము భాషాసతికి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చటలూరుచున్నవి. —భారతి.

కథలలోని హద్దు మీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:
తాత కృష్ణమూర్తి, భద్రాచలం.




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీ గ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0 4 0 ధర కేదొరకును.

## గంధర్వ కళ

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకుబిగి కలిగించు త్రియ్యని లేహ్యము, అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది

పౌను రు. 3—0—0.

గంధర్వ ఫార్మసీ, రాజమండ్రి.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను పోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిపొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు-పిల్సు), హిమసారతైలము (బేడింగ్ అండ్ హెయిరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్ స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అనివ్రాయవలెను.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను పోగొట్టి మిక్కిలి సుగుణమిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును. 6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.

# ది యునైటెడ్ ఇండియా లైఫ్

## అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్

**హెడ్ ఆఫీసు** : మదరాసు. 1906 లో స్థాపింపబడినది.

ట్రస్టీ : మద్రాసు యొక్క అఫీషియల్ ట్రస్టీ.

| | | |
|---|---|---|
| అమలునందున్న పాలసీలు | రెండుకోట్ల రూపాయలను | మించినవి. |
| మొత్తపుఆస్తులు | ఏబదియైదులక్షల రూపాయలను | మించినవి. |
| సంవత్సరాదాయము | పండ్రెండులక్షల రూపాయలను | మించినది. |

పెట్టుబడులలో పూర్తియైన, నికరమైన రక్షణ; క్లెయిముల సత్వరమును, న్యాయసమ్మతమునగు పరిష్కారము; కార్యనిర్వహణమున పోడిమి; మంచిబోనస్సుతో కూడియుండు తగుమైన ప్రీమియములు; పోలసీహోల్డరులకు ఫలకరమును, సహాయకరమును, సత్వరమును అగు సేవ,

ఈ కంపెనీకి ఘనత కలుగజేయుచున్న ప్రత్యేక లక్షణములు.

మనదేశమునందు వివిధతావులయందు గల ఈకంపెనీ ప్రతినిధులకుగాని, హెడ్ ఆఫీసునకుగాని వ్రాయుచో పూర్తివివరములు వెంటనే పంపబడును.

"యునైటెడ్ ఇండియాలైఫ్ అస్యూరెన్సు బిల్డింగులు."
సెంబుదాస్ వీథి, మద్రాసు.

యం. కె. శ్రీనివాసన్.
మేనేజింగు డైరెక్టరు.

## గమనింపుడు

మా మ్యాస్ ఇన్సూరెన్సు పద్ధతియొక్క అత్యద్భుతమైన అభివృద్ధిని గమనింపుడు.

ఇంతటి కొద్ది కాలములో జరిగిన **42,00,000** ఇట్టి క్రొత్త పద్ధతిని నమ్మగలరా?

## నిజముగ జరిగిన సంగతి

వైద్యపరీక్ష లేదు. స్త్రీపురుష వివక్షత లేదు.

ఇది శాస్త్రీయమైనది—ఇందు బోనసుగలదు—గ్యారంటీడ్ లాభములనిచ్చును.

మీ అర్ధాంగితో కలసి ఒకజాయింటు పోలసీని తీసికొనుడు.

ఏజెన్సీ షరతులకు, ఇతరవివరములకు నేడే వ్రాయుడు.

## ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఢిల్లీ.

మద్రాసు బ్రాంచి : 22, సెకండులైన్ బీచ్, జార్జిటవున్.

మదరాసు రాజధానిలో ఇతర బ్రాంచీలు :—1. విజయనగరము, 2. గుంటూరు, 3. తెలిచ్చేరి, 4. ట్యూటికారిన్ లేక సదరన్ యిండియాడిస్ట్రిక్టుస్.



బుడ్డి వెల 0-5-0—నొప్పుల నివారించుటలో సాటిలేనిది—డజను రు. 3 0 0.

**యాత్రికులిచ్చిన యోగ్యతాపత్రము.**

"మేము మద్రాసునుంచి బయలుదేరి రామేశ్వరము వగైరా యాత్రలు సేవించుకొని యీరోజుకు శ్రీకాళహస్తికి వచ్చినాము. మీవద్ద తీసుకున్న హనుమాన్ పెయిన్ బామ్ అను తలనొప్పిమందు శ్రీరాములవారికి ఆంజనేయులు తోడ్పడినట్లు యాత్రసమయంలో మాకు తోడ్పడినందుకు సంతోషంతో యీలెటరు వ్రాసినాము."—నల్లా ఈశ్వరలింగం, 11-4 34.

**హెడ్ ఆఫీసు: హనుమాన్ పెయిన్ బామ్ వర్క్సు,**

89 పూనమల్లి హైరోడ్. పి. టి. మదరాసు.

ఏజెంట్లు: 1. పి. స్వామినాయుడుగారు, ప్రొప్రయిటరు, శ్రీరామాకృష్ణా ట్రేడింగుకంపెనీ, నరసారావుపేట.

2. శ్రీ కృష్ణా అడ్వర్టయిజింగు కంపెనీ, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరిజిల్లా.

ఏజెంట్లు లేనితావులయందు ఏజెంట్లు కావలెను. మంచికమీషను ఈయబడును.


# పోటీబహుమానము —రూ. 10—

## దాగుడు మూతల పజిల్

ఈ దిగువ నిచ్చిన ఉదాహరణము చూచి, అట్లే తక్కిన పదములను కనిపెట్టి కూపనుపై వ్రాసి, 1934 జూను 20-వ తేదీ లోపున ఆంధ్రభూమికి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకునివద్ద ఒక సీలు కవరులో ఉంచబడినవి. పైమాసపు సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు తప్పులు లేకుండ పంపినవారికి రూ. 10 బహుమాన మీయబడును.

షరా:—సమాధానములు కూపనుమీదనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు పనికిరావు. ఒక్కొక్కరు ఎన్ని కూపనులయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చు కూపనుకు 2 అణాలును, వ్రాతకూపనుకు 3 అణాలును (తపాలా బిళ్ళలు) ప్రవేశరుసుము.

### ఉదాహరణము.

సూచన: మగని దన్నిన మానిని. కనిపెట్టవలసినపదము: సత్యభామ.

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | గు | స | గు | స | లు | | | గు | స | గు | స | లు | జరుపగా) |
| ము | త్య | పు | చి | ప్ప | | (3) | | ము | త్య | పు | చి | ప్ప | (3 స్థానములు కుడివైపు |
| | తు | లా | భా | ర | ము | (1) | | తు | లా | భా | ర | ము | (1 ,, ,, ) |
| | | మ | నో | ర | మ | (2) | మ | నో | ర | మ. | | | (2 ,, ఎడమ ,, ) |

మొదటి వరుసలోని అక్షరములను అట్లే ఉంచి, దాని దిగువనున్న పంక్తులను కుడివైపుకాని, ఎడమవైపుకాని కొన్నిస్థానములు జరుపవలెను. ఏవరుస ఎన్నిస్థానములు జరుపవలెనో, ఆ సంఖ్య యీయబడినది. అట్లు జరిపినపిదప, అక్షరముల వరుసలను పైనుండి క్రిందికి చదివినచో సూచనకు సరిపోవు పదమొకటి యేర్పడవలెను. ఆపదమొక్కటిమాత్రము కూపనులో వ్రాయవలెను.

1. పక్షి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| జ | పా | సు | వా | రు | |
| య | క్ష | ప | శు | వు | (3) |
| | స | వ | ర | ణ | (2) |
| | ఆ | ము | ద | ము | (1) |

2. పుణ్యక్షేత్రము.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | ఇ | భ | రా | జ | ము |
| ని | ద్రా | రో | గ | ము | (1) |
| అ | న్నా | కీ | చ | క | (2) |
| ధ | ర్త | జా | బ్రౌ | ల్ల | (3) |
| క | ము | ద | ము | | 2) |

**3. అహింసాబోధకుడు.**

అ గౌ ర వ ము
పా శు ప త ము (2)
మ ణి హా ర ము (1)
ధ ర్మ బు ద్ధి (1)
ఐ రో పా యు ద్ధ ము (3)

**4. అంకె.**

ఒ క నా టి తో
క వు లు న మ్మి రి (1)
సా టి య గు న ది (2)

**5. రామాయణకవి.**

త్రా గు బో తు
క ల్ల ల మా రి (1)
సీ తా ఫ ల ము (3)
క న్యా దా న ము (2)
శ్రీ ని వా సు డు (1)

**6. సంగీతమున ఒకరాగము.**

భూ ప తి రా వు
హై మ వ తి (2)
ప్రి యా ను రా గ ము (3)
కే ళి ద ని య (1)

**7. జలచరము.**

మీ తా త మొ గ ము
ని ర స న జే ర ము (2)
చి లు ము న మ లి న (1)

**8. దేశభక్తురాలు.**

స ర స క వి
ఐ రో పా యా త్ర (2)
ధ ర్మ మే జ య ము (1)
నీ ర జ నే త్రి (3)
గ్రీ సు దే శ ము (1)
వి వే క వ తి. (4)

**9. నది.**

గో పి క బ్ర తి మా లె
బ్ర హ్మ దా న మి చ్చె (2)
అ తి వ వ ల పు (3)
రా జు గా రి దీ స త్ర ము (2)

**10. అంటువ్యాధి.**

శా లా మ్మ ణి
శూ ర సే ను డు (3)
క వ చ ము (1)
ఎ క ర ము (2)
య ము నా న ది. (1)

---

కూ ప ను

## దాగుడు మాత్రల పజిల్

1 ....................
2 ....................
3 ....................
4 ....................
5 ....................
6 ....................
7 ....................
8 ....................
9 ....................
10 ....................

సంపాదకుని తీర్మానము అంగీకరింతును.

పేరు....................

చిరునామా....................

....................



## పి. కోదండరాంపిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లెవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుసామిపిళ్లె భవనములు)

మీ భవనమును అలంకరించుటకును, దానిని ఆకర్షణీయముగ చేయుటకును కర్రసామగ్రులు కావలయును. త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకు పూర్వము మాతో సంప్రదింపుడు. పురాతనమైన, ప్రఖ్యాతిగల కంపెనీ.

39-44, ఎస్ప్లనేడ్ వెస్టు; బెత్తాలంగడివీధి, మద్రాసు.



**ఇంద్రజాల మహేంద్రజాలము** ఈ గ్రంథములో జర్మనీగారడి, హస్తలాఘవము, ఆంగ్లఇంద్రజాలము, మంత్రశాస్త్రము, భూతవైద్యము, యంత్రములు, చీట్లపేక తమాషాలు, వినోదవిద్యలు మనుష్యుని మాయము చేయుట, మామిడిచెట్టును పుట్టించుట, జీవముతో సమాధి యగుట, శరీరము లేని తలచేత మాట్లాడించుట; గాలిలో మనుష్యుని నిలుపుట, మొదలగు విచిత్రము లున్నవి. దీనిచే మేజిక్ చేయగలరు. వెల రు 4.

**చమత్కార గణితము:**—(అచ్చుపడు) ఇందులో విచిత్ర వినోదమనోగణితములు, సమస్యలు, చిక్కుప్రశ్నలు, యుక్తి తమాషాలెక్కలు, గణితావధానముగలవు. దీనిని చదివిన తెలివికలుగును. వెల రు. 1.

వలయువారు:—వీ ఆర్. జనార్దననాయుడు, ఒంగోలు, (గుంటూరుజిల్లా) అని వ్రాయుడు.



**కామశాస్త్రము** ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తేటమగును. అల్లరి చిల్లరి వ్రాంతలు కావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాంబట్టి దీనిగొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయి.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.


## శికిందరాబాదు, హైదరాబాదులందు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనములను వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మా కార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొనవచ్చును.

—ఇట్లు, ఆంధ్రభూమి మేనేజరు.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా:

శ్రీయుత కాలేరు పెంటయ్యగారు, 4121 మూసాఖాన్‌వీధి, శికిందరాబాదు.

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

## లిమిటెడ్

## బందరు

స్థాపితము—1925.

కొలది సంవత్సరములలోనే అద్భుతమగు అభివృద్ధిగాంచిన సంస్థ.

| | |
|---|---|
| 1933 లో జరిగిన వ్యాపారము | 19,42,000 |
| సాలీనా ఆదాయము | 3 లక్షలు |
| భీమానిధి | 7 లక్షలు |

మితవ్యయము, నిర్దుష్టపరిపాలన మా కంపెనీయొక్క ముఖ్యలక్షణములు.

సాలీనా చెల్లించు ప్రీమియములపై నూటికి రు 2—8—0 లు మినహాయింపు; రద్దయిన పట్టాలు, బాకీలుపడిన ప్రీమియములు చెల్లించవలసిన అవసరంలేకుండగా తిరిగి అమలులోనికి తెచ్చుట మొదలగు అనేకసౌకర్యములు గలవు.

మొదటి వాల్యుయేషనులోనే సాలుకు 1000-కి రు 10 లు బోనసుపంచబడినది.

అన్నిచోట్లను మంచి కమీషనుపై పలుకుబడిగల ఏజంట్లు కావలెను.

వివరములకు:—

య. మంగయ్య, బి.ఎ, బి.ఎల్.,

కార్యదర్శి.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

**ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ లిమిటెడ్**

ప్రధాన కార్యస్థానము :— బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :— గా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్య పంతులుగారు.

స్వల్ప ప్రీమియములు. నవీనపద్ధతులు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను ఇయ్యబడును

ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు, 2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును, 3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు, 4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి, 5. పట్టాదారులకు ఋణము లియ్యబడును, 6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు ఇయ్యబడును, 7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును, 8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

జనన భీమా శిశు పోషణకు గొప్ప సహాయకారి.

పూర్తి వివరములకు :— సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

**ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ, గాంధినగర్, బెజవాడ.**

## నాయకీ పజుల్ సమాధానములు

1. శకుంతల 2. ఊర్వశి 3. గంగ 4. సరస్వతి 5. గాంధారి 6. అరుంధతి 7. తార 8. శబరి 9 వసంతసేన 10. చంద్రమతి 11. మొల్ల 12 శూర్పణఖ 13. ద్రౌపది 14. చిత్రాంగి 15. వరూధిని 16. సుభద్ర.

ఈ క్రింది ఇద్దరును అన్నిటికిని సరియైన సమాధానములుపంపుటచే బహుమాన ధనము వీరిఉభయులకు పంచబడును.

1. యం. రామకృష్ణారావు గారు, కొల్లాపురం, మూర్వకొండపోస్టు, కర్నూలుజిల్లా.

2. తాడూరి కృష్ణమూర్తిగారు, చింతలపూడి, పశ్చిమగోదావరిజిల్లా.

ఈ క్రింది ఆర్గురును ఒక్కొక్క విషయమునతప్ప మిగిలిన అన్నిటికిని సరియైన సమాధానమిచ్చిరి.

1. వేదాల తిరువేంగళాచార్యులుగారు, గుంటూరు. 2. మంగిపాటి సీతామహాలక్ష్మిగారు, తెనాలి. 3. సెట్టి ఈశ్వరరావుగారు, విజయనగరము 4. ధారా అప్పయ్యశాస్త్రిగారు, వేమూరు 5. హరి రాధాకృష్ణమూర్తిగారు, కలవపాముల. 6. కొల్లా వెంకయ్యగారు, పెదనందిపాడు.

బహుమానము పొందినవారు ఆ ధనమును ఆంధ్రభూమికి చందాగా జమకట్టమనుటగాని, భాగవతాది గ్రంథములనుకొని పంపమనుటగాని, సొమ్ము మనియార్డరుచేయమనుటగాని మాకు తెలిపినవెంటనే ఆమేరకు వారిఆజ్ఞలు నిర్వర్తింపబడునని మనవి.

# విషయసూచిక


౧. శిశుప్రబోధము ... ౫
—జి. జాషువా

౨. ప్రణయానుసరణి ... ౬
—మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ, బి. ఏ.

౩. గుసగుసలు ... ౯
—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాద్, బి. ఏ.

౪. బాల్యస్నేహం ... ౧౫
—పురాణం కుమారరాఘవశాస్త్రి బి. ఏ.

౫. చందమామ ... ౨౨
—బొడ్డు బాపిరాజు

౬. పూనానగరమునందలి యాంధ్రులు ... ౨౩
—టి. యస్. రాములు బి. ఏ.

౭. విజయావతారము. ... ౨౫
—మొదలి సీతారామస్వామి, బి. ఏ.

౮. స్నేహలతాదేవి ... ౨౭
—ధేరం వేంకటనాథశాస్త్రి బి. ఏ. బి. ఇ. డి.

౯. వనమాలి ... ౨౯
—స్థానాపతి సత్యనారాయణశాస్త్రి

౧౦. సినిక్ మగడు ... ౩౦
—తాత కృష్ణమూర్తి బి. ఏ., యల్. టి.

౧౧. కోరిక ... ౩౩
—చిట్టూరి సత్యనారాయణ

౧౨. పల్లెపదంగులు ... ౩౪
—ఉభయభాషాప్రవీణ ఏటుకూరి వేంకటనరసయ్య

౧౩. రణజిత్సింహుడు : కోహినూరువజ్రము. ... ౩౫
—కో. సత్యనారాయణ, బి. ఏ.

౧౪. వైశాఖపూర్ణిమామహాత్ములందు ... ౩౭
—రామరాజు రంగప్పరాజకవి

౧౫. లక్కపరిశ్రమ ... ౩౯
—జాగు గోపాలరావు

౧౬. జిజ్ఞాస : మీమాంస ... ౪౨

౧౭. జార్జి ఈస్టుమాన్ ... ౪౪

౧౮. మణిమాల ... ౫౧

౧౯. రా. డా. గా. అంజనేయచౌదరిగారు. ౫౪

౨౦. ఆంధ్రభూమి పుస్తకపీఠము ... ౫౬

౨౧. క్రొత్తపత్రికలు ... ౫౭

౨౨. సంపాదకీయసమాలోచన ... ౫౯

౨౩. ఇన్నూరెన్నో విషయములు ... ౬౨
—జమిలి నమ్మాళ్వారుగారు

౨౪. ఆంధ్రుని డైరి ... ౬౪


## గమనిక

గతమాసపు సంచికలో ప్రచురింపబడిన విశాఖపట్టణ దృశ్యముల చిత్రములు విశాఖపట్టణమునందలి సుప్రసిద్ధ ఛాయాచిత్రగ్రాహకవ్యాపారులగు శ్రీ రత్నంఅండుకో వారు ఎత్తిపంపినవి. వారుపంపిన మఱికొన్ని విశాఖపట్టణదృశ్యచిత్రములు కాలక్రమమున ఆంధ్రభూమిలో ప్రచురింపబడును. —సంపాదకుడు.

## పైమాసపు 'ఆంధ్రభూమి' సంచికలో

రెండు విమర్శకవ్యాసములు. ఒకటి తాత కృష్ణమూర్తిగారి 'రామప్రియ'ను గూర్చియు, మఱియొకటి వర్ఘుల వేంకటశ్వాకవిగారి 'నౌకాభంగము'ను గూర్చియు.

రెండు హాస్యవిషయికవ్యాసములు. ఒకటి ఎ. శేషాచలపతి (బి. ఏ) గారు వ్రాసిన 'భార్యలు బయట ఉన్నప్పటి మగవాళ్ళపంటలు' అనునది; మఱియొకటి 'తెనుగుకవుల తోలితోళ్ళు' అనునది. ఈ రెండవ వ్యాసమునందు తెనుగుకవులు తొలితోళ్ళచే ఎట్లు కూయించిరి, వాని కూతలలోని సందేశములు మొదలగునవి చమత్కారముగ వివరింపబడినవి.

రెండు జీవితచరిత్రలు. ఒకటి పలుకుబడిలేని పేదవాడయ్యు వ్యాపారముచేసి ప్రపంచమునందలి స్టోరు కీపరులలో అగ్రగసరుడై కోటీశ్వరుడైన వూల్‌వర్తు వణిక్పుంగవుని అద్భుతకథ; మఱియొకటి ఆంగ్లకార్మిక నాయకుడు జార్జిలాన్సుబరీ జీవితకథ.

ఇతరములగు కథావ్యాసములు, పద్యవ్యాసములు, గద్యవాసములు.

# ప్రస్తావిక

శ్రీ తాత కృష్ణమూర్తిగారి 'సినిక్ మగడు' అనునది ఒక్కటియే ఈ సంచికయందలి హాస్యవ్యాసము. ఈ వ్యాసమునందలి హాస్యము ఉత్తమజాతికి చెందినది. 'బూతాడక దొరకు నవ్వు పుట్టదు' అను చాడప్పవాక్యమును హాస్యవిషయమున శిరమునదాల్చువారు నేటికిని గలరు మఱికొందఱు అన్యభాషాపదములు తెనుగుతో గుచ్చెత్తిగాని హాస్యమును పుట్టింపజాలరు. కృష్ణమూర్తిగారి హాస్యము ఈరెండు పెడదారులను త్రొక్కి చూడదు. విరుద్ధభావముల సన్నివేశమువలనను, పరిస్థితులలోని తికమకలవలనను వారు హాస్యమును పుట్టింతురు. ఈ వ్యాసమునగల విరుద్ధభావసన్నివేశజనితహాస్యమునకు నిదర్శనములు రెండు: 'ఇంట్లో శవంపోయినా సరే పళ్ళు తోముకోవడంమాత్రం తప్పదు.'—శుభసమయములలోని చందనతాంబూలాదిసత్కారము ఒకరికోటి కంపు, చెమటకంపు దగ్గిరనున్న రెండోవాళ్ళను బాధించకుండా ఉండగలందులకు. పరిస్థితులలోని వ్యత్యస్థము వలని హాస్యమునకు పిప్పిపళ్ళబాధ వర్ణన; పళ్లు ఊడదీయించుట, కట్టించుట మొదలగువాని వర్ణన నిదర్శనములుగా చేకొనవచ్చును. ప్రసాదమైన ఇట్టిహాస్యము ఆంధ్రసారస్వతమున కొత్తిమిరిప్రాయముగమాత్రమే గలదు.

* * * *

శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి బి. ఏ. గారి 'బాల్యస్నేహం' అను కథావ్యాసమున సాదృశ్యన్యాయము చక్కగపట్టినది. కాని, గవ్వలు గలబరించి నట్లుగా నవ్వుచు మగని ఒడిలోకూర్చున్న జయప్రదయను ముసలివానిభార్యయగు కథానాయకురాలికిని సాదృశ్యమెక్కడ? తుదకు ఆమెయు ప్రియునిఒడిలో కూర్చున్నదిగదా! కథలో జయప్రదాదేవిభాగము అతిముఖ్యమైనది. ఆమె అనుభవించు సౌఖ్యమునుచూచియే ఆ సౌఖ్యమునకు ఎడమైయుండిన కథానాయకురాలియెడ మనము మఱింత కనికరము పూనుచున్నాము. సుఖిమోహనరావుల సమావేశము అకార్యమనయెంచువారికి జయప్రదప్రత్యక్షమైవారినోళ్ళకు తాళమువైచుచున్నది.

* * * *

నేటి ఆంధ్రరాజ్యమున కలగుండువెట్టుచున్న ప్రధానసమస్యలు పెక్కు. శ్రీ చిలుకూమిళ్ళ శివరామకృష్ణప్రసాద్ బి ఏ. గారి 'గుసగుసలు' అను వ్యాసమున ఎత్తిచూపబడినవి. క్రొత్తదిఅనుటతోడనే క్రోడాడువారు చెవినిడవలసిన ప్రధానమైనసంగతు లీవ్యాసమున కొన్నిగలవు.

* * * *

శ్రీ మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారి 'ప్రణయసరణి' అనునది సాంసారికకథావ్యాసము. భార్యాభర్తలిద్దఱే ప్రధానపాత్రలు, కథ అంతయు ఒక్కనాటితో తీరిపముచ్చట. వియోగానంతరము తరుణదంపతులసమావేశపుగాథ. హృదయమునుకలంచు భావములులేవు. అంతమాత్రమున హృదయాకర్షణ కొఱవడినదనుకొనరాదు. 'మాయలుగా మగవారి కృత్యముల్' అనిపించినాడు భాస్కరుడు. ఇంతవను ఇందిర చెట్టు సరే నెగ్గినది. కుటుంబజీవితగ్రంథమున ఇట్టి సన్నివేశములు రసవద్ఘట్టములు.

* * * *

ప్రౌఢదీర్ఘసమాసముల పొంతబోవడు. డొంకతిరుగుడు అన్వయములులేవు. పులుముడు పదములు దొరకవు. చెప్పదలచినదానిని సూటిగచెప్పి ప్రసాదగుణమును కలిగించును. అందనిభావములు లేకపోవుగాక ఉన్నభావములకు ఔన్నత్యము కొఱవడినదని చెప్పజాలము. 'ఆయువున్నఅపు కాలమునందు క్షణక్షణకష్టసుఖములు ఉత్తమాంశముల్.' అందియు ఎంతటి ఔన్నత్యమున గ్రాలుచున్నది ఆ వాక్యమునందలి భావము! ప్రసాదగుణమునకు మెఱుగువెట్టు ధారకలిగి జాషువాగారి పద్యములు 'శ్రవణసుభగంబగు సామగానమువలె' నుండును.

—సంపాదకుడు.




'గౌరీశంకరశిఖరద్వయము'

(శ్రీయుత వరదా వేంకటరత్నముగారు చిత్రించినది).



'జార్జి ఈస్టుమాన్'
(కోడక్ కెమెరా రాజు : 1854-1932.)

# శిశుప్రబోధము

మ. పురిటింటన్ జరణంబుమెట్టి, భువనంబున్ జూచి, కంఠంబు బొం
గురువోవం బలవింతువేమిటికి? నీకున్నాకలోకంబు క్ర
మ్మర రాదోయి దిగంబరీ! యిచటికామక్రోధలోభాలకున్
గుఱియైపోవక తప్ప దూఱడిలి, బంధువ్రాతమున్ దన్పుమా!

ఉ. ఏడువకన్న! నిన్నువలె నేడిచినారొకనాఁడు భూపతుల్
గూడ, మహీతలంబనెడు కుంపటిలోఁబడినాఁడ వప్పుడే
మూఁడునిమేషముల్ గడిచె ముందిక నీకుదయించి యెంద ఆ
శ్లేషతురో: యెఱుంగ మిది సృష్టిరహస్యమురా! స్తనంధయా!

శా. ఊరుంబేరును లేక యేగగనమందో లీనమై యున్న యా
త్మారాము న్నిను, రక్తమాంసయుతకుంభంబందు బంధించి, ని
స్సారంబైన మనుష్యసంఘలనివాసప్రాప్తి శాసించినాఁ
డేరాజో, యతఁడే సమర్థుఁడగునోయీ! ముక్తి నీకీయఁగన్.

చ. చవిఁగొనినావు నీజననిచన్నుల ప్రప్రథమైకదుగ్ధబిం
దువుఁ బెనుమాయలోఁబడి కనుంగవమూసితి వూఱడిల్లి, మా
నవతఘుటిల్లె, యిచ్చటి క్షణక్షణికపుసుఖంబు లల్లనన్
గవిసె, త్వదాయువున్నఱకు కాలమునం దవి యుత్తమాంశముల్.

క. పరమంబగు వత్సలతా
శరనిధియనఁజాలుతల్లి సముఖంబున నీ
మరణంబువఱకుఁదఱుగని
బరలోకసుఖంబు కొంత ప్రతిబింబించున్.

—జి. జాషువ.

# ప్రణయసరణి

## ౧

'పోనీ ఇప్పటికయినా తీరింది'

'మీకు ఇప్పటికీగూడా తీరలేదుగా?'

'నీకు తీరకనా, మీవాళ్ళకుతీరకనా ఇన్నాళ్ళాలస్యం చేసింది?'

'రమ్మని ఒక కార్డుముక్క వ్రాయడానికి మీకుతీరక. తెలిసిందా? చేతిముత్యాలు రాలిపోతాయి కాబోలు వ్రాస్తే?'

'రాదలుచుకున్నవాళ్ళకు రమ్మని వ్రాయనవసరము లేదు. రాదలుచుకోనివాళ్ళకూ రమ్మని వ్రాయనవసరములేదు. ఇహ కార్డుముక్క అవసరమేముందీ?'

'చాల్లెండి నేర్చుకుపోయారు! మీరేమిచేసినా మీకు బాగానేఉంటుంది. ఇతరులు ఆ అంటే తప్పు ఊ అంటే తప్పు నారాయణ అంటే...'

'ఏమి టీ ఉపన్యాసం? మీఊళ్లో ఆడవాళ్ళ క్లబ్బులో ఉపన్యాసాలు అలవాటుచేసుకొని వచ్చినట్టున్నావే?'

'అవును మాట్లాడితే ఉపన్యాసమే. పోనీ ఒక్క కార్డు వ్రాయగూడదూ?'

'ఎందుకు వ్రాయగూడదూ? వ్రాసిందాకా ఉంటే బాగుండేదికాదూ?'

'నెలలా, సంవత్సరాలా?'

'వ్రాసిందాకానూ. అయినా తీరావచ్చి, కార్డు వ్రాయలేదని సాధింపేమిటి? కార్డు వ్రాయలేదని మనస్సులో ఉన్నదానవు అది వచ్చిందాకాఉంటే భేషు. ఈతడవ అట్లా......'

'ఇంకా ఈతడవగూడానూ సిగ్గులేక. ఇహ పోనే పోను లెండి'

'ఇహ ఎట్లా నేనుండలేను నీవుపుట్టింటికి పోకపోతే'

'అలాగే ఉంటుందిలెండి. తలనొప్పి, దరిద్రం తన దాకావస్తేనేకాని తెలియవుట. ఓ నాలుగురోజులు అమ్మను నాన్నను చూడకుండా ఉండలేరుగాని'

'నిజమే. అయితే సరేకాని ఏం హడావుడిగా గదిలోకి దయచేశావు?'

'ఊరికేనే. రాకూడదా? వెళ్ళుతాలెండి'

'...........................'

'మరెందుకూ చెంగుపట్టుకోవడం. వదలండి. నన్ను వెళ్ళనివ్వండి' (పోకుండా వెనక్కు తగ్గుతూ)

'కోపము వచ్చినట్లుందే నిమిషంలో?'

'చేతగానికోపం ఎందుకూ నాకు?'

'చేతనయితే ఏంజేస్తావో?'

'కోపమట! ఉత్తరం వ్రాయకపోగా......గదిలో పనుండదు గామాలు?'

'ఉండనీ. దానికి కోపమెందుకు?'

'ఆ ప్రశ్నేమిటి? హృదయంలో అంతకాఠిన్యం ఎలా సంభవమో నాకర్థంగావడంలేదు మాకు చేతగాదు సుమండీ.'

'బొత్తిగా చేతగాదు. కార్డు వ్రాయలేదని నెలరోజులు రావడం మానుకున్నావుగాని'

'నేను సాధించానన్నారుగాని మీసాధింపు బాగుందేమిటి?'

'మను బాగుందా? నన్ను అడిగిందా?'

'బాగుండకూ? నేనక్కడ ఉన్నానని రాకపోతే మానె మనూ, విశ్శి ఎంతో కలవరించారు బావబావని. వాళ్ళను చూడడానికైనా రాకూడదూ?'

'వాళ్ళను చూడడానికి నీవక్కడుండగానే రావాలెనని ఏధర్మశాస్త్రంలోనూ లేదే?'

'పోనీ నేనున్నాననే రావచ్చునుగా?'

'ఆమాట నీవు మొదటఅనలేదే?'

'ఎప్పుడో అప్పుడన్నాను మీరు రానిదానికి ఎప్పుడంటేనేమి?'

'తీరలేదు'

'అవును! పాపం!! బొత్తిగా తీరికేది? అందులో మీముఠా కసలే తీరికలేదు. బయస్కోపులు, నాటకాలు, విందులు, క్లబ్బులు, చీట్లపేకలు...'

'కొంచెం సాక్షిపోకడకూడా సంపాదించావే. కానీ'

'మను. అక్కా— బావను చూడాలనే, నేనుకూడా వస్తానంది'

'తీసుకు రాకపోయినావు?'

'మరీ బాగుంది. ఒక కార్డైనా దాన్ని తీసుకురమ్మని వ్రాయలేదు గాని...'

'మళ్ళీ ముక్తాయింపు కార్డుమీదికి వచ్చిందీ? చిన్నవాణ్ణి నాకేం తెలుస్తుంది కార్డువ్రాయడం, మర్యాదానూ? పెద్దవాడు, ఒకరికి చెప్ప నేర్చినవాడు మీనాన్నే నిన్ను తీసుకువెళ్ళుతూ, మాటవరసకైనా నన్ను రమ్మనక పోవచ్చు?'

'ఏదో సాధిస్తూనేఉంటారు ఎప్పుడూనూ. నాకు పనుంది వెళ్ళనీయండి.

'వెళ్ళు. ఎవరువద్దన్నారు? నీపని కాగానే నీవు వెళ్ళక పోయినావు?'

'అవును. అవును. అంతేలెండి.'

మాట్లాడినంతసేపూ అతని ఉత్తరీయంకొంగు వేలికి వేసుకొని మెలేబెట్టుతూనేఉన్నది ఇందిర. 'అవును. అవును అంతేలెండి' అని తలఊగిస్తూ బలవంతంమీద అతని వాటులోనుంచి తప్పించుకొనిపోయింది. ఆ సమయంలో ఆమెకండ్లలో వెల్లివిరిసిన సౌందర్యానికి ఆమె కండ్లు తనివితీరా ముద్దాడవలెనని అతనికి ప్రబలమైన ఉద్దేశం కలిగిందిగాని ఆమె చిక్కలేదు.

## ౨

భార్యాభర్త లిద్దరూ కలుసుకొని నెలరోజులైంది. ఒకర్నివిడిచి ఒకరు ఉండలేకపోయినమాట కూడా నిజమే.

అందుకనే వచ్చీరావడంతోటే భర్తగదిలో ఉన్నాడా అని చూచి భర్తతో ఖులాసాగా మాట్లాడవలెనని వెళ్ళింది ఇందిర.

పుట్టింటఉన్న నెలరోజులలోనూ నాలుగుసార్లు ప్రయాణమయింది. 'ఇంటిదగ్గర బొత్తిగా అన్నం అమరదమ్మా. మా అమ్మమ్మ పెద్దది. వేళకుచేయడమూ చేతగాదు. కనపడీ కనపడక అన్నీ మాడ్చి వేస్తుంది' అని ఏవేవో సాకులుచెప్పింది బయలుదేరడానికి.

వాళ్ళ అమ్మ పడనివ్వలేదు కార్డుఅయినా రాలేదనే కారణంచేత. ఇందిరా కొంచెం బెట్టుసరిచేద్దామని అనుకున్నది.

భాస్కరుడు మాత్రం భార్యను చూడాలెనని ఉబలాటపడకపోలేదు. అయితే మామగారితో పదిరోజులలో పంపమన్నాడు. పదిరోజులలో రాకపోతే అతనూ బెట్టుసరిచేశాడు.

అతని నాయనమ్మ 'పిల్ల అక్కడఉండగా వెళ్ళిరారా నాయనా' అని రెండుమూడుమాట్లు ప్రోద్బలంచేసింది. 'మాటవరసకయినా రమ్మనంది ఏమి వెళ్ళి రానమ్మా' అన్నాడు.

'మనపిల్ల ఉన్నప్పుడు వాళ్ళు రమ్మనేదేమిటి అన్న'దావిడ.

'కాదులే. నాకు తీరదన్నాడు' భాస్కరుడు. పదిరోజులలో వాళ్ళు రాకపోతే ఉత్తరంవ్రాయమని నిర్బంధించింది. సరేలే సరేలే అని చివరకు వ్రాశాలే అని తప్పించుకున్నాడు.

చివరకు భాస్కరుడిబెట్టుసరే గెలిచింది.

ఇందిర మూర్ఖంచేసి 'వెళ్ళకపోతే మీ అల్లుడికి కోపంవస్తుంద'ని బయలుదేరింది. రాగానే భర్తతో మాట్లాడడానికి గదిలోకివెళ్ళింది. అక్కడా అతనే గెలిచాడు. ఇద్దరి ఉబలాటమూ ఒక్కటే అయినా అతను తొణకనందువల్ల ఆమె ఓడిపోయినట్టు తేలింది.

## ౩

సాయంత్రం భర్తకు గదిలో ప్రక్కసర్ది, తమలపాకులు చుట్టిబెట్టి, వంటచేయడానికి మడికట్టుకున్నది. ఇందిర.

భాస్కరుడు షికారువెళ్ళి స్నేహితులు సినీమాకు రమ్మంటున్నా 'కొంచెంపనిఉన్న'దని ఇంటికి వచ్చాడు.

భార్య వంటచేయడం చూచి నాయనమ్మతో 'నాయనమ్మా! పాపం వంటచేయడం అలవాటు బొత్తిగా తప్పిందికామాలు. ఈపూటకు అట్లాగే నీచెయ్యే కాల్చుకోక పోయినావు?' అన్నాడు.

'నేను ఆమాటే అన్నానురా, నాయనా నెలరోజులనుంచీ వండుతున్నదాన్ని. ఈ ఒక్కపూట వండలేకపోతానా? మీ ఇద్దరికీ ఒకసారే అన్నము పెడతాను. పనిత్వరగా అవుతుంది అన్నాను. వినలేదు.'

'పైగానా? ఇన్నిరోజులు నిన్ను వేధించడంగాకుండా, నేవచ్చిగూడా నీకెందుకూ ఇబ్బంది. త్వరగారావలెనని తొందరపడ్డా వీలుకాలే.'

'పోనీలే! ఇబ్బందేముంది?'

'భాస్కరుడు స్నానంచేసి భోంచేస్తూ 'వంటచేశావుగా. భోజనానికి కూర్చోకపోయినావు నాయనమ్మ వడ్డించేది? పొద్దున ఎప్పుడు భోంచేశావో?' అన్నాడు. ఇందిర ఎంగుకు లెమ్మని తానే వడ్డించింది.

భోంచేసి వెళ్ళి తమలపాకులు వేసుకుని పడుకున్నాడు. ఒకపావుగంట అలాగే ఏదో చదువుతూ పడుకున్నా, ఇందిర ఇంకా వచ్చేప్రయత్నంలో ఉన్నట్టు కనపడలే. చదువు సాగకపోతే పేపన్ను ఆడుకుంటూ కూర్చున్నాడు.

ఎంతసేపటికి ఇందిర రాలేదు. తొమ్మిదయింది. ఇంకా పనికాలేదా అని చూస్తే ఇందిర అమ్మమ్మ మంచంప్రక్కన మంచంవేసుకుని పడుకుంది.

'ఇక్కడగాలి ఇంకాచల్లగానే ఉంటున్నదే మంచు కూడా కురుస్తున్నది. లోపలపడుకోక పోయినావా?' అన్నది అమ్మమ్మ.

'లోపల ఉక్కబోసేట్టుంది' అని ఇందిర జవాబిచ్చింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నారు.

భాస్కరుడు కొంచెంసేపు అలాగే ఆడుకొని పడుకున్నాడు. నిద్రమాత్రం పట్టలేదు. లేచి వాకిట్లోకి నాళ్ళమంచాల ప్రక్కగానే నడిచి వెళ్ళాడు. ఇందిర లేచి నుంచొని భాస్కరుడు గదిలోకి వెళ్ళగానే మళ్ళీ పడుకుంది.

వెళ్ళుతూ, వస్తూ భాస్కరుడు ఇందిరవైపు చూశాడు. కాని ఇందిర అతనివైపు చూడలేదు.

కొంచంసేపుఆగి భాస్కరుడు 'తమలపాకులు, పోకచెక్కలు ఇచ్చిపో' అన్నాడు.

'అదేమిటమ్మా అక్కడ ఎదురుగానేఉంటే? ఈ మధ్య చత్వారంగూడా వచ్చిందాఏమిటి?'

కిక్కురుమనకుండా ఆమిగిలిన తమలపాకులు మళ్ళీ వేసుకున్నాడు.

* * * *

మళ్ళీ కొంచంసేపు అయినతర్వాత.

'కాసినిమంచినీళ్లు కావాలెనోయి' అన్నాడు.

'అక్కడే ఉన్నాయిచూడండి, పట్టెమంచం క్రింద చెంబూ గ్లాసూనూ?'

భాస్కరుడు చప్పుడుగాకుండా ఆనీళ్లు కిటికీలోనించి క్రింద పారపోశాడు.

* * * *

మళ్ళీ ఒక అయిదునిముషా లయింతర్వాత.

'మంచినీళ్ళు ఇంకాసిని ఇచ్చిపో' అన్నాడు.

'అన్నీ అప్పుడే తాగేశారానేమిటి?' అంటూ ఇందిర ఇంట్లోకివెళ్ళి సన్ననిఉప్పడంఅంచు తెల్లగా ఇస్త్రీచేసిన చీరెగట్టుకుని, చక్కగా సింగారించుకొని నీళ్లుతీసుకుని గదిలోకివచ్చింది.

భాస్కరుడు కదలకుండా పడుకున్నాడు. 'మంచినీళ్ళివిగో' నన్నది ఇందిర. అతను కదలలేదు. ఇందిర చక్కిలిగింత పెట్టింది. భాస్కరుడు నవ్వుతూదొర్లాడు. లేచికూర్చున్నతర్వాత మంచినీళ్ళు అందించింది. చెంబు నోటిదగ్గరైనా పెట్టుకోకుండా అక్కడబెట్టి ఇందిరను దగ్గరకు తీసుకున్నాడు.

'ప్రొద్దుటిబెట్టుసరేమయిందీ?' అన్నది ఇందిర.

'ప్రొద్దునలేనిబెట్టుసరి ఇప్పుడెక్కడనుంచి వచ్చిందీ' అన్నాడు భాస్కరుడు.

——మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ బి. ఏ.

# గుసగుసలు

స్థలము : ఒక చక్కని తోట　　　　ప్రవేశము : మల్లెపూవు నీలిపూవు

సమయము : రాత్రి 12 గంటలు.

[భూమిపై ప్రాకుచున్న మల్లెతీగెకు ఒక చక్కని పూవుపూసింది ; అతిసమీపము లోనే ఒకచిన్ని అడవితీగె కొకనీలిపూవు పూసింది—ఒయ్యారంగా ఒకప్రక్క కొరిగిన మల్లెపూవును ముద్దెట్టుకోబోయింది గాలితాకున చెంతనున్న నీలిపూవు—తెల్లచీరె సవరించుకొని కండ్లన్నీ విప్పిచూచి....'అవతలకు జరుగు' అన్నది మల్లెపూవు.]

నీలిపూవు :—ఆ కాలం దాటిపోయింది.

మల్లెపూవు :—ఏమన్నావు !

నీ :—ఏమన్నా నేమిటి ! నీకెంత గౌరవము లోకంలో ఉన్నదో, నాకు అంతే ఉన్నదీ అని....

మ :—చాలు ! చాలు ! ఎవరైనా వింటే నవ్విపోయేరు ! నీ నల్లని రూపంతో, వన్నెకు వాసికిరాని నీకులముతో, నాతో సమానమైన గౌరవంపొందుతావా ?

నీ :—కండ్లన్నీ విప్పిచూడు.

మ :—ఎందుకు ?

నీ :—నేను కవులచే పొగడబడినాను; నేను గౌరవింపబడుతున్నాను.

మ :—ఏ వాఙ్మయంలో !

నీ :—ఆంధ్రవాఙ్మయంలో.

మ :—ఎప్పటిమాట ?

నీ :—ఆధునికాంధ్రవాఙ్మయంసంగతి.

మ :—సరెలే ! ఆధునికాంధ్రకవుల కొక నియమమున్నది గనుకనా !...నీమీదా వ్రాశారు పద్యాలు ?.

నీ :—దర్జాగా ! ఒక్కసారి పాతభారతి పత్రికలు తిరుగవేయకపోయావా ?

మ :—ఈకాలంలో, కవిత్వం వ్రాయడానికేది అర్హమైనవస్తువో తెలిసినవారేరి ? నీలిపూవుమీదా కవిత్వమే !—బిచ్చగానిమీదా కవిత్వమే !—మురికిగుంట మీదా కవిత్వమే !

నీ :—చాలు ! చాలు ! పూర్వకాలపు మాటలింకా పోలేదా ? కాలము మారినపుడు కవిత్వం మారదా ?

మ :—ఔను ; చాలామాటలు నేర్చేరు ఈ రోజులలో ! నాకొలది జీవితకాలము లోనే ఎన్నెన్నో విషయాలు వింటున్నాను. ముఖ్యంగా ఆధునికాంధ్రవాఙ్మయం మాటవిన్నప్పుడల్లా హృదయం పగిలిపోతున్నది.........కవులకు స్వాతంత్ర్యము బలసిపోయింది ; వ్యాకర్ణం వెనుకబట్టింది ; ఛందస్సు చదలుపట్టిపోయింది ; నియమం, ఏర్పాటు చేసే కవిరాజు లేడు—ఏర్పడియున్న నియమం తప్పితే దండించే భూనాయకుడు లేడు. వెధవ బిల్లులన్నీ ప్యాస్ చేయకపోతే, కవిత్వంలో నియమాలు తప్పినవారికి, అన్యభాషాపదాలు చేర్చి వాఙ్మయాన్ని కలితీచేసిన వారికి, శిక్షతప్పదని ఒక శాసనం తయారుచేయగూడదూ, మన మద్రాసు శాసనసభ ? రక్తంకలితీవల్ల జాతి పాడైపోతున్నదని జర్మనీవారీమధ్య ఒకశాసనం ప్రవేశపెట్టలేదూ ? ... ...

ప్రతివారు ఏదోఒక విషయాన్ని పురస్కరించుకొని వ్యాసాలు వ్రాసేవారే! మాట్లాడేవిధంగానే వ్రాయాలని పర్లాకిమిడివైపునుండి ఒకటే పెడబొబ్బలు!.... ...ఆధునికాంధ్రవాఙ్మయ జగత్తంతా కూడా అల్లకల్లోలంగా ఉన్నది—కండ్లు మూసుకుంటే ఏకొలది నిముసాలకో రాలిపోయే నాకెందు కీగోల? ఆంధ్రవాఙ్మయానికి రానున్న దురదృష్టపు రోజులనుగాంచి భయముకలుగక తప్పదు: అంతేకాని మరేమి లేదు

సీ:—ఈలాంటి భయంతో నీవు రాలిపోతే, మరల పుట్టకతప్పదు ఈభయం ఇప్పుడే తీర్చుకోవడం మంచిది. అయినా నామాటలు వింటావనే ధైర్యం. లోకంలో దేనికైనా అంతుకలదుగాని, కాలానికి లేదు. కాలం గడచినకొలది ప్రతివస్తువులో మార్పు వచ్చి తీరుతుంది. దాదాపు ఒక నూరుసంవత్సరముల క్రిందనున్న పరిస్థితులు నేడు లేవు. పరాత్పరుని సృష్టిలోనే అప్పటికి ఇప్పటికి మార్పు స్పష్టంగా కనబడుతున్నది......డార్విన్ థియరీ ప్రకారము చూస్తే కొన్నివందల సంవత్సరాలకు పూర్వము మనుష్యులంతా కోతులవలె ఆకారంగలిగి ఉండేవారట, కాలంగడచిన కొలది క్రమేణ ఈ 20 శతాబ్దికల్లా ఒకవిధమైన ఆకారాన్ని పొందేరు. ఇంకా వేయిసంవత్సరాలు గడిచినయెడల వేరే వింతరూపము మనుష్యులకు రావచ్చును. ఈవిధంగా రూపాలే మారిపోతున్నప్పుడు అభిప్రాయాలు, అభిరుచులు, ఆశలు, ఆశయాలు మారటములో విచిత్ర మేమున్నది? దేశముయొక్క నైసర్గికపరిస్థితులలో నైనా మార్పురాక తప్పదు; కొన్నివందల సంవత్సరాలైన తరువాత బెజవాడ ఆనకట్టకు రెండువైపులా కృష్ణానది సందు చేసుకుని రెండుపాయలుగా ప్రవహింపవచ్చును; దానికి సమీపములోనున్న కొండలన్నీ కోతబడి నేలమట్టం కావచ్చును........రమ్యహార్మ్యలలో, ఉద్యానలమంచాలమీద నిమీలితనేత్రాలతో ఆనంద మనుభవించుచున్న తాము ఒక అర్ధగంట కాలములో ఇండ్లులేక పాడుదిబ్బలమీద ప్రాకులాడవలసి వస్తుందని ఎన్నడైనా అనుకున్నారా బీహారు ప్రజలు? కాలముయొక్క ప్రభావం ఆలాంటిది. బాహ్యప్రపంచాన్ని ఆవిధంగా అల్లడితల్లడిచేస్తూఉన్న కాలం, కేవలం భావనాప్రపంచముమీద ఆధారపడియున్న వాఙ్మయాన్ని కల్లోలపరచకుండా పోతుందా? కృష్ణాస్రవంతికి వక్రగమనం నేర్పేకాలం భాషాస్రవంతిని ముక్కుసూటిగా ప్రవహింపజేస్తుందా? సీసము, సిమెంటులతో బందోబస్తు చేయబడిన ఆనకట్టలే, కాలంగడచిన కొలది బలహీనమై తెగిపోతుంటే భాషాస్రవంతికి అడ్డంవేసిన నియమాలు నిలువగలవా? సజీవమైనభాష వర్షాకాలంలోని కృష్ణాస్రవంతివలె పొంగి పొరలవలసినదే; ఉపనదులు నీరుతెచ్చి పోసినట్లు, క్రొత్తపదములు, ఇతరభాషా పదములు, వచ్చి చేరవలసినదే; భాష అభివృద్ధి కావలసినదే;

ఆంధ్రసామ్రాజ్యలక్ష్మికి పసుపుకుంకుమల ప్రాప్తి తప్పిపోయి చాలసంవత్సరాలు గడచినవి. మహమ్మదీయుల పరిపాలనా కాలమున వారి భాషాపదములగు 'ఫసలి', 'తహశీలుదారు' మొదలగునవెన్నియో మనభాషలో చేరినవి. తరువాత

ఆంగ్లేయులపరిపాలనా కాలము వచ్చినది; ఇప్పుడు 'రోడ్డు', 'సప్లయి', 'పేపరు' మొదలగునవి లెక్కింప వీలు లేనన్ని పదములు వచ్చిచేరినవి; ఇతర రాష్ట్రములందు నివసించుచున్న ఆంధ్రు లెందరో ఆయా ప్రాంతముల వారిభాషాపదములను వాడుకలోనికి తెచ్చుకున్నారు. ఈ పదములను మనమిపుడు తీసివైచినచో మనయాటసాగదు; మనభాష మనకే క్రొత్తయగును. ఇట్లు అన్యభాషాపదములు ఏయేకారణముల మూలముననైనా మన భాషయందు చేరక తప్పదు. ఇందులకు చింతపడవలసిన పని లేదు. భాషయందుమార్పు లెప్పుడు కలిగినవో, భాషాసంప్రదాయములయందుగూడ మార్పువచ్చి తీరుతుంది. ఆంగ్లభాషా ప్రాబల్యమువలన నే[illegible]నభాషలోనికి, ఖండకావ్యములు, చిన్నికథలు, క్రొత్తతీరు విమర్శనలు వచ్చిచేరినవి. ఎచ్చట మంచికలదో దానిని భద్రపరచుకోవడంతప్పా!

మ:—నీవు చెప్పేది వినడానికి సొంపుగానే ఉన్నది... ..అయితే ఈ కల్లోలానికి కారణ మేమిటి? కర్తలెవరు?

నీ:—మానవుల అభిరుచియందు భేదంతో పాటు వాఙ్మయంలోగూడా భేదం కలిగి తీరుతుంది

పంచమ వేదమైన భారతమును అనువదించి ప్రశంసల నందిన నన్నయభట్టునకు నిలయమైన రాజమహేంద్రవరమే నేటికి, తెలుగువాని విజ్ఞానానికి మూలస్థానముగాఉన్నది. వీనుమిగిలిన నేటికవులలో చాలమంది అచ్చటే ఉన్నారు. ఆంధ్రవాఙ్మయవాహిని కడ్డముగానున్న ఆనకట్టయొక్క ఇనుపతలుపులను సాహసించి కొంచెం తెరిచాడు వీరేశలింగంపంతులు. ఆయన యుగపురుషుడు, ఆంధ్రవాఙ్మయంతోపాటు ఆయన ఇంకా జీవించేఉన్నాడు; ఎప్పటికీ ఆలాగే ఉంటాడు. తరువాత శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవులు దారితీశారు. 'జెండాపై కపిరాజు' అనే వీరిపద్యంలోని 'జెండా' శబ్ద ప్రయోగానికి ఆరోజులలో పండితప్రకాండు లందరూ గర్జించారట సింహాలకువలె! ఇంకా మన మప్పటికిపుట్టలేదు, ఆవిషయాన్నిగూర్చి విపులంగా మాట్లాడడానికి క్రమేణ వాఙ్మయంలో మార్పుకన్పించింది, సాహితీసమితి మొదలగు సంఘములుఏర్పడినై; కథలు, ఖండకావ్యాలు, బయటపడినవి. ఇంతలో పర్లాకిమిడి కొండకోనలనుండి గర్జించింది, రామమూర్తిసింహము: వ్యవహారికభాష అములులోనికి రావలెనని. ఇందుకు పత్రికలనిండా విమర్శనలే; దానితో ఎఱ్ఱపెన్సిలు చేతపట్టారు రామమూర్తిగారు, విమర్శించేవారి గ్రంథాలలోని లోపాలను లోకానికెరిగించారు, పూర్వకవులుగూడా తమ కాలము నాటి వ్యవహారిక భాషనే గ్రంథాలలో వాడేరని నిదర్శనాలు చూపించారు ...దీనికి తోడు ఆధునికాంధ్ర కవికుమారులను బాగా ప్రోత్సాహపరచినై పత్రికలన్నీ : ఎన్నోవిధములైన వింత రచనలతోటి ఆంధ్రవాఙ్మయవధూటియొక్క కళ్యాణమహోత్సవంరోజు కట్నాలు పంపించారు కవికుమారులంతా. ఈవిధంగా మంగళప్రదమైన మార్పు వాఙ్మయంలో కలిగింది.

మ:—ఐతే పూర్వకవులను వీరిముందు పనికిరానివారంటావా?

నీ:—ఈప్రశ్న ప్రస్తుతం అందరూ అడుగుచున్న దే; కొంచెం ఆధునికులను గూర్చి అభిమానంగా ఉన్నట్లు గ్రహించిన వెం

టనే ప్రతివారు ఇదే ప్రశ్న !! ... ... పూర్వకవులకు రాజాదరణ బాగా ఉన్నది; వారు ఆ రాజునకు మెప్పించడానికి రసవంతమైన గ్రంథాలు వ్రాశారు. వారు అన్నివిధాలా పూజనీయులు. వారిని ఎవరూ విమర్శించరు. లాక్షణికకవులు, ప్రబంధకవులు, శాస్త్రకవులు, ఆంధ్రీకరణకవులు, కావ్యకవులు, ద్వ్యర్థికావ్యకవులు, శతకగేయ కవులు, తమనేర్పుకొలది గ్రంథాలు వెలయించారు. వారికాలమున కవి అనుగుణంగా ఉన్నవి, మనంకూడా మనకాలాని కనుగుణంగా పోవడం తప్పా ! అప్పటికి ఇప్పటికి శబ్దజాలంలో మార్పులేదా ? నన్నయలోని 'వలపదు' అనేశబ్దము, 'వలదు', 'వల్దు', 'వద్దు', 'ఒద్దు'గా మారిపోయినది. 'వచ్చినవాడను', 'వచ్చినాడను', 'వచ్చినాను', 'వచ్చాను', 'వచ్చా'గా మారిపోయినది. ఇప్పుడు విభక్తిప్రత్యయములలో నివికొన్ని నన్నయకాలములో లేనే లేవు. 'కొఱకున్', 'వలనన్', 'లోపలన్' అను విభక్తి ప్రత్యములు నన్నయకాలములో కానరావు ఇప్పటి సప్తమీవిభక్తిలోని 'అందు' అను ప్రత్యయము నన్నయలో 'నీయందధికధనంబుగొని' అను వింత అర్థములో గానవచ్చుచున్నది. ఇట్లు ఎన్నేని చూపవచ్చును. ఈవిధంగా భాషంతా మారిపోయినపుడు, ఆ 13 డవ శతాబ్దపు భాషనే ఈ 20 వ శతాబ్దంలో గ్రంథాలలో వ్రాయమనడం పొరపాటు కాదా ! అట్లా వ్రాయనివాళ్ళంతా పూర్వకవులను నిరసించినవారౌతారా? ఆ 13 డవ శతాబ్దపు భాషనే మనం వ్రాస్తుంటే, మృతభాషకును, జీవద్భాషకును భేదమేమి యుండును ? ఇనుపపట్టాలతో బిగించినా, జీవద్భాష నిలుస్తుందా ? 'శబ్దస్థితి లోకవ్యవహారమును బట్టి గ్రహింపవలెను' అన్నారు పెద్దలు. అయితే 'లోకము'ను శబ్దానికి శిష్టలోకమన్నారు. అప్పుడు శిష్టులెవరని ప్రశ్న వచ్చింది. మొన్నటివరకు, కవిత్రయం వారిని, శ్రీనాథుని, కలిపేరు కొందరు; కొందరు పోతన్నను తోసి రాజన్నారు. కారణమేమిటి ? శకటరేఫకు, రేఫకు ప్రాసవాడేడట ! అర్థబిందు ప్రయోగం పాటించ లేదట ! ఎంత అన్యాయం ? ... నిజంగా తెల్లవాడు మనభాషను ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్టు అన్నప్పుడు, అర్థంకాకపోయినా, పోతన్నగారి పద్యాలలోని సంగీతము వినే అన్నాడనుకుంటాను ... .... సరే ! పండితులు మాట్లాడేభాషను వ్రాయవచ్చును అని మనస్సు కుదిరించుకొన్నారు కొందరు బుద్ధిమంతులు పండితులు సులభముగా అర్థమయ్యేరీతి మాట్లాడగలరు గదా. బిచ్చగాడు ఇంటికి వస్తే "భిక్షుకా ! తండులంబులు నిండుకొన్నవి చెచ్చెరబొమ్ము" అని కొక్కొండ వెంకటరత్నం పంతులుగారివలె మాట్లాడేవారు చాలాఅరుదు. అట్లామాట్లాడినా లోకంలో వ్యవహారం ఎంతవరకు సాగేదీ తెలియనివారున్నారా ? ప్రస్తుతం ఇంగ్లండులో పార్లమెంటువారు, రాజకుటుంబమువారు ఉపయోగించే భాషను ప్రమాణంగా తీసుకొనుట లేదా ? అలాగే మనపెద్దలు మాట్లాడే భాషను మనం గౌరవించగూడదా ?

మ :—భాషసంగతి అల్లాఉంచు. పద్యాలలో భావాలు ఏలాగున్నవి ? ఎప్పుడు ప్రియురాలని ... ........ఇదేగా గోల !

నీ :—ఇది రెండవపొరపాటు. ఆధునికాం

ధ్రకవికుమారుల గ్రంథాలు చక్కగా చదివితే ఆవిషయం బోధపడుతుంది; ఇందు, కొందరి పద్యాలలో గనుపించే లలితమైన భావాలు మన వాఙ్మయానికి నూతనములు. ఆంగ్లవాఙ్మయానికి కీట్సు, షెల్లీలవలె ఆంధ్రవాఙ్మయానికి రాయప్రోలువారు, దువ్వూరివారున్నారు; ఈ నూతనయుగానికి ఆహ్వానగీతములు పాడారు.

'పూలబిడ్డల ప్రీతి నుయ్యాలలూపు
పవను డెరుగడు తొడిమలు సడలుననుచు'

.......................................

మొదలగు, సుబ్బారావుగారి గీతములు ఆంధ్రవాణికి అలంకారములు. వెంకటపార్వతీశ్వరకవుల ప్రకృతిపరిశీలనము, సహితీసమితివారి, అందు ముఖ్యముగా శివశంకరశాస్త్రిగారి రచనలు, ఆంధ్రవాఙ్మయానికి నూతనత్వాన్ని తెచ్చిపెట్టినై; శాస్త్రిగారిని ఆంధ్రుల లీహంట్ అన్నారు మంగిపూడి వెంకటశర్మగారి రచనలు హితోపదేశములతో నిండియున్నవి; నిజంగా వారు వ్రాసిన 'మద్దుకత'ను జూచి తెనుగున కింత తియ్యదనముండా అనుకున్నాను. అదేమి దౌర్భాగ్యమోగాని తెలుగువాని కేవిధంగా స్వాతంత్ర్యం లేదు; తనభాషను సంస్కృతానికిబానిసగా చేశాడు. ఎన్ని సంస్కృతశబ్దాలు వాడితే అంత పెద్దకవి! తెనుగునుడికారములోని తియ్యందనం తెనుగు బాసయొక్క కులుకుందనము తెనుగువాడే తెలిసికోలేకపోతే తెనుగుతల్లిగతి ఏమికావలెనో!

ఏవిధంగాకూడా ఆధునికాంధ్రకవికుమారుడు అనాదరింపతగినవాడుకాడు. 'విశ్వనాథ'వారికలం ఏదారిని ఏవిధంగా నడపమన్నా నడుస్తుంది! ఆధునికభాషలోని క్రొత్తరుచులు చవిచూడాలంటే వారి రచనలన్నీ చదవగలిగితే చాలు ... ...కవితాశిల్పమెంత రమణీయముగా ఉన్నప్పటికి, అది ఆధునికకవికుమారునిచే వ్రాయబడినదనగానే, విసిరివేసే మహనీయులుండబట్టే, ఇంతగోలకు కారణం! కొంతమంది కులములను బట్టి కవిత్వంయొక్క గొప్పదనం నిర్ణయించేవారున్నారు!

మ:—రాజకీయరంగములోని కులముల విచారణ వాఙ్మయరంగములోనికి వచ్చుటకు వీలు లేదే!

సీ:—నీకు లోకం బాగా తెలియదు. పది రోజులక్రింద, మన పొదలవద్దనే, ఒక యువకుడు ఓకశాస్త్రుల్లగారికి, జాషువాగారి పద్యాలు వినిపించాడు ఆదరంతో; బాగున్నవా? అన్నాడు. 'చాలాబాగున్నవి, కర్త ఎవ'రన్నా డాశాస్త్రిల్లు. 'జాషువాగారండీ, క్రైస్తవులు,' అని జవాబురాగానే 'ఛీ! ఛీ! ఏమి బాగుగా లేవు; అచ్చట అసభ్యంగా ఉన్నది, ఇచ్చట తప్పులున్నవి' అని ముఖంచిట్లించాడా నశంకాయశాస్త్రిల్లు. ఇల్లాంటి దురభిప్రాయాలుండబట్టే, మన బ్రతుకిట్లాఉన్నది. ఈలాంటివారుండబట్టే, ఆ కవి ఒకచోట:

గీ. కులములనుబట్టి మంచిచెడ్డలను గొలుచు
స్వార్థలోలుర వాచాలబలముచేత
గట్టువడియున్న తెలుగుభూఖండమందు
క్రైస్తవుల కందు కవుల కెక్కడిది? బువ్వ.

అని వాపోయినాడు; చెప్పకుంటే సిగ్గుచేటు. ఇది వాఙ్మయానికి పెద్దమచ్చ—చెరగని మచ్చ!

మ:—ఇతరవిషయాలలో నీతో నేను వాదులాడినప్పటికి, ఈలాంటి విషయాలలో

మాత్రం, నేనూ ఒక వేడి నిట్టూర్పు విడువకపోను అభివృద్ధిలోనికి వచ్చే కవులను సిగసించి, వారికి అధైర్యం కలిగించి, నిరుత్సాహ పెట్టేవారు, వాఙ్మయానికి గర్భశత్రువులు కాకపోరు. భావికాలంలో విరియబూసే పూలతీగెను లేత ప్రాయమందే గిల్లివేసినట్లు!, ప్రపంచములో ఏ వాఙ్మయంలో లేవు ఈలాంటి విషయాలు, ఇది మనదురదృష్టమె!

నీ :— సంతోషము! అట్టి అభిప్రాయం అందరికీ లేదు. ఈ రోజులలో వాఙ్మయం, పాడయిపోతున్నదని, పాడయిపోయినదని రోదన చేయువారెందరో ఉన్నారు. ఒకరు చెపితే వినరు, తాము దయతో పరిశీలించరు! — ఇది కలికాలం, కలికాలపు కవిత్వం; చెడిపోయింది, — మారిపోయింది — వచ్చి బూతులు గ్రంథాలలోకి ఎక్కుతున్నవి — అని బిక్క మొగము పెడ్తున్నా రెందరో! వీరంతా, రైళ్ళలో అమ్మబడే ఏ 'గుంటూరు గుంట'నో చూచారనుకుంటాను!... ...దయతో.... ఆదరముతో ... చిరునవ్వుతో ...వీను మిగిలిన ఆధునికాంధ్ర కవికుమారుల రచనలలో ఏఒక్క గ్రంథమైన చదవాలని; మంచి హృదయంతో చదవాలని, మనవి చేస్తున్నాను.

నేడు తెనుగుతల్లి 'తెనుగుతోటలో' చక్కని 'జడకుచ్చులు' ధరించి, ఎట్టి 'ఆవేదన'లు లేకుండా, 'కావ్యకుసుమాంజలి' ఘటించి, 'మునిమాపు' వేళ, తన భావియభివృద్ధినిగోరుచు, విశ్వమయునకు 'ఏకాంతసేవ' జేయుచున్నది. పరాత్పరునకు దయరాదా? తెనుగుబాని విజ్ఞానమును ఖండాంతరములందు వ్యాపింపజేయుడా? ద్రావిడభామలలో నెల్ల తెలుగే నేడు క్రొత్తశృంగారములతో నున్నది ... ... ..... ..... ....అభిప్రాయములను మార్చుకొనవలెను .... నిజమును గ్రహించవలెను.

మ :— నీ యుపన్యాసం, నన్ను మార్చివేసినది.... నీ పలుకులలో సత్యము లేకపోలేదు.... అదిగో తెల్లవారినది.... మనుష్యులు వచ్చుచున్నారు.

నీ :— ....ఆకులమాటునకు....

--చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.

'మామిడిపండ్ల పేళ్ళను గురించి'

అను ఆంధ్రభూమి గతమాసపు సంచికలోని వ్యాసం చాలబాగున్నది. ప్రసాదమైన హాస్యముగల అట్టివ్యాసాల బహుళప్రచురణం తమరు తప్పక ఆదర్శంగా పెట్టుకుంటారని తలుస్తాను. బంగినిపళ్ళప్రస్తావనలో రాయలసీమ ఆంధ్రులకు, ఉత్తరసర్కారుల ఆంధ్రులకు గల చుక్కఎదురుతనాన్ని సూచిస్తూ ఈ వ్యాసకర్త చాల చమత్కారముగా వ్రాసినాడు. ఇవి మామిడిపళ్లు బహుళంగా వచ్చేరోజులు అట్టిసమయంలో ఈవ్యాస ప్రచురణము కాలానుగుణ్యంగా ఉంది అనకతీరదు. కలక్టరు మామిడ్జిగురించి, సువర్ణరేఖ మామిడ్జిగురించి వ్యాసకర్త చేసిన ప్రస్తావన లలితమైన హాస్యమునకు తావిస్తూ ఉన్నది. ఒక్కచోటమాత్రం — ముదిరితే పొడుం బుర్రలుగామాత్రం పనికివచ్చే మారేడుకాయల్ని, వైద్యులు సకృతుగా పథ్యవస్తువుల్లోమాత్రం చేర్చే దానిమ్మకాయల్ని, ఊరగాయ పెట్టుకోడానికికూడా పనికిరాని గజనిమ్మకాయల్ని, పసుపుపచ్చగా పండినా పులుపు విడని దబ్బకాయల్ని స్త్రీల అవయవాలలో పోల్చి మన పురుషకవులు రుచివిస్తారంగల మామిడిపళ్ళను వారిధర్మిమానా రానియ్యకపోవడంలో గొప్పకుమ్మక్కు ఉండితీరాలి — అన్నచోటమాత్రం హాస్యం కొంచెం వెగటుగా ఉన్నదని నాభావం. కాని మాయింట్లో ఆడవాళ్లు చదివి మామూలుగ నవ్వేశారుగాని తప్పుపట్టినట్లు కనబడలేదు. పమిటలేని స్త్రీచిత్రమును ముఖచిత్రముగాగల గృహలక్ష్మిని చూచుటకు, బూతుకథలే వినోదమనే వినోదినిని చదువుటకు అలవడినవారికి వెగటుహాస్యపు సరిహద్దునఉన్న ఆవాక్యములు ఏవపుట్టింపవనే చెప్పవలసిఉంది.' — ఆర్. శ్రీరామమూర్తి, బి.ఏ.

# బాల్యస్నేహం

## ౧

"మా సొంతగొడవలలోనే మాకు తలమునకలై వుంటే నీ గొడవకూడా ఎవరికి కావాలి" అని పాఠకులు నన్ను నిరుత్సాహపరచరని తలుస్తాను. ఈ నా కథలో నా సోదరీమణులు నేర్చుకోవాలిసింది ఏమీ వుండదని నేననుకోను. ప్రస్తుత మనేకమంది భారతీయ స్త్రీలకు మల్లేనే నాకుకూడా చదువనూ, వ్రాయనూ రాకపోయేవుంటే మిమ్మల్ని ఈ పది పదిహేను నిముషాలు ఇలా కూర్చోపెట్టగలిగేదాన్ని కాను. మన తెలుగుభాషలో కాస్త అభిరుచీ భారత భాగవతాలు చదివి అర్థంచేసుకోగల శక్తీ నాకు మోహనరావనే బాల్యస్నేహితుడు కల్పించాడు. జన్మజన్మాంతరాలవరకూ అతనికి నేను కృతజ్ఞురాలను. ఏదో ఇంతజ్ఞానం ప్రసాదించి నా కతను ఆధ్యాత్మికసహాయం చేశాడు.

అతడు నాకు బాల్యస్నేహితుడన్నాను. అవును. అతనికుటుంబం మాకుటుంబం ఇరుగుపొరుగునవుండి చాలకాలంనుంచీ మైత్రితో వుండేవి. మేమిద్దరమూ అప్పుడు బాలోచితమైన ఆటపాటల్లో కలిసిమెలిసి వుండేవాళ్ళం. వాళ్ళనాన్న మమ్మల్ని రోజూ సాయంత్రంపూట పొలాలకేసి షికారు తీసికెళ్ళేవారు. మా అమ్మ నాకు పూలపరికిణీ, సిల్కుజాకెట్టూ తొడిగి పంపేది. నారాయణరావుగారి వెనకాలే మేమిద్దరము చెట్టాపట్టాలు పట్టుకొని ఏమో మాట్లాడుకుంటూ వెళ్ళేవాళ్ళం. చూచేవాళ్ళంతా చాల ముచ్చటపడి మాకు భార్యాభర్తల సంబంధం కట్టేశారు.

ఇరుగు పొరుగు ఆడవాళ్ళంతా నన్ను చూచినప్పుడల్లా "మోహనరావు భార్య" "మోహనరావు భార్య" అని నవ్వేవాళ్ళు. అప్పుడు నాకు ఉడుకుమోతుతనంవచ్చి కళ్ళనీళ్ళపర్యంతం అయ్యేది. మా అమ్మ నన్ను దగ్గరకు తీసికొని ముద్దుపెట్టుకొని చెంపలు దువ్వితే అంతా మరచిపోయి వాళ్ళతోటలో ఆడుకునేదాన్ని. అతడు పూలన్నీకోసి నాచేతుల్లో పోసేవాడు. ఏమీ తెలియని నా బాల్యహృదయం అప్పుడెందుకో ఉబికిపోయేది. ఆసంతోషంలో లేడిలాగా మా అమ్మ దగ్గరకు పరుగెత్తుకొనిపోయి చెండుగుచ్చి నా జడలో పెట్టించుకుని మళ్లీవచ్చి నా స్నేహితునికి చూపించేదాన్ని.

ఈ బాల్యమిత్రుడు నా భర్త కావాలన్న వుద్దేశం నాకెప్పుడూ లేదు. అతన్నే నేను వివాహం చేసుకుంటే అతనిమీద నాయిప్పటి అధికారమూ, చనువూ ఉండదని అనుకునేదాన్ని. అతడు హైస్కూలుకు పోతూవుంటే మాయింటిచావడిలో నిలుచుని కనుపించే అంతవరకూ పేరుపెట్టిపిలుస్తూ అల్లరిచేయడానికి వీలుండదని నావూహ. ఇప్పుడు మల్లే పుస్తకం చేతపట్టుకపోయి అతని తొడమీద కూర్చుని పాఠం చెప్పించుకోటానికి ప్రతిబంధకమౌతుందని నా ఉద్దేశం. స్వామిరావుగారి కూతురులాగా పండుగకు మొగడువస్తే గదిలోనే బియ్యపుబస్తాచాటున దాగికొని ఉండాలేమో నని నాభయం. అందుచేత నేను మోహనరావును పెండ్లి చేసుకోవాలని అనుకోలేదు. దాంపత్యబాంధవ్యం కంటే ఒక ఉత్కృష్టసంబంధం మా యిద్దరినీ బంధించి వున్నదనిమాత్రం నా హృదయంలో ధ్వనించేది.

నా స్మృతిపథంలో ఎక్కడో దూరాన్న మసక మసకగా కనుపిస్తూన్న నా బాల్యదశలో విద్యుద్దీపాల్లాగా ప్రకాశిస్తూన్న కొన్ని అనుభవాలు మాత్రమే మీకు చూపిస్తున్నాను. పాఠక సోదరీమణుల హృదయాలు ఈ సమయంలో, తమకుగూడా ఇల్లాంటి అనుభవాలున్నాయేమోనని, ఒక్కసారి తమ బాల్యావస్థకేసి చూచుకుంటున్న వనుకుంటున్నాను. కొందరు నా అప్పటి సౌఖ్యజీవితానికి అసూయపడుతూ ఉండొచ్చు. కాని తరువాత వినండి.

మోహనరావప్పుడు మెట్రిక్యులేషన్ క్లాసులో చదువుకుంటున్నాడు. అతడు చాల అందగాడనీ, నాకు తగిన వరుడనీ, ఆడవాళ్ళంతా మాయింట్లో మాటింగు చేసినప్పుడల్లా అనుకుండేవాళ్ళు. కాని నేనుమాత్రం

అతని సౌందర్యం ఎప్పుడూ విమర్శించలేదు. నిండా పూచివున్న గులాబిచెట్టు చూస్తే నాకంటికింపుగానే వుంటుంది. సూర్యుడస్తమిస్తూన్నప్పుడు తారంగులు చూస్తే మానవాతీతమైన ఒక శిల్పిహస్తం నాకు స్ఫురించేది. సాయంకాలం షికారుపోయినప్పుడు తోటల్లో నాకానందంగానే వుండేది. కోయిల కూసినా, పిట్టలు బారులుకట్టి ఆకాశమార్గాన ఎగిరిపోతున్నా, ఉత్సాహంతో నా స్నేహితునికిగూడా చూపించేదాన్ని. కాని ప్రకృతిసౌందర్యమంతా మనుష్యవ్యక్తిలో కూడా ప్రత్యక్షమై వుంటుందని అప్పటి నాబాల్యహృదయానికి తోచనేలేదు. అంచేతనే మోహనరావు శరీర సౌందర్యం నన్నాకర్షించలేదు. ఇతరబాలురకంటే అతడు చాలా మంచివాడనిమాత్రం నామనస్సు చెప్పేది. గొప్ప తెలివైనవాడనికూడ నమ్మకం. అందుకు మెట్రిక్యులేషన్ పరీక్షలో అసూళ్ళోకల్లా ప్రథముడుగా కృతార్థుడుకావడం సాక్ష్యం.

నారాయణరావుగారొకరిటైర్డుఉద్యోగి. ఆయన్ని అందరూ ఎరుగుదురు. కాని ఆయనతో ముఖాముఖి పరిచయంకలవాళ్ళు తక్కువ. ఆయనది మితంగా మాట్లాడే స్వభావం కాలానుసరణంగా సంఘంలో మార్పు అవసరమనే వారిలో ఒకరైనా—'సంస్కర్త' అనే పేరుకోసం ఆయనెప్పుడూ ఏమైదానంమీదా ఉపన్యాసం ఇచ్చియుండలేదు. ఆయనమీద ఆధారపడియున్న సంస్థ ఒకటీలేదు. వచ్చే 'పెన్షన్'తో ఆయన ప్రశాంత జీవితం గడుపుతుంటున్నాడు. ఉద్యోగంచేస్తున్న రోజుల్లో సంపాదించిన డబ్బు చాలావరకు బ్యాంకులోవున్నదని వదంతి. ఎలాగున్నా మోహనరావుమాత్రం ఒక గొప్ప ఆస్తికి వారసుడు. అందుచేతనే పరీక్షాఫలితాలు తెలిసిన తరువాత మానాన్న నన్ను మోహనరావుకిచ్చే విషయాన్ని నారాయణరావుగారితో కదిపేడు. అమ్మకూడా నారాయణరావుగారికుటుంబముతో సంబంధం చేసే విషయంలో చాలా ఉబలాటపడుతూనే వుంది. నాకుమాత్రం పెండ్లిఅంటేఎందుకో అర్థంకాలేదు. పైగా అసహ్యాకరమగు బండికాడిలా కనుపిస్తున్నది.

మోహనరావు తాను బి. ఏ ప్యాసయ్యేటంత వరకూ పెండ్లిచేసుకోనని వాళ్ళనాన్నతో గట్టిగా చెప్పేశాడు. అందుచేత నారాయణరావుగారికి మానాన్న వేసిన మంత్రం పారలేదు. మావివాహం జరుగలేదు. నాప్రియమిత్రుడు ఇంటర్మీడియేటు చదివేనిమిత్తం మద్రాసు పోయాడు. అప్పటికి నేను పదునొకండు వసంతకాలాలు మాత్రమే చూచివున్నాను.

## ౨

ఆధ్యాత్మికశక్తికీ, పరమాత్మకూ ఉండే సంబంధాన్ని వ్యక్తీకరించి భార్యాభర్తలకు ఈ ప్రాపంచిక జీవితంలో ఒక చైతన్యాతీతజ్యోతిని ప్రత్యక్షం చేయడమే వివాహముయొక్క ముఖ్యోద్దేశం. వివాహమనేది స్త్రీ పురుషుల ప్రత్యేకశక్తులను ఏకంచేసి ద్విగుణీకృతోత్సాహంతో కార్యరంగంలో పనిచేయిస్తుంది. కాని ఇప్పుడు ఆశయానికీ ఆచరణకూ చాలదూరం వున్నది. కేవలము జంతువులవలె కామముతీర్చుకునేటందుకూ, చచ్చిపోయాక శ్రాద్ధాలు పెట్టేనిమిత్తం కుమారుణ్ణి కనేటందుకూ మాత్రమే పెండ్లి చేసుకుంటే వివాహోద్దేశం నెరవేరిందని చెప్పలేము. ముఖ్యంగా మన హిందూదేశంలో వివాహమనేది అనేక యువతీయువకుల పురోభివృద్ధికి ఆటంకమౌతున్నది. చెప్పుకోటానికి సిగ్గౌతున్నది—చిరకాలమునుంచీ ఆధ్యాత్మికదేశమంటూ పేరున్నికగన్న మన ఆర్యావర్తంలో వరకులాకులతోను, కన్యాశుల్కాలతోను ముక్కుపచ్చలారని పసిపిల్లల రక్తమాంసాలు కొనుక్కుంటున్నాం.

పన్నెండు సంవత్సరాల యీడుగల ఆడపడుచు భారతగృహస్థుని కంతభారంగా వుండడానికి కేమిటి కారణం? నాపెండ్లికోసం మానాన్న అంతగా మథనపడటమెందుకు? ఆ యీడులో పెండ్లికాని ఆడపిల్లలు నేనుతప్ప మరెవ్వరూలేరని నలుగురూ అనుకుంటూంటే మాత్రం మనంచేసిన పాపకార్యం ఏమున్నది! అయినా, నాకప్పుడు వివాహంచేయడమనేది నాకుగాని, మానాన్నకుగాని ఆవశ్యకమైనదని సహేతుకంగా ఎవరు చెప్పగలుగుతారు?

నా వివాహవిషయమై మా తండ్రిగారు స్వయంగా కల్పించుకున్న దిగులుతో పెండ్లికుమాళ్ళకోసం అంగళ్ళ

వెతుకుతున్నాడు. నేనేవో చిన్నచిన్న పుస్తకాలు తేలిగ్గా అర్థమయ్యేవి చదువుకుంటూ కాలంగడిపేదాన్ని. ఎక్కడైనా సందేహమువస్తే నారాయణరావు గారి దగ్గరకుపోయి నివృత్తిచేసికొనేదాన్ని. మోహనుడు వెళ్ళినప్పటినుంచీ ఈ విశాలప్రపంచంలో నేనొక్కదాన్నే వున్నట్లనిపించేది. అతడు పోతూ నాజీవితమాధుర్యాన్నికూడా తీసికెళ్ళినట్లున్నాడు.

ఈ ప్రపంచములోని ప్రాణశక్తుల అన్నింటిచలనము ఈ అఖిలవిశ్వము వెలుపటనున్న ఒక అనంతప్రాణశక్తిపై ఆధారపడివున్నదని తోస్తుంది. దేశకాల నిమిత్తాలతో బంధింపబడివున్న సామాన్యమానవహృదయం ఆ అనంతప్రాణశక్తిని తనయిచ్ఛకు లోబరచుకోలేదు. అందుకనే లోకంలో అనుకున్నది జరక్క విరుద్ధ ఫలితాలు కలుగుతూండటం. ఆమధ్య అకస్మాత్తుగా మా మేనమామ భార్య చచ్చిపోయినప్పుడు,—ఎలాగైనా నన్ను మోహనరావు చేతుల్లోనే పెట్టాలని దృఢాభిప్రాయంతో వున్న మా అమ్మకూడా ఒక్కసారి మారిపోయింది. అకస్మాత్తుగా ఇప్పుడు తన అన్నగారి కొకపెద్దవిపత్తు సంభవించిందనీ, నావంటి పెండ్లికీడేరినకూతురు తనకున్నప్పుడు ఆ సమయంలో తన అన్నయిల్లు నిలబెట్టకపోతే నలుగురూ నోట్లో వుమ్మివేస్తారనీ, ఆమె చాలసార్లు మా నాన్నతో చెప్పింది. ఆయనమాత్రం ఈడూజోడూకాని సంబంధం చేయజాలనని గట్టిగా చెప్పుతూవచ్చాడు. అందుచేత మా యింట్లో కొన్నాళ్ళవరకూ అంతఃకలహాలు రేగినై. మా నాన్న చాల కలవరపడ్డాడు.

మా మామ మమ్మల్ని చూడ్డానికి మా యింటికి వచ్చాడు. ఆయనకు జీవితంలో ముప్పాతికభాగం చెల్లిపోయింది. ఇక జరాక్రాంతం కావలసిన ఒకపాతికపాలు మాత్రమే వున్నది. చిన్నప్పుడాయన నన్ను తనకూతురులాగా ఎత్తుకొని ఆడించి అదీ ఇదీ కొనిపెట్టిన వాడు.

ఒకనాడు నేను వంటయింటిగుమ్మంలో నిల్చుని మా అమ్మ కూరగాయలు తరుగుతూంటే చూస్తున్నాను. మా మామవచ్చి నాబుగ్గ పొడిచి "ఏంవే పిల్లా! నన్ను పెండ్లిచేసుకుంటావా? చాల సొమ్ములు పెట్టుతాను" అంటూ నవ్వేడు. ఆ అనార్యశృంగారానికి మా అమ్మకూడా నవ్వింది. నేను సిగ్గభినయింపలేదు రంగంలో. అసహ్యంకలిగింది.

మా మామ చాలధనవంతుడే. గుంటూరులో ఆయన కొక పెద్దమేడ వున్నది. ఆ మేడలో నేనిక కాపురం చేయబోతానని మా అమ్మకు సంతోషమే. ఈడూజోడు విషయంలో అల్లాంటి పెండ్లిళ్ళు అనేకం జరుగుతూనేవున్నవని ఆమె సమాధానం.

ఒకచెంప భార్య వుపన్యాసాలూ, మరోచెంప బావమరిది బ్రతిమిలాడటం, మరోవంక ఆర్థికపరిస్థితి క్లిష్టంగా వుండటం,—అన్నీకలసి మా నాన్నను కలవరపెట్టినై. రోజులుగడవగా చెల్లాచెదరై అతని హృదయంలో తికమకలుగా పరుగెత్తుతూన్న ఆలోచనలన్నీ చివరకు మా అమ్మ అభిప్రాయంతో ఏకీభూతమైనవి.

పెండ్లికి మా నాన్న కంతగా ఖర్చుకాలేదు. వివాహయజ్ఞం పూర్తిఐంది. దానికి ఆహుతీ అయిన యజ్ఞపశువును నేనే.

## 3

వివాహమైన మూడునెలలుకూడా పూర్తిగా నిండకముందే మా మామ నన్ను తన అదుపు ఆజ్ఞల్లో వుంచుకునేటందుకు నాకేవో కొన్నిపాఠాలు నేర్పుకుంటానని గుంటూరు తీసికొనివచ్చాడు. కాని మా మామ శరీర పరిస్థితి ఆరోగ్యమైనది కాదని మీకిదివరకే చెప్పియుండవలసినది. ఆయనకు మొదటిపెండ్లి అయినా, ఈడుముదిరిన తరువాతే జరుగుటకుకూడా ఆయన చిన్నతనంలో చేసిన దుందుడుకుపనులే కారణం. ఆనాటి తన చెడు ప్రవర్తనకు ఫలం, మా మామ నేడనుభవిస్తున్నాడు. మూడు సంవత్సరాలనుంచీ ఆయన మంచం దిగడంలేదు; పక్షపాతంవచ్చి కాళ్ళూ చేతులూ పడిపోయినై. లేచి రెండడుగులు వేయడానికికూడా శక్తిలేదు. మలమూత్రవిసర్జనాదులుకూడా మంచందగ్గరే. ఈ కర్మవిపాకానికి నేనాయన యింట్లో కాలుపెట్టిన వేళావిశేషమని కొందరన్నారు. నిజంగా ఒకని సుఖదుఃఖాలు మరోవ్యక్తియొక్క పాదచిహ్నాలమీద ఆధారపడి వుండేయెడల నేను ద్రోషినే.

ఈ మూడేండ్లనుంచీ గుంటూరులో నాజీవితం సుఖమయమైనదని చెప్పలేను. అట్లని మా మామమీద నే నేవిధమైన దోషారోపణా చేయజాలను. ప్రతిరోజూ మధ్యాహ్నముపూట భోజనాత్పరం నేనాయన మంచం దగ్గిర కూర్చొని కాళ్ళుపిసికేదాన్ని. అప్పుడాయన పడుకునివుండీకూడా నన్ను దగ్గరకుతీసికొని, ముద్దెట్టుకునేవాడు. నన్నెత్తుకుని ఆడించిననాటివాత్సల్యం నాయందు మామామకు పూర్తిగా వున్నదికదా అనితృప్తిపడేదాన్ని. ఆయన పరిచర్యలో ఏమరివుండేదాన్ని కాదు.

నాకు పదునాలేండ్లు వచ్చినవి. సావిత్రీ, దమయంతీ మొదలైన పతివ్రతల కథలు నాచేత చదివించేవాడు మా మామ. సుకన్యోపాఖ్యానమంటే ఆయనకు చాలా యిష్టం. నేను స్వచ్ఛంగా, స్ఫుటంగా చదువుతూంటే ఆయన ఆశ్చర్యపోయేవాడు. అప్పుడు నేను నాచిన్ననాటి గురువును మోహనరావును జ్ఞాపకంతెచ్చుకుని నారాయణరావుగారి కుటుంబములో మా మామకు పరిచయంచేసేదాన్ని. అలా మోహనుని గుణకీర్తన చేయడంలో నే నొక కవయిత్రి నైపోతున్నానా అనుపించేది. కాని నాకవిత్వం మా మామ హృదయంలో వేరభిప్రాయంతో ధ్వనిస్తుందని నే నెప్పుడూ అనుకోలేదు.

ఒకనాడు నన్నాయన ప్రశ్నించాడు: "పిల్లా! ఒకవేళ నేనీవ్యాధిలో చనిపోయే యెడల మళ్ళీ ఎవరిని పెండ్లి చేసుకుంటావు? మోహనరావును..."

"మామా! దిగులుపడకు. నాజాతకంలో అసలు పెండ్లిఅంటూ లేనేలేదు."

"ఒకమారైందిగా."

"అది నేను కోరివుండలేదు నీవే నన్ను వివాహమాడేవు."

ఈ మాటలు మా మామ ఏవిధంగా అర్థంచేసుకునేదీ నే నూహించలేదు. ఆయన ముఖవైఖరిలో కొంచెం మార్పుకలిగింది. "నీవుమాత్రం పాశ్చాత్యనాగరకతాతరంగంమీద చలిస్తూన్న ఆధునికస్త్రీలోకా కి చెందినదానవు కావా?" అంటూ కన్ను మూసికొన్నాడు.

ఆయన కేమో కోపం వచ్చిందని గ్రహించాను. నా అజ్ఞానాన్ని క్షమించమంటూ ఆయన్ని అనునయించాను, నారింజపండ్లరసం పిండినగ్లాసు ఆయన పెదవులకందిస్తూ.

నాటినుంచీ స్త్రీల సౌశీల్యాన్ని శంకించే వాళ్ళు విధించే కట్టుబాట్లకు నేనూ లోనుగావలసి వచ్చింది. మనుష్యవ్యక్తి కొన్నికట్టుబాట్లలో వుండడ మనేది మంచిదే. కాని ఆకట్టుబాట్లు వ్యక్తిత్వాన్ని నశింపచేసేవైతే దేశాభ్యుదయంలేదు.

ఆ విశాలమైన భవనంలో మేమిద్దరమే కాపురం ఉంటున్నది. అప్పుడప్పుడు జయప్రదాదేవివచ్చి నాకు లోకాభిరామాయణం చెపుతూ ఉండకపోతే నాకు ప్రొద్దుపోయేదేకాదు. ఆ అమ్మాయి చాల తెలివితేటలుగలపిల్ల. పదునాల్గేండ్ల చిరుతప్రాయంలో అందులో స్త్రీకి అంత ప్రపంచజ్ఞానం ఉండటమనేది చాల అరుదైనవిషయం. ఆమెభర్త కీవూళ్ళో గోతాలదిల్లులో పని. వాళ్ళీవూరువచ్చి ఆరునెలలు కావస్తున్నది. మాయింటిప్రక్కనే కాపురం ఉంటున్నారు.

జయప్రదతో నాకు స్నేహంకలసి నప్పటినుంచీ, జీవితం చాలభాగం సంతోషంతోనే గడిపేస్తున్నాను. ఆమె సహజంగా హాస్యప్రియ. ఆమె వాక్చాతుర్యం మరొకవ్యక్తికి బాధాజనకంగా ఉండదు. ఆమె నవ్వితే మరెవ్వరినీ ఎగతాళి చేసినట్లుకాదు; మనంకూడా ఆమెతోపాటు నవ్వేస్తాం హృదయం తేలికయ్యేటట్లు. నే నామెను 'జయం' అని చనువుగా పిలుస్తాను.

ఎందుచేతనో ఆమధ్య మాయింటి కామె రావడం మానేసింది అయిదారురోజులు. నా కేమీ తోచలేదప్పుడు. ఒంటరిగా ఖైదీకిమల్లే కాలంగడిపేను. ఎందుచేత రాలేదో అని పరిపరివిధాలా ఆలోచించాను. ఆ నాలుగురోజులూ నాకు యుగాల్లాగా తోచినై.

ఆమె రాకపోతే నేనన్నాపోయి పిలుచుకునివద్దామని ఆనాడుమధ్యాహ్నం బయలుదేరాను. సూర్యుడు మబ్బుచేత ఆచ్ఛాదింపబడివున్నందున ఎండనిపించలేదు. అయినా దూరముకాదు కనుక శ్రమ అనుపించలేదు. చివర కామెయింటివద్దకు చేరుకున్నాను. లోన గడియ వేయబడియున్నది తలుపు.

తలుపుతట్టబోతూ 'జయం.' అని కేకవేయ సిద్ధముగా వున్నాను. ఇంతలో గవ్వలు గలబరించినట్లుగా

ఆమెనవ్వు నాకు వినుపించినది. తలుపుసందులోనుంచి లోనికి తొంగిచూచా. ఆమెభర్త హాల్లో ఒక పడక కుర్చీమీద కాళ్ళుచాచుకుని పడుకున్నాడు. అతనిఒడిలో ముద్దులు మూటకట్టుతూ కూర్చున్నది జయం. ఏ పరియాచకమాడి భర్తనువంచించి నవ్వుతున్నదో ఆవిలాసిని! అది ఆ ఏకాంతవాసులకే తెలియాలి.

అంతా చూచాను. నా కన్నుల కది అపూర్వప్రదర్శనమైపోయింది. అలా గేచూస్తున్నా. నాశరీరము కంపించుతున్నది; భయముకాదు. ఒడలు గరు దాల్చినది; కోపముకాదు.

బలవంతముగా నాశరీరమును ఎట్లో మోసికొనిపోయి ఇంటికిచేర్చితిని. కొంతసేపు పండుకుని లేచునప్పటికి మరల తేరుకున్నాను.

## ౪.

మరునాడామె మా యింటికి వచ్చినప్పుడు నాహృదయముప్పొంగిపోయింది. ఇల్లంతా కళకళలాడింది. నా గదిలో పాలగచ్చు చేసిన నేలమీద చిరిచాపపరచి ఆమెను కూర్చోబెట్టి అడిగేను:

"ఏమమ్మా! జయం! ఇన్నాళ్ళనుంచీ నామీద శీతకన్ను వేశావ్రా! మీవారు మా యింటికి రావద్దని చెప్పేరా?"

'ఆశ్చర్యంగావుంది మీరడిగిన ప్రశ్న' అంటూ ఆమె మందహాసం చేసింది.

"ఏమి! అల్లాంటి అధికారం భర్త భార్యమీద చలాయించుకుంటే తప్పా? శృంగారించుకుని గుమ్మములో నిల్చుండరాదనీ, పరపురుషునితో మాట్లాడకూడదనీ, పొరుగింటికి పోవద్దనీ భర్త భార్యను విధించడం సహజం!"

"అసూయాగ్రస్తుడైన ఒకానొక వ్యక్తి విధించేక్రూర చట్టాలతో మగజాతికంతకూ శాశ్వతమైన కళంకాన్ని ఆపాదిస్తున్నావు. మావారెప్పుడూ నన్ను నిర్బంధపెట్టరు. ప్రేమ స్వేచ్ఛలోనే వృద్ధిచెందాలని మాఉద్దేశం."

"మరి నీవు మాయింటికి రాకపోవడానికి కారణం?"

"మొన్న క్రైస్తవులహోర్వెస్టుపండుగ. యజమాని క్రైస్తవుడు కనుక 'మిల్లు'కు ఆదివారంతోసహా నాలుగురోజులు సెలవువచ్చింది. అంచాత దొరక్కదొరక్కదొరకిన అవకాశాన్ని పోగొట్టుకోకుండా ఇద్దరమూ ఆటపాటల్లో గడిపేవాళ్ళం కాలం. సాయంత్రం రోజూ సినీమాకు వెళ్ళేవాళ్ళం మొదటిఆటకు."

"నామీద కోపం వచ్చిందేమో అనుకున్నా సుమా?"

కాదు. మావారింట్లోఉంటే ఎకచకలతో, పకపకలతో మాకంతలో ప్రొద్దు కృంకిపోతుంది అందుకనే మాకు చిల్కాగోరింకలని పేరెట్టింది మా బామ్మ." అంటూ గలగలా నవ్వింది జయం. ఆ నవ్వు మా విశాల భవనంలో తరగల్లా వ్యాపించిపోయి మా మామ చెవుల్లోకూడా దూరిందేమో, 'ఎవరితో పిల్లా! నీ సల్లాపాలూ' అంటూ ప్రశ్నించాడాయన నన్నుద్దేశించి.

"నేనేనండీ! తాతగారూ! జయప్రదను." అని జవాబిచ్చింది ఆచిన్నది.

"ఆయన నీకు తాతగారైతే, నేను నీకు అమ్మమ్మనా? నాయనమ్మనా?' అని అడిగేను నేను ఆమె బుగ్గమీద మెల్లిగా తట్టుతూ

"నీవు నాచిన్నక్కయ్యవు."

"ఎలాగా?"

"నేను వయసునుపట్టి వరుస నిర్ణయిస్తాను."

ఆమెమాటలు నాకర్థంకాలేదు. గుమ్మంకేసి శూన్య దృక్కులు పారేస్తూకూర్చున్నా. సాయంకాలపు పైరగాలి చల్లగావీస్తూ మా జయప్రదాదేవి తలవెంట్రుకలతో ఆడుకుంటున్నది. కాస్సేపు మేమెవ్వరమూ మాట్లాడలేదు. ఇంతలో గోడమీది గడియారము ఐదు గంటల తరువాత అరగంటకొట్టింది. జయం వెంటనేలేచి "అక్కా! నేనుపోతా. మావారు ఆఫీసునుంచివచ్చే వేళైంది. వారి స్నానానికి వేన్నీళ్ళు కాచాలి," అంది.

నేను నవ్వుతూ తమాషాగా అన్నాను. "నాగరికత వడిసిన నీవంటి ఇరవయ్యోశతాబ్దపు పిల్లకూడా అల్లాంటి పనులు చేయవలసిందేనా? పురుషులు స్త్రీలను బానిసల్లా వుపయోగించుకుంటున్నారని నీవెప్పుడూ అనుకోవూ?"

"అది స్త్రీ తత్వం తెలీనివాళ్ళు పుస్తకాల్లో వ్రాసినమాట; నీ వెక్కడో చదివివుంటావు. నా అనుభవంలోమాత్రం భర్తృసేవ చేస్తున్నప్పుడు నేనొక

దాసీదాన్న నే భావం నాకెప్పుడూ కలుగదు. భర్తృసేవకు నన్ను ప్రేరేపేది నా హృదయంలోవున్న ఒక అనిర్వాచ్యమైన ప్రేమజ్యోతి. మావారికి సేవచేసే అవకాశం దొరుకుతే నాకు సంతోషం ''

ఆమె వాక్యాలు మంత్రాక్షరాల్లాగా నన్ను ముగ్ధురాలిని చేసివేసినై. వాటిఅర్థం నాకు పూర్తిగా తెలియలేదు. నాకు అగమ్యగోచరంగావున్న ఒకక్రొత్త విషయమేదో ఆమెకు పూర్తిగా అనుభూతమైవున్నదనిమాత్రం నాకు రూఢిఅయింది.

౫

ఆరాత్రి నాకు చాల ప్రొద్దుపోయేటంతవరకూ నిద్రపట్టలేదు. ఏవో పరస్పరవిరుద్ధములైన అనేక భావాలు నా హృదయంలో పరువెత్తినవి. దీపమార్పుకుని నా గదిలో మంచంమీదపడుకున్నా.

“జయప్రదాదేవికీ, నాకూ మంచి స్నేహంవున్నా, మా యిద్దరికీ, ఉత్తరదక్షిణ ధృవాలకుండే అంత అంతరం వున్నది. ఆమెది కేవలం సంతోషమయమైన జీవితం. ప్రపంచ మామె కొక నందనవనం. శరత్కాలపు వెన్నెల ప్రామికొని శోభాయమానముగనున్న ఒక మైదానమున తన సౌధము నిర్మించుకున్న దామె. అంధకారమంతా పుంజీభూతమైవున్న గహ్వరాలామె ఎన్నడూచూడలేదు.''

“ఆమె హృదయంలో ప్రేమతత్వాన్ని గుర్తించిన అనేకగ్రంథాలు వ్రాయబడిఉన్నవి. ప్రేమ అనే రెండక్షరాలూ ఆమె వుచ్చరించినప్పుడు ఆమెనోట అమృతం చిందుతుంది. ఆమెకన్నులు తేజఃప్రపూరితము లౌతవి.''

“ఆమెకు తనభర్తయెడల భావము నాకనుభవము కానిది. ఆమె భర్తను సేవిస్తుంది ; అందువలన ఆమెకు ఆనందం కలుగుతుంది. ప్రేమజ్యోతిట, ఆమెను భర్తృసేవకు ప్రేరేపేది.''

“ఆమె నాతో సంభాషిస్తూన్నప్పుడు ఆమె నావ ఆనందవాయువుతోడై ప్రవాహవేగంతో కలసి చల్లగా నడచిపోతుంది. నా పడవ హఠాత్తుగా ఒకరాతికి తగులుకుని అభాగ్యం సూచిస్తుంది.''

ఇల్లాంటి ఆలోచనలతో రాత్రి చాల ప్రొద్దుపోయేటంతవరకూ నిద్రపట్టని కారణంచేత తెల్లవారి లేచేసరికి చాల నీరసంగావుండింది శరీరం. నిద్రకండ్లు నులుముకుంటూపోయి మేడమీది కటకటాలముందు నిల్చుని ఉత్తరపువేపు బయలు అవలోకించా కాస్సేపు. అది హేమంతఋతువు కాబట్టి దట్టముగా అల్లుకునివున్న మంచుతెరలన్నీ అప్పుడప్పుడే మెరుస్తూన్న సూర్యరశ్మికి విచ్చిపోతున్నవి. గడ్డిమీద మంచుబిందువులు కొన్ని ముత్యాలవలె మెరుస్తున్నవి. దిక్కులన్నీ అజ్ఞానంలోనుంచి వెలుపలకు వస్తున్నట్లు తెలివి పొందుతున్నవి. నా హృదయంలో రేగుతున్న ఈ అవ్యక్తబాధ మాత్రం శాంతించలేదు. ఏసుతి మెత్తని హృదయతంత్రి మ్రోగుచున్నదో, ఏతీరని కోర్కె కలవరపెట్టుతున్నదో నాకే పూర్తిగ అవగతమగుచుండుట లేదు.

౬

మళ్ళీ ఎన్నాళ్ళకో నా పుట్టింటికి రాగలిగేను. మా తమ్ముని వుపనయనమంటూ మానాన్న వచ్చి నన్ను తీసికొనివచ్చాడు. గుంటూరులో మా మామకు వుపచారం చేయడానికి ఆయన పినతల్లికూతురును—విధవావిడను ఉంచివచ్చాము. తిరిగీ నన్ను త్వరగా పంపేయమనీ, ఆడపిల్ల పుట్టింట్లో అట్టే చాలకాలం వుండరాదనీ, మానాన్నకు మా మామ ధర్మోపదేశంచేసి నాకు సెలవిచ్చాడు.

నేను మావాళ్ళింటికిరాగానే నన్నుచూడ్డానికి ఇరుగుపొరుగు అమ్మలక్కలంతా వచ్చారు. నాలుగేండ్లనుంచీ నన్నుచూడనందున కొందరు నన్ను గుర్తించలేకపోయారు. “ఏమేపిల్లా! మొగుడంత తీపయ్యాట్టే. ఇన్నాళ్ళూ పుట్టిల్లు జ్ఞాపకంవచ్చిందికాదే'' అంటూ ఒక ముసలావిడ పరియాచకంచేసింది. “నాలుగేండ్లు కాపురంచేసినాకూడా ఒక్కగుంటడూ చంకకు రాలేదేమే'' అంటూ ఒకావిడ బుగ్గపోటు పొడిచింది. “ఎల్లకాలమూ గోగుకాడలా అల్లాగేవున్నావు ; లావు పడలేదే'' అంటూ ఓ పెద్దముత్తైదువ కుశలప్రశ్న. ఎవరికి తోచినట్లు వాళ్ళు పలుకరించారు.

జయప్రదాదేవి నా దగ్గిరవుంటే వీళ్ళందరకూ తగినట్లు జవాబిచ్చేదికదా అనుకున్నా. ఆ అమ్మాయిని కూడా రమ్మని చాల బలవంత పెట్టేను. కాని తనభర్తకు

పాటలుతిండి పడదనీ, స్నానపానాదులు సరిగ్గా జరగవేమోనని ఆమె భయపడ్డది.

నేను బయలుదేరేరోజున బండీ ఎక్కేవరకూ, ఆమె నాతోనేవున్నది. ఆనాడామె నాకు తనచేతులతో జడ వేసి, తగినచీర ఒకటి పురమాయించి, అలంకారమంతా ముగిసిన తర్వాత నన్ను నిలువుటద్దంముందు నిలబెట్టి "చూచుకో అక్కా ! నీ సౌందర్యం నిజంగా మూడు లోకాలనూ మోహింపజేస్తుంది" అన్నది, చూచుకున్నా. పూర్వం నారాయణరావుగారి వెనకాల మోహనరావుతో కలిసి షికారువెళ్ళినప్పటి నాకూ, ఇప్పటినాకూ, చాలా భేదంవున్నది. నా కన్నుల్లో ఒకవిధమైన లేట ప్రబలిపోయింది. నిజంగా నా తలవెంట్రుకలలోని నిగనిగ ఆకర్షణీయంగానే ఉన్నది. నా వక్షోభాగము మున్నతమై, సన్నని నడుంమీద ఆధారపడివుండటము ఒక మనోహరమైనమార్పు. నా శరీరంలోని ఈ పరిణామమంతా ఎందుకొరకో అనుకున్నాను. జయప్రద, చిరునవ్వు నవ్వుతూ "అక్కా ! నీపాప చూచుకుని నువ్వే సిగ్గుపడతావెందుకూ" అన్నది. ఆమెభావాలు ఆమెకే తెలియాలి.

చివరకు నాస్నేహితురాలి కౌగిలి విడిపించుకుని, బండీ ఎక్కాను. స్నేహపిచ్చిలమైన ఆమెహృదయం రెండు కన్నీటిబొట్లు రాల్చింది.

నేను పుట్టింటికి చేరుకున్న మరునాడు సాయంత్రం పూట నారాయణరావుగారి దర్శనం చేసికొందామని వారియింటికి పొయ్యాను. అప్పుడు వారిగదిలో లేరాయన. 'అయ్యగారు తోటలోవున్నారమ్మా' అనిచెప్పేడు వాళ్ళనౌకరు.

నేను సరాసరి తోటలోకి వెళ్ళుతూండగా మధ్యహాల్లో దక్షిణపువైపుగదిలో మోహనరావు కూర్చొని ఉంటే చూచాను కుర్చీలో. అతడు నన్నుచూడగానే 'సుశీ, సుశీ !' అని పిల్చేడు. ఆపిలవడంలో చిన్నప్పుడతనికి నాయెడవున్న చనువంతా బయటపడింది. కాని నన్నుమాత్రం సిగ్గ నేదివచ్చి ముంచుకున్నది. నేనతన్ని కన్నెత్తి పూర్తిగా చూడలేకపోయాను. కాని ఆచూచిన క్షణంలోనే, అతని నూగుమీసమూ, బలిష్ఠముగనైన అతని శరీరసౌష్టవమూ నామనసున కెక్కనేఎక్కినవి. నూత్నయౌవనము ముఖద్వారమునకు వచ్చాడతడు.

గదిలోకి వెళ్ళడమా ? వెళ్ళకపోవడమా ? సిగ్గేమో 'వద్దులే, వద్దులే' అంటున్నది. మాపూర్వపరిచయమేమో 'అతనిపిలుపు నిరాకరిస్తివా అతడు చిన్నపుచ్చుకుంటాడు సుమా ! మీరు స్నేహితులేగా. చిన్నప్పుడతనితో ఆడుకోలేదూ నీవు. ఇప్పుడైనావెళ్ళితే తప్పులేదులే' అంటున్నది.

ఎటూపోలేక అక్కడే కాస్సేపు నిల్చున్నా. మోహనరావే లేచివచ్చి నాచేయిపట్టుకుని 'రా. సుశీ ! నన్నప్పుడే మరచిపోయావా ?' అంటూ లోనికితీసుకొనిపోయి. కుర్చీలో నన్ను తనతొడమీద కూర్చోపెట్టకున్నాడు. నాకేమో కొంచెం భయంభయంగావుండింది.

అతడు నా వీపుదువ్వుతూ 'జన్మజన్మాలకు కూడా మనము విడిపోకుండా మనలను చిన్నప్పుడే బంధించివైవలేదూ మన బాల్యస్నేహం ! వచ్చిన అవాంతరాలన్నీ నశించిపొయ్యేవే' అన్నాడు మందస్వరంలో. జౌనని రాయిగ్రుద్ది చెప్పుతున్నట్లుగా నాహృదయం దడదడశబ్దంచేసింది. అతడు నన్నుగట్టిగా హృదయాని కదుముకున్నాడు.

చెట్టుమీదనుంచి సీమరేగుపండు క్రిందపడితే న్యూటన్ మహాశయునికి ఒకగొప్ప ప్రకృతి సత్యము గోచరమైనట్లు, మోహనరావు వాక్యమువలన ఆసమయంలో నాకు జీవితరహస్యమంతా గోచరించింది. నా ఆత్మమీది ఒకముసుగు విడిపోయి అనంతలోచనములు విప్పినట్లయింది. నా కెఱుకపడకుండ హృదయంలో ఇన్నాళ్ళనుంచీ అణగివున్న కొన్నిరహస్యవిషయాలు వెలుగులోనికి వచ్చినవి. కనుక్కున్నాను: నాఆత్మ ఇన్నాళ్ళనుంచీ మథనపడుతున్నది ఈ పుణ్యమూర్తికోసం, ఈ సౌందర్యపురుషునికోసం. అతని విశాలవక్షంలో తలజానిపి, అప్రయత్నంగా నాచేతులతో అతనికంఠము పెనవైచుకొని పంకుకున్నప్పుడు శరీరమే మరచిపొయ్యాను; జీవితసౌఖ్యమంతా ఆక్షణంలోనే అనుభవించాను.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

# చందమామ

౧

కలువపూవులకు చక్కిలిగింత పొసగించి కొసరి మాటికి నవ్వుకొనగ మురిసి
వలగొన్న మబ్బుకన్నెలగూడి వేడుకతోడ దాగిలిమూతలాడి తనిసి
తళుకుచుక్కల కన్నుగిలుపుల కడగంట పిడిసిన చిరునవ్వు పొడల కడరి
విరబారు మున్నీటి తరగగుర్రాల సవారీయొనర్చు బింబమున కుబ్బి

చలువవెన్నెల రేక పిసాళి వలపు
నవ్వు కెరటాల తియ్యందనమ్ములోన
ఈ చరాచరజగతి ముంచెత్తి విడిచి
చదల కొలువుండె నెరజాణ చందమామ.

౨

చల్లని చూపుకోపు, విరజాజులుపూయు సుధాస్మితమ్ము, సం
ఫుల్లమనోహరాస్యము, అపూర్వకళారుచిరాంశుమాల, వి
ద్యుల్లతికాంగరేఖ, నయనోజ్వల తేజము, మందయాన మి
వ్వెల్ల వరించివచ్చెనుగదే నెలనాడె; నభోవిభూషణా!

౩

కడలికి కూర్చుబిడ్డడవు, కల్మిపొలంతుక మెప్పుసూపు త
మ్ముడవు, త్రివిక్రమప్రభుని ముద్దుమరందివి, అష్టమూర్తి క్రొ
మ్ముడి కయిసేసుకొన్న విరిమొగ్గవు, కాముని మేనమామ వే
ర్పడగ జగమ్ము మామ వవురా! ఒకపాటివె నీ యదృష్టముల్!


౪

చుక్కల చందమామ! సొగసుల్ దిగవోసెడి నవ్వుపువ్వులన్
రెక్కలువిచ్చి చల్వలలరించె వసుంధర; చూడ లేవి యు
మ్మక్కలు ఆడిపోసికొని రక్కట! వారలదృష్టిదోషముల్
దక్కిన చిక్కదే నెలనెలన్? చలువల్ వెగటయ్యె వారికిన్!

౫

ఎవ్వరేమాడికొన్న నీకేమి కొదువ?
కువలయము మెచ్చు చలువలకొదువ యొదవ
దేమిగాకున్న, సతుల నెమ్మోములకును
సాటి చెప్పెడి కవుల నేస్తములు గలవు!

—బొడ్డు బాపిరాజు.




# పూనానగరమునందలి యాంధ్రులు

[ఈ వ్యాసకర్త పూనానగరమున ఉద్యోగరీత్యా వలసనెలకొనియున్న ఆంధ్రవిద్యావంతులలో నొకరు. పూనానగరమునందలి ఆంధ్రులనుగూర్చి సంగ్రహముగ వ్రాసిపంపుడని మేముకోరగా—ప్రియబంధువుల అనారోగ్యకారణమున చిత్తశాంతి కొంత కోల్పడియుండినను—'ఆంధ్రభూమి'యందలి అభిమానముచే వారీ వ్యాసమును రచియించిపంపిరి. బొంబాయి, లక్నో, నాగపురము, ఢిల్లి, కోయంబత్తూరు, కలకత్తా, తాతానగరము, రంగూను మున్నగు తావులయందుగల 'ఆంధ్రభూమి' చందాదారులుకూడ నిట్లు తమతమ వలసపట్టులయందలి ఆంధ్రులనుగూర్చి సంగ్రహముగ వ్రాసి పంపగలరని ఆశించుచున్నాము. ప్రతిమాసమున ఈ శీర్షికక్రింద బర్మాయందలి ఆంధ్రులనుగూర్చి ప్రచురింపబడును.
—సంపాదకుడు.]

ఆంధ్రదేశానికి సుమారు వెయ్యిమైళ్ళ దూరంలోఉన్న పూనాకుకూడ మనఆంధ్రులు తమ బ్రతుకుకొరకై రావలసివచ్చింది. ఇలా దేశంవిడిచి మరోదేశానికి జీవనానికై వెళ్ళడం అనేది మన ఆంధ్రులకు క్రొత్తవిషయమే కాని తమిళసోదరులకుమాత్రం వింతకాదు. అటువంటిశక్తి, ఉత్సాహం ఉండబట్టే వాళ్ళు ఎక్కడికివెళ్ళినా బ్రతికేస్తున్నారు. మన ఆంధ్రులుమాత్రం ఏవో పూర్వకాలపు కబుర్లుచెబుతూ "పరుగెత్తి పాలు త్రాగేకంటె నిలబడి నీళ్ళుత్రాగితే మేలు" అనే దేవుళ్లాడుతున్నారు. కాని ఇప్పుడిప్పుడు మన ఆంధ్రులుకూడా మన దేశంలోనున్న బీదరికముచేత పైరాష్ట్రాలకి వెళ్ళుతున్నారు.

పూనాలో సుమారు ఎనభైమంది ఆంధ్రులున్నారు. అందులో కేవలం విశాఖపట్నం, గోదావరి, కృష్ణాజిల్లాలకు చెందిన వాళ్ళకుటుంబాలు సుమారు పదిఉంటాయి. అయితేమాత్రం- ఇది ప్రస్తుతపు పరిస్థితి. సుమారు నాలుగైదుసంవత్సరాలక్రిందట, అయిదారుగురు ఆంధ్రులు కనిపించడం అరుదనిపించేది, కాని ఇపుడు మన ఆంధ్రుల సంఖ్య హెచ్చుగుటకు కారణం, ఉద్యోగరీత్యా అనిచెప్పవచ్చు. పూనాలో 'మిలిటరీ శాఖకుచెందిన అకౌంట్సు డిపార్టుమెంటు' ఉంది అందులో చాలామంది ఆంధ్రులు ఉద్యోగాలు చేస్తూన్నారు. మిగిలినవాళ్ళు ప్రయివేటు కంపెనీలలోను, జి. ఐ. పి. రైల్వేలోను ఉన్నారు. కేవలం ఉద్యోగరీత్యాకాక, ఎన్ని సంవత్సరాలక్రిందటో ఇక్కడికి జీవనంకోసంవచ్చి, ఇళ్లూ వాకిళ్లూ సంపాదించుకొని మేము ఆంధ్రులమని చెప్పుకొనే వాళ్లు కొంతమందిఉన్నారు. కాని వాళ్లు ఆంధ్రులేనా అనే సందేహం కల్గుతుంది. వాళ్లు మాట్లాడేభాష సగంతెలుగు, సగంతురకం కలిసిఉంటుంది. అలాటివాళ్ళకందరిని ఇక్కడ "కమాటీ" లంటారు. వాళ్లభాష చాల అసహ్యంగా, మనవేపు గంజాంజిల్లాలో కోటబొమ్మాళికరణాల తెల్గులాగుంటుంది.

సుమారు మూడుసంవత్సరాల క్రిందట ఇక్కడ మిలిటరీఅకౌంట్సు డిపార్టుమెంటుకు చెందిన అప్పయ్యనాయుడుగారు, ఐ. ఆర్. నాయుడుగారు, గోపాలరావుగారు కలసి "ఆంధ్రఅసోసియేషన్" అను పేరిట ఒక

సంఘాన్ని స్థాపించేరు తమ యావచ్ఛక్తిని వినియోగించి ఆంధ్రుల నొక్కొక్కరినీ చేర దీసి, సభ్యులుగా చేర్చారు వాళ్లు వేసిన విత్తనం బాగా నాటుకుంది. ఇప్పుడు సభ్యులుగా ఉన్నవాళ్లసంఖ్య అరునది. క్రిందటి సంవత్సరంవరకూ గోపాలరావునాయుడు గారే అధ్యక్షులుగా ఉండేవారు. కాని కారణాంతరములచేత వారు పూనావిడిచి పెట్ట వలసివచ్చింది. అందుచేత గతసంవత్సరం మ॥ రా॥ రా॥ శ్రీ గోవిందు సూర్యారావు గారు అధ్యక్షులుగా నెన్నుకొనబడ్డారు. వీరు యువకులు, ఆంధ్రుల యెడల చాలఉదారస్వభావము గలవారు. తాము అధ్యక్షులుగా ఎన్నుకొనబడ్డ లగాయితూ, అసోసియేషన్ ను అనేకవిధముల బాగుచేశారు. ఇపుడు మా అసోసియేషన్ కు సంబంధించి,ఒకచిన్న పుస్తకభాండారం కూడా ఉంది. రెండుమూడు మాసపత్రికలు కూడా వస్తాయి. కాని ఇంకా డబ్బు చాలనందున తగినంత ముందరికి రాలేదు. సభ్యులు, కార్యనిర్వాహకసంఘం వారు, అధ్యక్షులు కలసి ఇంకా యీసంఘాన్ని అభివృద్ధిచెయ్యాలని కంకణం కట్టేరు.

ఆంధ్ర బాలబాలికలకు, ఇక్కడ విద్యాసౌకర్యాలేమీ లేవు అది ఒక పెద్దలోటుగా ఉంది. ఉన్నఆంధ్రులు కొగుమాత్రం అవడం చేతనున్నూ,ఉన్న కొద్దివారైనా రెండుమూడు సంవత్సరాలకుమించి ఇక్కడ ఉండకపోవడం చేతనున్నూ ఇక్కడ ఇలాటియిబ్బంది ఉంది. ఎప్పటికైనా ఆంధ్ర బాలబాలికల కొరకై ప్రత్యేకపాఠశాల యిక్కడ ఒకటి స్థాపించకతీరదు ఆంధ్రఅసోసియేషన్ వారు క్రిందటి సంవత్సరంనుంచి తీవ్రంగా పనిచేస్తున్నారు కాని పురపాలకసంఘంవారుమాత్రం ఒప్పుకోకుండా ఉన్నారు. అందుచేత ప్రస్తుతం రాజీ పడవలసివస్తుంది. ఏమిటంటే: యిక్కడ తమిళసోదరుల బిడ్డలకొరకై ఒక ప్రత్యేకపాఠశాలఉంది. అందులోనే మన తెలుగుభాష నేర్పుటకై ఒకశాఖ నేర్పరుప నేర్పాటుగావించుట. దానికై నా పురపాలక సంఘంవారు 'ఊ' అనాలి. ఇంక ముందు తెలియాలి ఈ విషయమైన పర్యవసానం.

ఉన్న ఆంధ్రులసంఖ్య చాల తక్కువగుట చేత ఇచ్చటివారిలో అంతఃకలహాలు గాని; బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులన్న తారతమ్యంగాని ఏమీ లేవు. అంతా సోదరుల మల్లే ప్రవర్తిస్తారు ఒకరికష్టసుఖాని కొకరు సహాయపడతారు ఈవిషయంలో ముఖ్యంగా గర్వించవల్సిందే ఏమీ అంటే సాధారణంగా మన ఆంధ్రులలో ఐకమత్యంతక్కువ. పొరుగిల్లు తగలబడుతూంటే మనకేం అని అరుగుమీద దమాయించే స్వభావం మనవాళ్లది. కాని ఇక్కడ చాలదూరదేశంలో ఉండడంచేతనూ, మహారాష్ట్రభాష ధారాళంగా రాకపోవుటచేతనూ, ఒకరికొకరు సహాయంచేసుకోక వీలులేదు.

ఆంధ్రులంటే యీదేశస్థులకు తమిళ సోదరులకన్నా హెచ్చు గౌరవం. ఈప్రాంతాల్లో, అరవవాళ్లనిచూస్తే అసహ్యించుకొంటారు. అంతేకాక చాల నీచంగాకూడా చూస్తారు. బజారులో వారికి కానీవస్తువు అర్ధణాకు తగిలిస్తారు. రైల్వేస్టేషనుకు బండీ నాలుగణాలు రివాజైనా, అరవసోదరునివద్ద మరాటీబండీవాడు ఆరణాలు కాజేస్తాడు. కాని మన ఆంధ్రుల బట్టకట్టు, వేషధోరణి, దేశాచారులు—పురుషులలో నైతేనేం, స్త్రీలలో నైతేనేం మహారాష్ట్రులతో కొంతవరకూ సరిపోతాయి అందుచేత మహారాష్ట్రులకు ఆంధ్రులంటే గౌరవం, భక్తి రెండూ ఉన్నాయి.

—టి. యస్. రాములు, బి. ఏ.

# విజయావతారము

పాండురాజు ధర్మదేవు ననుగ్రహమున యుధిష్ఠురుని, వాయుదేవు ననుగ్రహమున భీముని, కుంతియందు కుమారులుగాబడసి సంతోషించాడు. కాని సంతృప్తి చెందలేదు. ధన మెంత సంపాదించినా ఇంకా సంపాదించాలననే ఉంటుంది. విద్య ఎంతచదివినా ఇంకా చదివి జ్ఞానాభివృద్ధి చేసుకుందామనే ఉంటుంది. కుమాళ్ళ నెంతమందినికన్నా, ఇంకాకందామనే ఉంటుంది. అది లోకసహజము.

పాండురాజుకు త్రిలోకవిజయుడైన కుమారుణ్ణి గని వానిమూలాన తనపేరుప్రతిష్టలు భూమిమీద చిరకాలం నిలువుకుందామని అభిలాష తీవ్రంగా కలిగింది

పాండురాజు కుంతినిచేరబిలిచి విధ్యుక్తప్రకారము దేవేంద్రుణ్ణి పూజిస్తూ ఒకసంవత్సరంపాటు వ్రతనిష్ఠమై ఉండమని నియోగించాడు. తాను ఏకాంతాన ఒకపాదం మీదనిలబడి మానసికంగా దేవేంద్రుణ్ణిగురించి ఘోరమైన తపస్సుచేశాడు. తపస్సుకుమెచ్చి దేవేంద్రుడు ప్రత్యక్షమై ఏమికావాలెనని అడిగితే 'త్రిలోకవిజయుడైన కుమారుణ్ణి, నీఅంశాన ప్రసాదించ'మన్నాడు. 'సరే, ఆలాగేప్రసాదించాను. నే చెప్పినట్లుచెయ్యి' అని ఏవో చెప్పి అంతర్హితుడైనాడు.

పాండురాజు తిరిగివచ్చి జరిగినవిషయమంతా కుంతీదేవికిచెప్పాడు. కుంతీదేవి దూర్వాసునిమంత్రంవలన ఇంద్రు నారాధించి గర్భవతియైనది.

పాండురాజు కుంతిని వెంటబెట్టుకొని అడవిలోకి వెళ్ళాడు. అక్కడ ఒకలక్ష్యాన్నిచూపించి దానికి ఏబది గజాలదూరములో ఆమెనునిలబెట్టాడు. ఒకవిల్లు, బాణము చేతికందించి ఈబాణాన్ని విల్లులోఎక్కుబెట్టి ఆ లక్ష్యాన్ని గురిచూచి కొట్టమన్నాడు. ఆమెచిన్నతనంలో తన అన్నలతోబాటు విల్లుసంధించడం నేర్చుకున్నది. ఆమె విల్లెక్కుపెట్టి తనగురి సరిచూచుకుని బాణంవదిలింది. సరిగా లక్ష్యానికి తగిలింది. సెబాష్ అని మెచ్చుకున్నాడు పాండురాజు.

లక్ష్యానికి నూరుగజాలదూరంలో నిలబెట్టి, మరోబాణం చేతికిచ్చి ఈతడవ కొట్టమన్నాడు. సరిగా లక్ష్యానికి గురితప్పకుండా తగిలింది. ఆరోజుకు సరిపెట్టి ఇంటికి వెళ్ళారు.

మరునాడు మళ్ళీవచ్చారు. క్రమేణా రెండువందలు, మూడువందలు......వెయ్యిగజాలనుంచి లక్ష్యాన్ని గురిచూచికొట్టడం సాధనచేసింది. ఆమె కిదివరకెప్పుడు తనకింతశక్తిఉన్నదని తెలియదు. సాధనచేస్తున్న కొద్దీ ఉత్సాహం ఎక్కువయింది.

పదిహేనురోజు లయ్యేటప్పటికి తెల్లవారే సరికల్లా ఆమెఅంతట ఆమే 'మనము విలువిద్య సాధనచేయడానికి వెళ్ళేవేళ కాలేదా! ఇంకా ఆలాకూర్చుంటారేమి? లేవండి' అని తొందరపెట్టసాగింది పాండురాజును.

వెయ్యిగజాలకు చాలాపైగా నిలుచున్నది. లక్ష్య మెదురుగా కనబడుతున్నది. గురి సరిచూచుకున్నది. కాని అంతదూరముపోతుందా అని అధైర్యమువేసింది. ఎక్కుపెట్టినబాణాన్ని ఆకర్ణాంతం లాగివదిలింది. బాణం లక్ష్యానికితగిలి జానెడులోపలికి చొచ్చుకుపోయింది. ఆశ్చర్యపోయినాడు పాండురాజు. తనశక్తికి తాను నిశ్చేరపోయింది కుంతి.

ఈ విధంగా రెండునెలలు సాధనచేసింది. తరువాత కళ్ళకు గంతకట్టుకొనేది. బాణం వింటిన ఎక్కుపెట్టి నిల్చొనేది. పాండురాజు దగ్గరలో ఏచెట్టుమీదనో చప్పుడుచేసి తొలిగినిల్చుండేవాడు. మరునిముషంలో ఆ చప్పుడుచేసినచోట బాణం గుచ్చుకుపోయిఉండేది. తర్వాత పాండురాజు దూరాన ఎక్కడనో చప్పుడు చేసేవాడు. కుంతి నారిని ఆకర్ణాంతంలాగి బాణంవదిలి చప్పుడుచేసినచోట కొట్టేది. ఈవిధంగా మరి రెండు నెలలు సాధనసాగింది.

ఇహ ఇప్పుడు కుంతీదేవికి రాత్రింబగళ్ళు విలువిద్య మీదనే ఆలోచన. రాత్రి పడుకున్నప్పుడు, ప్రొద్దున్నే విలువిద్య సాధనచేయడంలో చెయ్యివల

సిన క్రొత్తపనులేమిటనే ఆలోచనే. పగలు అదే ఆలోచనే. మనస్సును సాంతంగా దానిమీద కేంద్రీకరించింది ఆమె.

కుంతీదేవి చిత్తస్థితిని గ్రహించాడు పాండురాజు. లోపల ఉప్పొంగిపోయినాడు. మహేంద్రుడి దయ బాగుండి తాను సఫలీకృతమనోరథుడైతే ధన్యుణ్ణను కొన్నాడు. చివర పరీక్ష నివ్వదలుచుకున్నాడు కుంతీదేవికి.

ఒక గుబురైనచెట్టులో ఒకచచ్చిన చిలుకతలను కట్టాడు. చిలుకతల ఆకుపచ్చరంగు. చెట్టుఆకులు ఆకుపచ్చరంగు. వాటిలో చిలుకతల వేరుగా అగుపడడము లేదు. చిలుక కన్నుమాత్రము మినుకు మినుకుమంటూ మెరుస్తున్నది. కుంతీదేవికి చూపాడు. 'దాన్ని కొట్టగలవా?' అన్నాడు. ఆమె నసురు బెదురులేకుండా 'ఆ' అన్నది. 'కొట్టు' అన్నాడు. చెట్టుక్రిందనుంచొని పైకిదృష్టిసారించింది. విల్లెక్కుపెట్టి గురిచూచుకొని తయారుగా నిలుచున్నది.

'గురి సరిగాచూచుకున్నావా ?'

'ఆ'

'నేను నవుపడుతున్నానా ?'

'లేదు.'

'ఆచెట్టు కనపడుతున్నదా ??'

'లేదు.'

'చిలుకతల కనపడుతున్నదా ?

'లేదు.'

'మరేమి కనపడుతున్నది.'

'చిలుకకన్ను ఒక్కటి మాత్రమే.

'సరే కొట్టు.'

కన్నుమూసి కన్నుతెరిచేసరికి చిలుకతల నేలమీద పడ్డది. కన్నులోనుండా బాణందూరి ఉంది. పాండురాజు తన ఉత్సాహం పట్టలేకపోయినాడు. కుంతిని కౌగలించుకోబోయి తనశాపంమాట జ్ఞాపకంవచ్చి ఊరుకున్నాడు.

ఇంకా త్రిలోకవిజయుడైన కుమారుణ్ణి కనగల స్థితిలో కుంతి ఉన్నదో లేదో అని అనుమానము పాండురాజుకు. ఆఖరుపరీక్ష చేయాదలచుకొన్నాడు.

ఒక మత్స్యయంత్రాన్ని భూమికి చాలాఎత్తున ఏర్పాటుచేశాడు. ఆయంత్రం గిర్రున ఆగకుండా తిరుగుతూ ఉంటుంది. దానికిసరిగా క్రిందఒకపళ్లెంనిండా నీళ్ళుపోసి పెట్టాడు. కుంతికి ఈ ఏర్పాట్లన్నీ చూపాడు. కుంతివెంటనే 'ఆ కొట్టకలుగుదు'నన్నది పాండురాజు చెప్పకుండానే. పాండురాజు ఆశ్చర్యపడి 'ఏమిటి? ఏలా కొడతావు?' అన్నాడు.

'ఏముంది? మీ అభిప్రాయం కనపడుతూనేఉన్నది. క్రింద నీళ్ళలోచూస్తూ పైన యంత్రాన్ని కొట్టాలె. అంతేనా ?'

తనకోర్కె సఫలంకాకుండా ఎట్లా ఉంటుందనుకున్నాడు పాండురాజు

'అవునంతే. కొట్టు' అన్నాడు.

కుంతి నీళ్ళలోచూస్తూ యంత్రంమీద దృష్టిని నిలుపుకున్నది. బాణం ఎక్కుపెట్టి లెక్కచూచుకుని బాణం వదిలింది. గిర్రున తిరుగుతున్న మత్స్యయంత్రం క్రింద పడ్డది.

నవమాసపూర్తి అయినతరువాత ఒక శుభలగ్నాన కన్నది త్రిలోకవిజయుడైన విజయుణ్ణి కుంతీదేవి.

— మొదలి సీతారామస్వామి, బి.ఏ.

మామిడిపండును గూర్చిన చాటువు

ఉ. చూతఫలావతంస! నినుఁజూచినఁ
గన్నులపండు వయ్య! లో
పాతిశయంబునన్ బరిమళాస్వాత
మయ్యె దిశౌఘమెల్ల వి
ఖ్యాతియొనర్చె నీ గుణము లైనను
గల్గదు నాకు నెమ్మదిన్
గౌతుక మొప్ప నీహృదయకర్కశ
భావము జూడఁ జూడఁగన్.

# స్నేహలతా దేవి

## (గ్రంథవిమర్శనము)

"స్నేహలతా దేవి" యను గ్రంథమును శ్రీయుత రాయప్రోలు సుబ్బారావుగారు రచియించిరి.

"జగమెఱిగిన బ్రాహ్మణునకు జందెమేల ?" యనునట్లు శ్రీయుత రాయప్రోలు సుబ్బారావుగారినిగూర్చి ఆంధ్రులకు వేఱ జెప్పబనిలేదు. వారు రచించిన "తృణకంకణము, స్వప్నకుమారము, కష్టకమల, స్నేహలతా దేవి, తెనుగుతోట" మొదలగు గ్రంథములు తెలుగువారికి చిరపరిచితములు. ఈ గ్రంథముల యన్నిటియందును వారు ఆంధ్ర దేశసాంఘికజీవనమును బాగుగ చిత్రించియుండిరి. ఈ ఉద్దేశముతోనే వారు రచించిన "స్నేహలతా దేవి" యను గ్రంథమును తిలకించెదముగాక.

ప్రథమమున వేడుకలనే పేరుతో ప్రారంభించిన కొన్నిపద్ధతులు సాంఘికజీవనములో ప్రవేళ్లుపాఱి, దురాచారములక్రింద మాఱి, సంఘమునకు వేఱుపురుగులై సంఘమును పీల్చి పిప్పిజేసిన వెన్నియోగలవు. అట్టివానిలో కన్యాశుల్కవరశుల్కము లనునవి ముఖ్యము లనవచ్చును. ఈదురాచారములకు లోనై ఎన్నియో కుటుంబములు దారిద్ర్యవస్థకులోనయినవి ; లోనగుచున్నవి గూడ. ఎందరోవ్యక్తులు తమప్రాణముల నీ దురాచారముల కాహుతిగనిచ్చిరి. అట్టివారిలో స్నేహలతా దేవి యొకతె.

స్నేహలతా దేవి దొక విషాదయుదంతము. ఆమె కిప్పుడు పదునాల్గు సంవత్సరములు నిండినవి. ఇంకను వివాహము కాలేదు. కారణము ? కురూపియా ? కాదు, కాదు. ఆమె యొప్పులకుప్ప. ఆ వినయము. నాజూకుచూపులు, ఆ నగుమొగము ఆమెను "వంగడములకెల్ల మానికముగ" చేసినవి. ఆమె మాటపొందిక, పరిచయమాధుర్యము, ఆమెతో మాట్లాడిన ప్రతివారికిని బోధపడక మానవు. ఉన్నతాదర్శములు ! గంభీరభావములు !! వేయేల ? ఆమెను బాలికాలోకమునకు ఆదర్శప్రాయముగ గణింపవలసినదే.

ఆమెతండ్రి హరేంద్రశర్మ చాల కర్మిష్టి, స్వధర్మపరాయణుడు. నియమానుసారముగ నిత్యస్నానసంధ్యానుష్ఠానాది కర్మల నాచరించుచుండును. అతడు తన కూతునకెన్నో వివాహసంబంధముల జూచెను. ఇంతవఱ కెక్కడను కుదురనేలేదే ! కారణము ? ఆతనికున్న ఆస్తి. తాను కాపురముండు తాటియాకుల పాతయిల్లుతప్ప వేఱ 'నా' అని చెప్పుకొనుట కేదియు లేదు. అట్టియెడ ఆధునికవరుల ధనాశ నెట్లు ఎదుర్కొనగలడు ? శుల్కము లేనిదే ఏవరుడు తనకుమారితను పెండ్లియాడును ?

తాతముత్తాతలనాటి తనయింటిని తెగనమ్మియైనను వివాహము చేయకతప్పనిసరి. తనచేతులార పిత్రార్జితపు ఆస్తిని అమ్ముట యాతనికెంతయో హృదయావేదనకుకారణమయ్యెను స్నేహలతయు తన తలిదండ్రులు తన వివాహమునకై పడుచున్నపాట్లను కండ్లార చూచుచునేయుండెను. తన నింతవఱకతి గారాబముగ పెంచిన తలిదండ్రులకు తానింత

క్లేశకారణమగుట కెంతరో చింతించెను. తనజననీజనకులబోలి ఇక నెందరు తమ దుహితల వివాహములకై వెతలనొందుచున్నారో గదాయని తలపోసెను. తన ప్రాణార్పణము చేనైనను దేశమునుండి యిట్టి దుఃస్థితి తొలగించుట యుక్తమని నిశ్చయించెను. ఈతన నిశ్చయమును ఒకయుత్తరము మూలమున తన తలిదండ్రులకు తెలియజేయుచు తైలవస్త్రమును ధరించి తనకుదానే అగ్నిసంస్కారము గావించుకొనెను. ఇట్లు ఆమె తనజీవితమును "ఆర్యకన్యాకులీనత కర్పణము" గావించెను.

ఈ పైవృత్తాంతమునుబట్టి యిందలి కథ యనుభవసిద్ధమయినదని తేటపడుచున్నది. ఇందలి పాత్రలన్నియు మన మనుదినము మన కండ్లయెదుట చూచుచున్నవే. తమ కూతుండ్ర వివాహములకయి ఆందోళన పడుచు మనకు ప్రతిసంసారమునందును కానవచ్చు తండ్రులవంటివాడే హరేంద్రశర్మ. స్నేహలతయు యొకసామాన్య బాలికామణియేగాని మనఊహ కతీతమయిన యే గంధర్వలోకమునుండియో గ్రహింపబడి యుండలేదు. ఇందుల కామె కాయాపరిస్థితులలో ఒదవిన భావములే తార్కాణములు.

ఆమె తన స్నేహితురాలితో గంగాతీరమునకు బోయినపుడు ఆమె హృదయము కడునిర్మలభావపూరితమయ్యెను. పతితపావనియగు గంగానదీలలామగాంభీర్యము ఆమె హృదయభావగాంభీర్యమును బహిర్గతము చేయగలిగెను. అందుచేతనే ఆమె

"ఋక్కులనుపాడి రీనదీప్రియతటమున
యజ్ఞములసల్పి రీయేటి యంతికమున
ఉపనిషత్సూక్తి పరిమళ మొదవె నిచట,
బూజ్యరాలౌట యరుదె యీగంగ."

అని గంగానదిని ప్రశంసించెను. ఆమె హృదయము ఉన్నతభావవీథి ననుసరించిపో మొదలిడెను. ఆమె కిప్పుడు ప్రపంచరీతులపై ఏవగింపుగలిగెను.

"ప్రకృతి మార్దవపూర్ణశోభలను దెలిపి,
పురుషుని విభూతిగుణయోగమును వెలార్చి
పరమసుందరమైన ప్రేమప్రపంచమునకు
నడుచుమార్గము మఱల నేర్పడునె సఖియ!"

సంఘోద్ధరణ కమితప్రబోధ మవసరమని ఆమె గ్రహించగలిగెను. అట్టి ప్రబోధము ఆ సంఘీయుల వలననే గావింపబడవలెను. ఇక్కార్యమున స్త్రీలోకము యొక్క బాధ్యతనుగూడ ఆమెగుర్తించెను. అందుచేతనే ఆమె:

"జ్వలితపదమగు నిగమదర్శనమునందు
తెలియజాలని పరమతాత్త్వికరహస్య
బోధలెన్నొ సూత్రించిన పుణ్యకన్య
లొక్కరయినను బుట్టరేమొ జగాన!"

అని యొక్కనిట్టూర్పు విడిచినది. అట్టి పుణ్యకన్యకాగణమున నొక నక్షత్రమై వెలుగ నిశ్చయించినది.

తనమూలమున తన తలిదండ్రులు "బహుళ దారిద్ర్యవారాశిబడి కులమహోపద్రవము"ను దెచ్చి పెట్టుకొనుచున్నారని ఆమె మిగుల చింతింపసాగెను. యువజనులును పౌరుషహీనులై "కన్యలవరింప శుల్కముల కాసజేయు శూరులయి"నందుల కామె తన మనమున గుందుకొనజొచ్చెను. "వేదములు పుట్టినట్టి పవిత్రసీమ"లో ఇట్టి దురాచారములకు తావులేదని ఆమె నిశ్చయించెను. కాన నిట్టియనర్థను తన ప్రాణార్పణముననైన బాపుటుచితమనియే యూహించెను. తన 'కన్యాదర్శనహితపదవిని నీచశుల్కము" పాల్పేయతగదని యామె మనోనిశ్చ

యము. కలలగూడ తనసౌఖ్యమే కలవరించి తన నతిగారాబమున పెంచిన తలిదండ్రుల ప్రేమను,కూర్మిని కొల్లగొట్టుటయగాక వారి కిన్ని కష్టనిష్ఠురములు, పిత్రార్జితగృహహరణము, సంఘనింద - యివన్నియు తనవలననే సంప్రాప్తమగుట ఆ మనోచ్ఛేదన కారణములయ్యెను. ఆమె మానసదృష్టి కదియేదో నవీనకాంతిగోచరమయ్యెను, అందుండి యేదో అంతర్వాణిపిలుపు ఆమెచెవుల బడెను. తన మరణాంతమున తననుగూర్చి తలిదండ్రులు విచారసాగరమున మగ్గుదురని ఆమెకు దెలియును. అయిననేమి? పిత్రార్జితము నిలచును. తన పరిశుద్ధకన్యాత్వ మవనిలో శాశ్వతముగ నిలుచునుగదా! ఆ సంతుష్టితోనే యామె వారల కాత్మప్రమాణ మాచరించి దక్షిణాగ్నియందు వెలిగిపోయెను.

జననీజనకుల కింత దుస్సహవిచారకారణమగు కన్యకావివాహ మేవిధముగ ఆమెకు సుఖదాయకమగును? ప్రజ లింత మూర్ఖులై 'ఆర్యకులధర్మసంప్రదాయముల' నవగతము చేసికొనజాలనందుల కామె మిగుల విచారించెను. ఇందులకు తప్పక అన్యాయకారుల ఘోరబాహే యొక కారణము. అందుచే,

"పశుసహజమైన పురుషస్వభావ మిటుల
బావనస్త్రీకళాభాగపదవి నింత
నిరసనోన్మాదదృష్టి గణింపనన్నె
ఋషిమహాదర్శముల నన్వయింత్రె యిట్లు!"

అని సంఘీయులను మందలించెను. అంతియగాక అవివాహితులగు యువకులగూడ నామె,

"కన్నియను పెండ్లియాడునో? కన్నెతండ్రి
యర్పణముచేయు శుల్కదివ్యాప్సరసను
పెండ్లియాడునో యకట! యీ పెండ్లికొడుకు;
అడుగరే యొక్కరయిన నీయార్యసుతుల!"

అని మందలించెను. అంతతోబోక, మాతృదేశాభిమానరతులై విదేశవస్తుబహిష్కరణమును చేకొనిన యువకులలో "కన్యకావరశుల్కరాక్షసకళంకమును నిసీయని రోయడే యనుజుడొకడు" యనివారల నుద్బోధించెను.

గ్రంథశైలి మృదుమధురము. అక్షరాస్యులగు ఆంధ్రుల కెల్లరకు సుబోధక మగుననుటలో సందియము లేదు. కవిత్వ మతిధారాళమగుట చదువరుల కమితోత్సాహము కలిగించును. క్లిష్టసమాసపదములు లేకుండుటచేసి యీ గ్రంథము పండితపామర జనాదగణీయ మగుచున్నది. ఇంకను పెక్కు రసవంతములగు కావ్యములు రచియించి గ్రంథకర్త ఆంధ్రమాతృప్రేమను చూరగొనును గాక!

—ధేరం వేంకటనాథశాస్త్రి, బి.ఏ., బి.ఇ.డి.

## వనమాలి

విరహిహృదయదురంత మీ వరవసంత
వేళ వనమాలి తరుణీశతాలిఁ గూడి
నృత్యహేలాభిరతి విహరించుచుండె
హాయిగాఁ బ్రత్యహరహమ్ము నచట రాధ!
పరిమళోదారమృదుమనోహరసమీర
దరతరంగాభిచలితలతావితాన
లలితయమునానదీతీరకలితవనులఁ
జెలియ! వనమాలి సతము వసించుచుండె.
అమరదుర్లభమధుమూర్తివైన నిన్ను
వల్లవీకాంత విరహతాపమ్ము వలన
నెదుట భావించి, విలపించు, బెదరిజూచు,
బయలు కౌఁగిటఁ జేర్చు, విహ్వలత నూర్చు
నోయి! వనమాలి వేగ విచ్చేయుమోయి.

— స్థానాపతి సత్యనారాయణశాస్త్రి.

# సినిక్ మగడు

అతడు మంచి చదువుకున్నవాడు. కవి. యువకుడు. కాని సినిక్! మంచిలో చెడ్డ, చెడ్డలో మంచి, ఉంటుందన్న సంగతి యెరుగుదునుకాని, దేనియందైనా ముమ్మందు చెడ్డనే వెదకడానికి సిద్ధపడేవాడు. మేలెంచక కీడెంచడమే అతని నైజం! కాబట్టి తరుచుగా అతనికీ, భార్యకూ చిత్రమైన వాగ్వాదాలు వస్తూఉండేవి.

తనలో ఉండే మంచిని సహితం ప్రకటించుకుందుకు యిష్టపడేవాడు కాడతడు! కాని నిజంగా చాలా యోగ్యుడు.

మొగుడితత్వం బాగా తెలుసును గనుక, అతని మాట లెంత విపరీతంగా వినవచ్చినా ఆమె ఎన్నడూ కోపగించుకునేది కాదు. నవ్వుతూ భర్తను అప్పుడప్పుడు మందలించేది, సరసంగా. ఆమె ముఖం ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉండేది. మనిషికూడా సాగసరి. కించత్ పెంకెది. తెలివైన పిల్ల. మొత్తానికి అమెకు జీవిత మొకమధురమైన స్వప్నంవలె ఆనందమయంగా తోచేది, ఎల్లప్పుడూ.

దంపతులకు ఒకరియెడల ఒకరికి ఎంతో ప్రేమ. వాళ్ళ ప్రథమసంతానం ఒక కొడుకు. ఇద్దరికీ ఆ పిల్లడంటే ప్రాణం! అబ్బాయిని ఒడిలో తీసుకొని, గొమ్ముకు అదుముకుంటూ వాడిమీద వెర్రిప్రేమ కురిపించేది తల్లి; సముద్రం కెరటాలవలె హృదయంలో అతనికి ఎంతప్రేమ పొంగుకొచ్చినా, ఆమెవలె వెర్రులోడేవాడుకాడు తండ్రి!

ఒకనాటి ముచ్చట యిది. తీరుబడిగా వాలుకుర్చీలో కాళ్ళుచాచి కూచుని, ఏదో యింగ్లీషుపుస్తకం చదువుకుంటున్నాడాయన. పిల్లవాడినెత్తుకొని ఎగరవేస్తూ, వాడిబొజ్జ నదిమి ముద్దాడి కితకితలు పెడుతూ, కిలకిల నవ్వుకుంటూ, ఆడుతూ వచ్చిందామె.

భార్య

(ఉత్సాహంతో బిడ్డను యెత్తి చూపుతూ) చూశారా, మన అబ్బాయికి చిన్న ఎలకపళ్ళు వస్తున్నాయి!

భర్త

(చదువుతున్న పుస్తకంనుండి తలైనా యెత్తక) అట్లాగా?

భార్య

మీకు ఒక్క-పిసరైనా ఆశ్చర్యంకాని, సంతోషం కాని కలిగినట్లులేదు!

భర్త

(తలయెత్తి, చిరునవ్వుతో మాతాశిశువులను అట్టే చూస్తూ) ఓసి వెర్రిదానా! పిల్లడు పళ్ళుచేస్తే అందులో ఆశ్చర్యపడవలసినది ఏమున్నది గనక? పిల్లలందరికీ వస్తాయి పళ్ళు. అట్లాగే మన అబ్బాయికి కూడా వచ్చాయి. లోకంలోని అందరు పిల్లలవలె గాక, ఎన్నాళ్ళకూ మనవాడికి నోట్లో పళ్ళు మొలవకనే పోతే, అప్పుడు నిజంగా ఆశ్చర్యపడవలసినదే!

భార్య

చాలులెండి మీ అడ్డువాదన. ఎప్పుడూ యింతే! ...మీరేమో ముచ్చట పడతారనుకొని,—

భర్త

పిల్లవాడికి పళ్ళువస్తే ముచ్చటపడమన్నావా నన్ను? సౌఖ్యప్రదమైన విషయాలకు ముచ్చటపడడం సబబు. ఆఫీసువేళ దాటకుండా రోజూ నువ్వింత వండిపెట్ట గలిగితే నేను ముచ్చటపడాలి! జరుపులు పెట్టకుండా, గునియకుండా నువ్వు కోరి నప్పుడల్లా నీకు నేను చీరలు, నగలు కొని యిస్తూఉంటే, నువ్వు ముచ్చటపడాలి! అంతేకాని,—

భార్య

మీతో వాదించి యేం లాభం?

భర్త

(నవ్వుతూ) నిజానికి మన అబ్బాయి పళ్ళుచేసినందుకుగాను, మనం ఉభయులమూ ఎంతో సానుభూతి చూపవలసి ఉంటుంది!

భార్య

సానుభూతెందుకు మైపెచ్చు?

భర్త

ఎందుకా? కుఱ్ఱవాడికి పళ్ళువస్తున్నాయంటే, ముమ్ముందు జరగబోయే దుఃఖమునకు గాథకు తొలిప్రకరణం ప్రారంభమైన దన్నమాట. ఇప్పుడు బియ్యపుగింజలవలె ఒకటో రెండో సన్నని పాలపళ్ళు మొలచి ఉంటాయి. క్రమంగా పైని, క్రిందను, చిన్నవి, పెద్దవి, కోరలు, దంతాలు, అన్ని రకాల పళ్ళూ మొలుచుకొస్తాయి.

భార్య

అయితే?

భర్త

ఒక్కొక్క పన్ను మొల్చినప్పుడల్లా పాపం అబ్బాయి కొంతబాధను ఓర్చుకోవలసి ఉంటుంది కదా? ఇక లోపలిదంతాలు మొలచినప్పుడు చంటిపిల్లలకు సర్వసాధారణంగా జబ్బుచేసి తీరుతుంది. జ్వరం, విరేచనాలు, కడుపునొప్పి, చెవిపోటు మొదలైన పాడువ్యాధులన్నీ అంకురిస్తాయి. అప్పుడు మాతా శిశువులకే గాక, యింట్లో ఎవరికీ కంటినిండా నిద్ర అనేది ఉండదు! క్రొత్తగా పళ్లుచేసిన పిల్లలకు అప్పుడప్పుడు దవిసెలు పెక్కు కాబోలు, ఏదైనా కొరకాలని ఉంటుంది. తల్లిపాలు త్రాగుతున్నప్పుడు చనుమొనలు కొరకడం ప్రారంభిస్తారు మొదట. ఒక్కొక్కప్పుడు అట్లా కొరకబడిన స్తనాలు వాచిపోయి, పుండుచేసి, సలుపు పోటు పెట్టి, తల్లిని మంచం ఎక్కిస్తాయి. పాలు త్రాగుతూ శ్రీకృష్ణుడు చన్నుకొరికేస్తే, పాపం పూతన యేనుగువంటి మనిషీ అయినకూడా గుక్కెడునీళ్లు అడగకుండా చచ్చిపోయిందట!

పిల్లల పళ్ళతీపు తల్లిపాలు కొరకడంతో తీరక, క్రమంగా ఒంటిమీది చొక్కాలు, ఆడుకునే రబ్బరు బొమ్మలు, చేతివేళ్ళు, మొదలైన వాటిమీద పడుతుంది. ఈ విధంగా చిన్నప్పుడు అన్నీకొరకటంబాగా అలవాటైన కొందరికి పెద్దయిన పిమ్మటకూడా ఆ వ్యసనం పూర్తిగా వదలదు. గోళ్ళు, కలాలు, మీసాలు కొరుక్కుంటూ ఉంటారు కొందరు పెద్దమనుషులు! దంపతులు ప్రేమోద్రేకంతో ఒండొరుల బుగ్గలు, పెదవులు గంట్లుపడి, రక్తాలొచ్చేటట్లు కొరుక్కుంటారని చెప్తారు మనకవులు. కరటకశాస్త్రి చెప్పినట్లు 'శ్రీకృష్ణమూర్తివారు రాధికతో శలవిస్తున్నారు: ఓ రాధికా, నీకోపం తీర్చుకోవాలన్నష్టాయినా,

'ఘటయ భుజ బంధనం
రచయ రద ఖండనం,
యేన వాభవతి సుఖజాలం.

అనగా యేమంటున్నాడంటే కవీశ్వరుడు, చేతుల్తోటి ఉక్కిరి బిక్కిరి అయ్యేటట్టుగా కౌగలించుకో; మరిన్నీ పెదిమలు రక్తాలొచ్చేట్టు కొరికెయ్యి, అంటున్నాడు."

భార్య

(నవ్వుతూ) కొరికిందా రాధ?

భర్త

రాధ నీఅంత పెంకెదికాదు.

భార్య

అలాగా? ఒట్టి సత్తెకాలపుపిల్ల కాబోలు!

భర్త

(నవ్వి)...... కొందరు చిన్నపిల్లలకు యీ కొరకడం అలవాటు మహాదారుణంగా పరిణమిస్తుంది చివరకి. మేకులు, సీసాలు, పైసాలు, తాళంచెవులు, పిన్నులు, చాకులు, చెమ్చాలు, అన్నీ కొరుకుతా మంటారు. ఒక్కొక్కప్పుడు ప్రాణాపాయం కలిగే ప్రమాదాలుకూడా సంభవించడం కద్దు. మృతకళేబరాలు కోసేటప్పుడు కొందరి కడుపులలో గాజుపెంకులు, చిల్లరడబ్బులు, మేకులు ప్రత్యక్షమవుతూ ఉంటాయని చెప్తారు డాక్టర్లు. పిల్లలు పిల్లలతో ఆడుకునేటప్పుడు వాళ్ళలోవాళ్ళు తగవులాడుకొని, ఒకరినొకరు పళ్ళు నాటేటట్లు కరుచుకుంటారు. మనిషికాటుకి మందు లేదని సామితె చెప్తారు మనవాళ్ళు!

బాల్యావస్థలో కొరకడం అలవాటైన పిల్లలకు కొంచెం జ్ఞానంవచ్చిన పిమ్మట ఆపళ్ళతీపు చిరితిండి మీదికి పోతుంది. పచ్చి జామికాయలు, పండిన బాదంకాయలు, తాటిపళ్ళు, కొబ్బరికాయలు, చెరుకు ముక్కలు, వేరుసెనగలు, బఠాణీలు, వేచిన కందిపప్పు, జంతికలు, చక్కిలాలు, చేగోడీలు, వడియాలు, మొంద

లైన గట్టి పదార్థాలు తినడానికి ఇష్టంగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు అట్టి తిళ్ళు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఒకప్పుడు పళ్ళు విరిగిపోవచ్చును. నాలుక కత్తిరింపబడవచ్చును. గొంతుకలో ఏదైనా యిరుక్కొని ప్రాణహాని సంభవించవచ్చును. ఇట్టి విపరీతాలేవీ తటస్థించక పోయినా, అట్టి చిరితిండి దేహారోగ్యాన్ని మట్టుకు తప్పకుండా పాడుచేస్తుంది. అజీర్తి, కడుపునొప్పి, వాంతులు, కలరా, మొదలైన రోగాలు రావడానికి యిట్టి తిళ్ళే మూలకారణాలు!

ఇన్ని యిబ్బందులకూ హేతుభూతాలైన పళ్లు మొలచినవి మొలచినట్లుగానే అందంగా, చిన్నవిగా, తెల్లగా, శుభ్రంగా ఉంటాయేమో అంటే, అదీలేదు. బాల్యావస్థలోనే అన్నీ ఊడిపోయో, విరిగిపోయో, మళ్ళీ నొప్పిచేస్తాయి. అంతటితోనైనా శని విరగడైతే బాగుండును. కాని వాటిస్థానే క్రొత్తపళ్ళు మొలుచుకొస్తాయి. ఇవి కొంచెం పెద్దవిగాను, వంకర టింకరగాను, ఎడఎడంగాను, సొట్టవిగాను, వికృతంగాను మొలవడం తరుచు. కొందరికి దొంతరపళ్లు, పారపళ్లు మొలుస్తాయి. ముఖం అంతా అందహీనమవుతుంది. పెదవులు మూతపడవు. ఇంకా కొందరు దురదృష్టవంతులకు మీదిపళ్ళు నూటిగా ముక్కులో నుండి తోసుకొవస్తాయి, పై పెదవెను చీల్చివేసి. అప్పుడు ముఖానికి నిజంగా రాక్షసిరూపు వస్తుంది.

భార్య

ఎట్టిరూపు దేనికివస్తుందో మానుతుందోకాని, యిప్పుడు మీవర్ణనకు వస్తూవుంది రాక్షసిరూపు! ఇక చాలించండి మీ పుణ్య ముంటుంది:

భర్త

కొసాకూ వినుమరి. పళ్ళమూలాన ఎన్నెన్ని అనర్థాలు ఉన్నాయో నీచేతనే వొప్పిస్తానుగా?

పళ్లు అందంగా ఉన్నా, అష్టవక్రంగా ఉన్నా, వాటికి చెయ్యవలసిన చాకరీలో ఏమీ లోటు ఉండకూడదు కదా? ఇంట్లో శవంపోయినాసరే, పళ్ళు తోముకోవడం మాత్రం తప్పదు! అరవవాళ్ళయినా నాలిక గీసుకోవడం మానివేయగలరు కాని, కేవలం పళ్ళుతోముకోవడమే మానివేయలేరు. మన నవీననాగరికులైనా సంధ్యావందనం, శైవప్రార్థన మొదలైనవంటే విసర్జించగలరుకాని, యింకా దంతధావన కర్మను విడిచిపెట్టడానికి సాహసించలేకుండా ఉన్నారు! పుడకో, కుంచో, పౌడరో, పేస్టో, ఏదో ఉపయోగించి, ప్రతీమనిషీ పళ్ళుతోముకొని తీరవలసినదే! లేకుంటే ఆప్తబంధువులు సహితం దూరంగా జరుగుతారు. అసహ్యించుకుంటారు. తిడతారు. అందుకనే, శుభకార్యాలలోను, సభలలోను, పదిమందీ చేరి ఒకచోట కూచోవలసి వచ్చినప్పుడు మనవాళ్ళొక మంచి లాంఛనాన్ని పాటిస్తూ ఉంటారు. అత్తరు, పన్నీరు వంటి సుగంధద్రవ్యాలు సభాసదుల మీదజల్లి చందన తాంబూలాలు అర్పిస్తారు. ఉద్దేశమేమిటీ అంటే, ఒకరి నోటికంపు, చెమటకంపు, దగ్గిరనున్న రెండో వాళ్ళను బాధించకుండా ఉండగలందులకు! ఈ విషయంలో నరుడికంటె పిట్టలు, జంతువులు నయం. పక్షులకు పళ్ళే ఉండవు! జంతువులు పళ్ళుతోముకోకపోయినా, నోరు శుభ్రంగానే ఉంచుకోగలవు. నోరే అన్నమాటేమిటి? శరీరం యావత్తూ మనకంటె శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోగలవు. సృష్టిలోని జీవరాసులన్నిటిలోను అందగాడిననీ, తెలివైనవాడిననీ గర్వించే మానవుడుమాత్రం అన్నివిధాలా కల్మషపూరితుడు; దుర్గంధసుగుడు!

పళ్ళయెడల ఎంతో శ్రద్ధతీసుకొని ఎన్నివిధాల అవస్థపడినా, మానవుడు అప్పుడప్పుడు దంతరోగాలకు గురి అవుతూనే ఉంటాడు. 'పయోరియా' జబ్బు అనుభవించే వాడికేగాక, యెదటివాళ్ళకు కూడా ప్రాణసంకటంగా ఉంటుంది! ఇక పుప్పిపళ్ళబాధ అపడేవాడికీ, దేవుడికే తెలియాలి. ఆబాధకు ఎంతటి వాడికీ అప్రయత్నంగా నోటివెంట బూతులు వస్తాయి. దేవుడిమీద నమ్మకం పోతుంది. ప్రేమించేవారి యెడల విరక్తి పుడుతుంది. డాక్టరుచేత పళ్ళు ఊడదీయించుకునేదాకా నిద్రాహారాలు ఉండవు.

ఇక చిగుళ్ళు వాచిపోవడం, పళ్ళంట రక్తంకారడం, పళ్ళు కదుల్తూ ఏదీ నమలనియ్యక పోవడం, యిత్యాది

జబ్బు లెన్నో వస్తూఉంటాయి, గ్రహచారం చాలని వాళ్ళకు. దంతవైద్యులు యిల్లు గుల్లచేస్తారు. పళ్ళు తెల్లగాతోమి శుభ్రపరచడానికే పదిరూపాయి లడుగుతాడు డెంటిస్టు! లేని వ్యాధులు ఉన్నవనిచెప్పి బెదిరించి, డబ్బులాగడానికి ప్రయత్నిస్తాడు కూడా! ఉన్న పళ్ళు ఆరోగ్యంగా లేవని ఊడదీయించుకో మంటాడు. బోసినోటి ముసలివాళ్ళను పళ్ళుకట్టించుకోమని బలవంతం చేస్తాడు. ఒక్కొక్కపన్ను పీకివేయడానికి రెండుమొదలు ఐదురూపాయిల వరకూ ఛార్జీ అడుగుతాడు. అట్టే బిగపట్టి బేరంచేస్తే, ఆకోపం పళ్ళు ఊడదీసేటప్పుడు తీర్చుకుంటాడు. క్రొత్తపళ్ళు అమర్చడానికి 'సెట్'కి వందరూపాయి లడుగుతాడు! ఇంతా కట్టించుకుంటే, ఒక్కొక్కప్పుడు నోటి కొలతలు తిన్నగా కుదరక, ఆపళ్ళతో నానాబాధలూ పడవలసి వస్తుంది. నోరునొప్పి చెయ్యడం, దవడలు సొట్టపోవడం, మూతి వాచిపోవడం, మొదలైన అనర్థాలెన్నో సంభవిస్తాయి. దేవుడిచ్చిన పళ్ళతో అంటే, ఎప్పుడో గ్రహచారం చాలనప్పుడు తప్ప, నొప్పితో బాధపడవలసిన అగత్యం లేదు. కాని కట్టించుకున్న పళ్ళతో అనునిత్యమూ అవస్థపడక తీరదు! ఉదయమే వాటినితోమి, 'లోషన్'లో కడిగి, జాగ్రత్తగా దవడలకు అమర్చుకోవాలి. రాత్రి నిద్రపోయేటప్పుడు తీసివేసి, కడిగీ, జాగ్రత్తపెట్టుకోవాలి. అశ్రద్ధగా ఏ టేబిలుమీదనో, గూట్లోనో దాచితే ఎలకలో, పిల్లులో ఎత్తుకొపోతాయి!

పళ్ళనుగూర్చి నరుడు తన జీవితపరిణామమందు యిన్ని అవస్థలు పడవలసి ఉండగా, అబ్బాయి పళ్ళు చేస్తున్నాడని సంబరపడమంటావు కదా, ఏమనుకోవాలి నేను?

భార్య

శుభం కోరవోయి పెళ్ళికొడకా అంటే, వెనకటికో బుద్ధిమంతుడు ఏదో అన్నాడట లెండి! అట్లా ఉంది మీ వరస! ఎప్పుడూ అపశకునం మాటలు, ఓగాయిత్యం కబుర్లు,—

భర్త

నిజం అట్లానే ఉంటుంది మరి, వెగటుగా!

భార్య

అయితే ఆవెగటుగా, అసహ్యంగా ఉండే నిజాన్ని పలికి నలుగురినీ నొవ్వజేసి, వాళ్ళచేత నిష్ఠూరాలు పడేకన్న, తియ్యతియ్యని అబద్ధాలే చెప్పి, అందర్నీ సంతోషపరచి మెప్పు పొందరాదూ?

భర్త

అది మీ ఆడవాళ్ళకే చెల్లింది!

భార్య

(ముసిముసినవ్వుతో తల తమాషాగా పంకిస్తూ) కవులకుమాత్రం చెల్లదూ?

—తాత కృష్ణమూర్తి, బి.ఏ.,యల్.టి.

## కోరిక

వికసించియున్న నాకు శోభనిచ్చుటకయి, మధుకరుడు నాయొద్ద నాట్యముసేయ........నేను కోరను.

నవవయస్వినుల మనము లాకర్షించి, వారికరములజొచ్చి, వారి స్నేహము జూరగొన నే కాంక్షింపను.

నీచరణసరోజసాన్నిధ్యమున పూజింపంబడి, వాడిపోయి, ముక్తిబొందనూ............నేను యాచింపను.

"మాతృదేవీ బలిమంటపమందు యజ్ఞపశువుగ నిలుచు" నాత్మసమర్పకులగు త్యాగవీరుల శోణితప్రవాహమునఁ దడుపంబడిన దివ్యపథమునందు రేకలుచిదిమిన పూవునై సంచరింప నాకు వరముదయసేయుము, దేవా!....

—చిట్టూరి సత్యనారాయణ.

# పల్లెపసందులు

౧

తిన్ననిగాలిలోనఁ దల దిమ్మని భర్త శయింపఁ జెంగటన్
వెన్నకుఱూపువెట్టినటు వెల్గెడు బిడ్డని సెజ్జఁ జేర్చి క
న్నన్నలబుజ్జగించి "తమచాలని" నాథుని గేలిచేయుచున్
పున్నమవెన్నెలన్ నిదురబుచ్చుచునున్నది చంటిపాపనిన్,

౨

వీపునఁ బాపఁ డూకొనఁగ వెన్నరపయ్యెద జీరుకాడ ము
న్నోమ్మిపిన కాలి కూతముగ ముందడుగల్లన నేలమోపుచున్
చూపులు భూతలంబునకు సూత్రముపట్టి తదేకదృష్టితోఁ
జీపురుకట్టఁ బుచ్చుకొని చిమ్ము నొకర్తుక వీథిగుమ్మముల్.

౩

కూకటి ముద్దువెట్టుకొని కుఱ్ఱనిచుంగొఁగి దువ్వి నూనెతోఁ
లేకురులంటరాచి సవరించి కుళాయిడి ముద్దుబిడ్డతోఁ
గేకిసలాడుచున్నఁ బరికించి ప్రియుండఱగన్నుమూయఁగాఁ
గాకరపాదుచెంగటఁ బకాపకనవ్వె నొకర్తు సంజలో.

౪

పొగిపిన నాల్గుకూరలకుఁ బొత్తగు కమ్మని తిమ్మనమ్ములన్
సెగచెడకుండ నాకు నిడి చేరువ బిడ్డఁడు చన్నుద్రావఁగా
బుగబుగ నావిగొన్న మునికొంగున నార్చుచు శాకపాకముల్
తగినటు లున్నవాయనుచు దానుభుజించెఁ బ్రియుండు మచ్చరన్.

౫

తనమృదుహస్తతాళమునఁ దాళికలట్టిటుగొట్టి గుండ్రఁగా
నొనరిచి చిల్లికచ్చునిడి యూయెలలో నిసు వంగలార్పగా
మిణికినయట్టులున్నది సుమీయని యాత్రముతోడ నెట్టులోఁ
బెనమున నేయివోసి తెఁగఁ బేల్చుచునున్నది పూరిరొట్టెలన్.

—ఉభయభాషాప్రవీణ ఏటుకూరి వేంకటనరసయ్య.

# రణజిత్సింహుడు : కోహినూరు వజ్రము

పదునెనిమిదవ శతాబ్దమునందు భారతమాతకు జనించిన పుత్రులలో రణజిత్సింహుడు నిరుపమానబాహుబలపరాక్రమములకు పేరువడసిన శూరాగ్రేసరుడని వచింపవచ్చును. గురుగోవిందసింహుడు మహమ్మదీయ పరిపాలకు లొనరించిన దుర్నయములకు ప్రతీకారము సలుపనెంచి తన యనుచరులకు మతదీక్షనొసంగి యితర విషయములతో బాటు రణవిద్యారహస్యములను చక్కగ బోధించెను. ఆమహాపురుషుని సంకల్పబీజము మొలకలెత్తి చిగిరించి రణజిత్సింహుని కాలము నాటికి వృక్షప్రాయమై విజృంభించెను. సిక్కులు పరాక్రమించి యాతని నాయకత్వమున జరిపిన కృత్యము లద్భుతములు. వారిధాటికి నిలువనేరక పఠానులు కొందరు లోయలలో దాగికొనజొచ్చిరి. ఆఫ్గనులు పరాజితులై యడవుల మార్గముబట్టిరి. పాంచాలరాజ్యమునందే గాక కాశ్మీరము, ముల్తాను, పెషావరు, మొదలైన మహమ్మదీయ ప్రాంతములందు సైతము సిక్కుల విజయపతాకములే ప్రతిష్ఠింపబడి యెగురసాగెను. శివాజి వలెనే రణజిత్సింహుడు సైతము హైందవుల హిందూత్వమును నిలువబెట్టిన వీరుడు : మహమ్మదీయుల యౌద్ధత్యము నణగద్రొక్కిన శూరశిఖామణి.

భారతీయవీరపుంగవులను గురించి విదేశచరిత్రకారులు లిఖించిన వ్రాతలు పక్షపాతరహితములు గావని యెల్లరకు దెలిసినవిషయమే. వారిదృష్టికి శివాజి యొక పెద్ద బందిపోటుదొంగ : రణజిత్సింహుడు కుటిలవు వర్తకుడగు స్వార్థపరుడు. మహారాష్ట్రులచే వ్రాయబడిన యితిహాసగ్రంథములందే శివాజియొక్క యథార్థస్వరూపము గోచరించునట్లు, సిక్కులచే రచింపబడిన చరిత్రములందు మాత్రమే రణజిత్సింహుని వాస్తవస్వభావాదికము లు గనిపట్టును. దీని కుదాహరణముగ రణజిత్సింహుడు "కోహినూరు"వజ్రమును బడసిన యుదంత మొక్కటి తీసికొనవచ్చును.

జగద్విఖ్యాతి వహించిన "కోహినూరు" హీరమును గురించి యొకగాథ కడుపురాతనమైనది గలదు. ఈ వజ్రమే 'మహాభారత' కాలమునందు భూరిశ్రవుడు తన బాహుపురిలో ధరించియుండెనట. ఈజనశ్రుతి యథార్థమని స్థాపించుటకు చారిత్రకాధారములు లభింపవు. ఏది యెటులున్నను పదునారవ శతాబ్దమునందు మాత్రము షాజహానుచక్రవర్తియు, నౌరంగజేబుసార్వభౌముడును ఈహీరమునే తమసింహాసనమునకు ప్రధానభూషణముగ జేసికొని యుండిరని తెలియవచ్చుచున్నది. కొంతకాలమునకు దొంగలలో మేటి యనదగు 'నాదర్షా' ఢిల్లీ పురమును కొల్లగొట్టి యాదోపిడిలో నీవజ్రమునుకూడ తీసికొనిపోయెను. అతని జీవితానంతర మీ భూషణము "అహమ్మదుషా"కు సంక్రమించెను. తుదకు క్రీ. శ. 1813 సంవత్సరము నాటికి యీవజ్రము కాబూలుచక్రవర్తియగు "షాహసుజా" యధీనము నందుండెను.

కాబూలురాజ్యము రాజకీయవిప్లవములకు బుట్టినిల్లు. "షాహసుజా" యొక్క దౌర్భాగ్యవశమున నతని మంత్రులే తిరుగుపాటొనరించి యతనిని పదచ్యుతునిగావించి రాష్ట్రమునుండి పారద్రోలిరి. ఆమందభాగ్యుడు కాశ్మీరరాజ్యమున కేతెంచి యారాష్ట్రపాలకుని యాశ్రయమున జీవింపసాగెను. ఇంతలో కాబూలు మంత్రియగు "మహమ్మదుఖాను" ప్రబలవాహినీసమేతుడయి పాంచాలమున కేతెంచెను. అది యాకర్ణించి రణజిత్సింహుడు సత్వరమే యచ్చటికేగి యతనిరాకకు గారణమేమనియడుగ నాపఠానుసచివుడు "నే నిచటికేమియు నుపద్రవమొనరించుటకు రాలేదు ; కాశ్మీరపు సుబేదారుడును, "అటకు" రాధిపతియు గలసికుట్రజేసి "షాహసూజా"ను కాబూలుపయి దండెత్తుటకు ప్రోత్సహించి సాయముజేయుచున్నారు. వారిని శిక్షించుటకే నే నిపు డీదండయాత్రను బూనితి"నని వచించెను. అతని సదుద్దేశమును రణజిత్సింహుడు గ్రహించి పరస్పరసఖ్యభావములో నుండుటకు వారుభయులు నంగీ

కరించి శపథము లొనరించుకొనిరి. అంతట పఠానుమంత్రి యీసమరములో తనకు సహాయముచేయుమని రణజీతుని వేడుకొనెను. దాని కతడు "జయింపబడిన రాజ్యములో మూడవవంతు నా కొసంగినయెడల నేను నీకు తోడ్పడెదనని" చెప్పెను. ఆ షరతునకు మహమ్మదుఖాను సమ్మతించుటతోడునే, లాహోరు మహారాజు తన పండ్రెండువేల సిక్కుసైనికులను హుకుంచందుని యాధిపత్యమున నతనికి సహాయముగ బంపెను. ఆయుద్ధములో సిక్కుభటు లద్వితీయసాహసముతో పోరుసల్పి కాశ్మీరనరేశ్వరునియొక్క సహోదరుని దెగటార్చుటయేగాక ఆ దుర్గమును హస్తగతముగావించుకొనిరి. అనంతరము 'షాహాసుజాను' కాశ్మీరనృపాలునికూడ హుకుంచందు చెఱపట్టెను. ఆ యిరువురును తనకు వాటిల్లిన విపత్తు నవలోకించి హుకుంచందున కిట్లు కబురంపిరి: "మమ్ములను తమరు కాబూలుమంత్రి యధీనము గావింపకుడు: దీనికి ప్రత్యామ్నాయముగ మేము 'అటకు' దుర్గమును మీకు స్వాధీనమొనరింతుము." హుకుంచందు దూరదర్శియగుటచే సంగతిసందర్భము లెటునుండి యెటువచ్చునోయని మొదటనే యీరాజఖైదీలను తనస్వాధీనమునందె యుంచుకొనియుండెను. అతడీసందేశమును వినినపిమ్మట వారిని మఱింత గౌరవాదరములతో తన గుడారమునందే నివసింపజేసెను. వారి నిర్వురుని తన కప్పగింపుమని కాబూలుసచివుడు పరిపరివిధముల కోరెనుకాని హుకుంచందు దానికి సమ్మతింపక యాతనికోరికను పూర్తిగ నిరాకరించెను. దీనికి గారణము లేకపోలేదు. అంతకుముందే "షాహసూజా" యొక్క రాణి లాహోరుమహారాజుసన్నిధికి "నా భర్తను తమరు కాబూలువజీరున కధీనముగావింపని పక్షమున, "కోహినూరు" వజ్రమును తముకాయనచే నే నిప్పింపగలదానను"అని విన్నపమంపియుండెను. ఆ సందర్భమునందు కాబూలుమంత్రి రణజీతునకు "తమరు వాగ్దానము గావించిన ప్రకారము రాజఖైదీలను నా వశము గావించుటకు మీదివాను నిరాకరించుచున్నాడు. దేవరవా రీతనికి తగినయుత్తరువు వెంటనేదయచేసి మన మొదటి యేర్పాటునకు భంగముగలుగకుండునట్లు ప్రవర్తింపవలెను" అని హుకుంచందుపయి నిందమోపుచు నొకలేఖ వ్రాసి పంపించెను. అక్కడి స్థితిగతు లన్నిటిని దెలుపుచు హుకుంచందు సైతమొకకమ్మనులిఖించి మహారాజునకుపంపించి ప్రత్యుత్తరమునకయి యెదురుజూచుచుండెను. ఇంతలో మహారాజు తన దివానుకీవిధముగ వ్రాసిపుత్తెంచెను: "నీవు మొదట కాశ్మీరాధిపతిచే నొక ప్రతిజ్ఞాపత్రము వ్రాయించి నాకు బంపుము. దానిలో నా కతడు సంతోషపూర్వకముగ "అటకు" దుర్గమును సమర్పించిన సంగతి యుదాహరింపబడవలెను. తరువాత వారుభయులను వెంటనిడికొని లాహోరుపురమునకు తీసికొనిరమ్ము. ఒకవేళ కాబూలుమంత్రి యీవిషయములో నేమైన యెదురుజెప్పి ప్రతికూలభావమును ప్రకటించినయెడల, వానికి నీ నిశితకృపాణముతో బుద్ధిజెప్పుము."

ఆయుత్తరము నందుకొనిన వెంటనే హుకుంచందు కాశ్మీరనృపతిచే బ్రతిజ్ఞాపత్రము వ్రాయించి మహారాజు సమ్ముఖమునకు బంపెను. ఆలేఖచేరిన వెంటనే మహారాజు తనమంత్రియగు 'ఫకీరు అజీజుద్దీను'ను బంపించి 'అటకు' దుర్గమును వశపఱచుకొనెను. కాశ్మీరనరేశుని, 'షాహసుజా'ను దోడ్కొని హుకుంచందు లాహోరునగరమునకు వచ్చి చేరెను. రణజీత్సింహుడు రాజఖైదీలను గౌరవపురస్సరముగ నాదరించి లాహోరునందే యొక దివ్యభవనము వారికి విడిదియొసంగెను. ఇట్లు రెండుమాసములు గతించెను. ఈలోపున 'షాహసుజా' యొక్క రాణిగూడ లాహోరునకేతెంచి యచ్చటనే నివసింపసాగెను. అప్పుడొకనాడు రణజీత్సింహుడు దూతముఖమున నామెకు "నీ భర్తయొద్దగల కోహినూరు వజ్రమును నాకిప్పింతునని వాగ్దానము గావించియుంటివి. కాబూలుప్రభుత్వము వారి కప్పగింపకుండ నీప్రాణనాధుని రక్షించితిని. కనుక నీవుచేసిన ప్రతిజ్ఞను నెరవేర్పవలెను" అని కబురంపెను. అదివిని యామె యీవిషయమునుగుఱించి తన పతితో బ్రస్తావింప నతడావజ్రము తనదగ్గిర లేనేలేదని వచించి రణజీత్సింహున కిట్లు ప్రత్యుత్తరమంపెను: "నాకడ 'కోహినూరు' రత్నము ప్రస్తుతము లేదు.




శ్రీయుత గద్దే రంగయ్యనాయుడుగారు

(మదరాసు ఆంధ్రనాయకులు, కార్పొరేషను సభ్యులు).



శ్రీయుత కె. నారాయణప్పనాయుడుగారు



శ్రీయుత కె. వేంకటస్వామినాయుడుగారు, బి.ఏ.,బి ఎల్.

కాబూలునగరములో నొకవర్తకుని యొద్ద దానిని కుదువనుంచితిని. ఈసంగతి నాభార్యకు తెలియనందున పొరపాటుపడి యామె దానినొసంగెదనని మీకు కబురంపియుండును." మహారాజావులించిన ప్రేవులు లెక్కపెట్టువాడు. ఇట్టి మాయమాటల నాతడనుమాత్రమును విశ్వసింపడు. నవాబుయొక్క సహజకాపట్యము నాతడు గుర్తించి తిరిగి యిటుల జెప్పి పంపించెను. "ఆ వజ్రము నీయొద్దనే యున్నదని నాకు నిశ్చితముగ తెలియవచ్చినది. ఈసంగతి యిటుండనిమ్ము. 'కోహినూరు' నొసంగుటకు వాగ్దానము జరగుటచేతనే కాబూలు వజీరుయొక్క పిడికిటినుండి నిన్ను నేను విడిపించి యాతనితో విరోధము దెచ్చిపెట్టుకొంటిని ఆడినమాట తిరిగిపోవుట నీవంటివాని కుచితముగాదు. కనుక నీ పలుకు నిలువబెట్టుకొని మర్యాదను గాపాడుకొనుము." అప్పుడుకూడ పాపము నవాబున కారత్నమును బాయుట కిష్టములేదు: అది తనకడనే యుండినను, ఈ పర్యాయముకూడ, లేదనియే జవాబుచెప్పి పుత్తెంచెను. అదివిని మహారాజు వాని కుటిలవర్తనమున కెంతయు నలుక జెంది తగినశాస్తిజేయ నెంచి "నేటినుండి నూజాకడకు తినుటకు ఆహారముగాని, త్రాగుటకు నీరుగాని యెవ్వరు గొనిపోరాదు" అని కఠినముగ శాసించి యెవ్వరిని లోనికి పోనీయకుండుటకయి సిపాయిల నచ్చట కావలియుంచెను. ఆహారపానీయము లేమియులేకయే రెండుదినములు గడిచెను. అప్పటికిని 'షూజా' ఆ యమూల్యహారముపయి గలవ్యామోహమును విడువజాలక పోయెను. మూడవనా డామందభాగ్యుడు దాహబాధను భరింపజాలక త్రాగుట కుదకమునడిగెను. కావలిభటుడు "కోహినూరు నీయనిపక్షమున నీటిబొట్టొక్కటియైన నీకు లభింపనేరదు" అని క్రూరముగ వాక్రుచ్చెను.

ఆహా! యెట్టి అవస్థప్రాప్తించెను; తనకడ కోట్లకొలది విలువజేయు జగద్విఖ్యాతమగు 'కోహినూరు' రత్నశ్రేష్ఠమున్నదికాని, యన్నముమాటయటుండ నొక నీటిబిందువైనను లభించుట దుష్కరమయ్యెను. వాస్తవముగ నిటువంటి సమయములందే భగవంతునియపార మహిమోన్నతి స్మరణకువచ్చును. ఏలయన నాదయాసముద్రుడు మన ప్రాణధారణమున కగత్యములగు వస్తువులను సృష్టిలో బుష్కలముగ దయజేసియుండినను, మనము నీచాతినీచులమయి భగవంతునియెడల గృతజ్ఞతను వెల్లడించుటకుబదులుగ వజ్రములో రత్నములో వెండియో బంగారమో రాళ్ళో రప్పలో కావలెనని కోరుచుందుము. మానవుని వివేకమెంత గర్హణీయము!

కాబూలునవాబునకు కొంతసేపటికి ప్రాణము కంఠగతమయ్యెను. ఇక గత్యంతరమేదియు గానరాక ఆతడు నైరాశ్యము జెంది రణజీతునకు "తమరే స్వయముగవచ్చి, యీ వజ్రమును తీసికొనిపొండు: ఒక గ్రుక్కెడు ఉదకముమాత్రము నాకిప్పించి ప్రాణముల దక్కింపుడు." అని విన్నపము పంపించెను. అది వినినతోడనే రణజీతు డచటికి చనెను. 'షాహసుజా' వెలవెలాడు మోముతో, దడియారినపెదవులతో నిశ్చైతన్యమగు జూడ్కితో మూర్తీభవించినదైన్యమో యన మెల్లమెల్లగ తన నడికట్టునువిప్పి దానిలో భద్రపరుపబడిన యారత్నము బయటికిదీసి యాతని యెదుటనుంచెను. ఆయనర్ఘ్యరత్నముయొక్క యుజ్జ్వలకిరణప్రసారముచే గదియంతయు దేదీప్యమానముగ వెలుంగసాగెను. మహారాజునకును అతని యనుచరులకునుగూడ నేత్రములు మిరుమిట్లుగొలిపెను. వారందఱును దాని తేజోవిశేషమున కచ్చెరువొంది యైకకంఠ్యముగ దాని ప్రాశస్త్యమును బ్రశంసింపసాగిరి. రణజీతుని ముఖారవిందము వికసించెను. అతని పరిచారకు లానందనిమగ్నులయిరి. పాపము మందభాగ్యుడగు నవాబునకు మాత్రము హృదయకుహరమునందు గాఢాంధకారము బ్రవేశించిన ట్లాతనిముఖమే మలినమై, యుత్సాహవిహీనమై, ప్రబలదుఃఖాచ్ఛాదితమై ప్రకటింపసాగెను.

ఆవజ్రము లభించినతోడనే రణజీత్సింహుడు 'నూజా'కు భక్ష్యములును, భోజ్యములును, షర్బతులు మున్నగు పానీయములును బంపించెను. కాని గాఢవిషాదసంతప్తచిత్తునకు నాపదార్థములు రుచించునా? ఆనాటిరాత్రి యాతడొకగుటకెడు మంచినీళ్ళుదప్ప మఱియితరవస్తువు లేవియు గ్రహింపనే లేదు. ఆహా! పరమేశ్వరుని లీలావిలాసము! గ్రుక్కెడు జల

ధారలకయి మహారాజాధిరాజులు మాళిస్థానమున విలసిల్లదగిన 'కోహినూరు' వజ్రము లంచ మీయవలసి వచ్చెను. ఇంత ముప్పతిప్పలుబడి రణజిత్సింహుడు సంపాదించిన 'కోహినూరు' వజ్రమే నేడు పంచమ జార్జి సార్వభౌముని రాజకిరీటమునందు స్థగితమై ప్రపంచముయొక్క పరివర్తనశీలతకు నిదర్శనమగుచున్నది.

ఆవజ్రమును గైకొనినపిదప మహారాజు దాని మూల్యమును గురించి ప్రశ్నింప నవాబిటుల ప్రతివచనమొసంగెను: 'బాహుబలమే దీనివెల: ఎవనికి బాహుబలము మెండుగనుండునో, వానికడనే యీరత్నము చిరకాలము నిల్చియుండును. ఈభూషణమునకై యిదివఱకెన్నెన్ని రాజ్యములు నామరూపములు లేకుండ నశించిపోయెనో, యెందఱి శిరస్సులు కొబ్బరిపుచ్చెలవలె కరకర నఱుకబడి భూమిమీద పడెనో, రక్తనదీ ప్రవాహము లెన్నిసారులు పాఱెనో; భావికాలమునందు సైతము దీనినిమిత్తమయి యెన్నెన్ని దారుణోపద్రవములు జరుగునో నేను చెప్పజాలను. ఉన్నతదశ తొలంగిన యెడల నీకడసైత మిది యొక్కనిముసమైన నిల్చియుండనేరదు. ఉండిన రెన్నాళ్లును దీనివైభవము ననుభవింపుము." ఏదియెట్లులైనను ఈ వజ్రము లభించినందులకై రణజిత్సింహుడు సంతోషముతో మహోత్సవము జేయించెను. వాస్తవముగ రణజిత్తుని కీర్తిప్రతాపములు కూడ 'కోహినూరు' హీరమువలెనే యధికముగ ప్రకాశింపసాగెను. ఎక్కడికి కాతడు బోయినను విజయమే లభింపదొడంగెను. నవీనరాష్ట్రము లనేకము లాతని యాధికారమునకు లోబడెను. ఆదినములందతనిరాజ్యము విద్యుల్లతవలె వ్యాపింపసాగెను.

విదేశీయ యితిహాసకారులు కొందఱు రణజిత్తుడు పరాజితుడయిన శత్రువును వేధించి యిట్టు లావజ్రము గ్రహించుట న్యాయముగాదని నిందింతురు. ఆలోచించి చూచినయెడల అతడు దానిని గ్రహించుటలో ననౌచిత్యమేమియును గానరాదు.

ఆరత్నమును మహారాజునకిచ్చుటకై ప్రతిజ్ఞగావింపబట్టియేకదా నవాబు తనప్రాణములను శత్రువులబారినుండి రక్షించుకొనగల్గెను? ఆ వాగ్దానమే జరుగనియెడల మహమ్మదుఖాను వైరులచేతులలో జిక్కియే యుండును. అట్టి విషమపరిస్థితినుండి తప్పించినపిదప ప్రతిజ్ఞానుసార మారత్నమును కోరుటకు మహారాజునకు హక్కుగలదు. ఎన్నిసారులు మరియాదగ నడిగినప్పటికిని నవాబు దానినొసంగలేదు. అటువంటి యున్నత సంభవుని బట్టలువిప్పించి పరీక్షించుటయూ యుక్తము గాదు. సామోపాయముచే వజ్రము లభించెడి మార్గము లేదు. అట్టి సందర్భమునందు మహారా జవలంబించినదే సులభసాధనము. దీనిలో నిందనీయమగు విషయమేమియు గానరాదు

[ఇది నాచేరచియింపబడి అముద్రితముగానున్న రణజిత్సింహుని జీవితమునుండి యుద్ధృతము.]

—గో. సత్యనారాయణ, బి.ఏ.

---

## వైశాఖపూర్ణిమారాత్రులందు

సీ. పెనముపై నట్టు వోసినలీలఁ జుయ్యంచుఁ బొలసె వెన్నెల తప్తఘూర్ధశిఖల
నుష్ణూష్ణమున ముఖానిలోద్ధతిఁ జల్లార్చి తేఁటి చెందొవపూవుఁ దేనె లాని
సఖిలావదాత్తాంగియై చుఱుక్కున నిసు మడుగంటఁ బ్రియునింటి కరిగె జార
కబళించె నుఱుక యాఁకటి కోర్వక చకోరి నిష్టప్తరోహిణీనేత్రకళలు
మల్లియల పూవుదుమ్ము ముమ్మరము ముర్కు, రాగ్నిశిఖలంచు విరహి యారాటమందెఁ
గలువ వికసించియును గసుగంది మొగము, వ్రాల్చె వైశాఖపూర్ణిమారాత్రులందు.

—రామరాజు రంగప్పరాజకవి.

# లక్క పరిశ్రమ

[ఈ వ్యాసకర్త కోయంబత్తూరు వ్యవసాయకళాశాలయందు వ్యవసాయవిద్య నభ్యసించుచున్నవారు. దేశమున నూటికి తొంబదిమందికిపైగా ప్రధానవృత్తియైయున్న వ్యవసాయమును గూర్చిన విజ్ఞానప్రచారము దేశభాషాపత్రికలకు వరణీయమైనది. కావున వ్యవసాయవిషయికములగు వ్యాసములు కొన్ని సేకరించి ప్రచురింప దలపెట్టితిమి. ఈ వ్యాసకర్త రచియించిన మఱికొన్ని ఇటివ్యాసములు కాలక్రమమున ఇందు ప్రచురింపబడును.

—సంపాదకుడు.]

విశేషోపయోగముగల పదార్థములలో లక్క ఒకటి. కాని దాని పుట్టుపూర్వోత్తరముల గూర్చి యేకొద్దిమందికో మాత్రము తెలియును. లక్క చెట్టునుండి తీయబడు పదార్థమని, కర్పూరమునుండి తయారుచేయబడునదని జనసామాన్యమునందు నమ్మకము. కాని లక్క ఒకానొక కీటకమునుండి వచ్చుపదార్థమని చెప్పినచో పలువుర కబ్బురము గల్పింపకపోదు. పురుగు పేరు 'లక్కపురుగు'. ఆంగ్లమున లాక్కిఫెర్ లాక్కా అందురు. పొలుసుపురుగు జాతిలోని, కాక్సిడి అను అనులోమమునకు జెందినది. పురాణసింగ్ అను శాస్త్రజ్ఞుడు, లక్క యీక్రింది పదార్థముల మిశ్రమపదార్థమని నిర్ణయించియుండెను.

నూటికి 65-80 వంతులు—రెజీను.

6-10 ,, —లక్కరంగు.

4-6 ,, —లక్కమయినము.

2-5 ,, —తేనెమంచుఅనబడు వృక్షపదార్థమును, కొద్దినీరును, కొంత మలిన పదార్థమును.

## పారిశ్రామిక కేంద్రములు

ఇండియా అడవులలో లక్కపంట తయారగుచున్నది. మధ్యపరగణాలు, బీహారము, ఒరిస్సా, అస్సాం, సంయుక్తరాష్ట్రములు, పంజాబు, బంగాళము, బర్మా, మైసూరు మొదలగుచోట్ల విరివిగా పండింపబడుచున్నది. మద్రాసురాష్ట్రమునందు, గవర్నమెంటువారిప్పుడే యీ పరిశ్రమకై కృషిసల్పుచున్నారు. మద్రాసు అటవీశాఖవారు, దీనివిషయమై సేలం జిల్లాలోనున్న అడవులయందు పరిశోధనలు సల్పుచున్నారు. ఇండియాకు వెలుపల, యిండోచైనా, సయాందేశములందు లక్క పండింపబడుచున్నది. హిందూదేశపు పంటలో అది నూటికి 5-వ వంతునకు మించిలేదు.

## లక్కపురుగుయొక్క ఆహారము

లక్కపురుగుయొక్క జీవితమును కనుగొనిన విచిత్రముగనుండును. పారిశ్రామికాభిలాషులకు దాని ఆహారవిహారాదులగూర్చి తెలియుట ముఖ్యము. లక్క పురుగు దిగువ పేర్కొనబడిన చెట్లజాతులపై జీవించును.

రేగుచెట్టు (బంగాళము, మధ్యపరగణాలు, పంజాబులందు.)

మోదుగ, పలాస్ (బీహారము, మధ్యపరగణాలు, సంయుక్తరాష్ట్రములు, బంగాళము, బర్మాలందు.)

కుసుమ్ (బీహారము, ఒరిస్సా, మధ్యపరగణాలందు.)

ఏపి, సాల్ల (మైసూరునందు)

ఇవిగాక లక్కపురుగున కాహారముగాదగిన చెట్లు, తుమ్మ, రావి, కంది, రెయిన్‌ట్రీ యనబడు చెట్టు ముఖ్యములు.

## పురుగు జీవితము

లక్కపురుగు 17 మొదలు 25 వారముల కాలము పాటు జీవింపగలదు అవసానకాలమునకు కొద్దిదినముల గడువున్నదనగా ఆడపురుగు గర్భమున గ్రుడ్లేర్పడును. అవి బయటకు వెలువడక, అందే నిలచియుండి, పొదుగబడుచుండును. గ్రుడ్లేర్పడిన అయిదారు దినములకు పూర్వమే తల్లి మరణించును. దాని మృతకళేబరము నుండి, యిదివఱకే పొదుగబడిన పిల్లలు, వందలు వందలుగ, బయటబడి లేతనైన కొమ్మరెమ్మల కెగబ్రాకి,

వాని రసమును పీల్చుకొనుచు జీవింప నారంభించును. ఈ లేబ్రాయపు పిల్లపురుగులను లార్వాలందురు.

లార్వా లప్పటికప్పుడే యొకానొక పలుచని పదార్థమును తమ శరీరమునం దావరించియున్న లెక్కకు మించిన సూక్ష్మరంధ్రములనుండి వెడల జిమ్ముచుండును. ఆ పదార్థము, శరీరమునుండి బహిర్గతమైన వెంటనే, అనగా గాలిలోనికి వచ్చినవెంటనే, ఘనీభవించి, లార్వాచుట్టును గూడువలె తయారగును. ఈ పదార్థమే 'లక్క'. పదునైదుదినముల పిమ్మట చూచినచో, యీ లక్కగూండ్లు స్పష్టముగ గానుపించుచుండును. మగలార్వాలగూండ్లు కోలగను, ఆడలార్వాలగూండ్లు వలయముగను ఉండి లార్వా సంఘమునందలి స్త్రీ పురుషలింగముల స్పష్టముగ వ్యక్తీకరించి నిర్ణయింప వీలుగనుండును. లార్వాలకు తనుత్రాణము లనదగిన యీ గూండ్లకు రంధ్రములు లేకపోలేదు. ఒక్కొక్కగూటికి 5 లేక 6 రంధ్రములుండి, ప్రతిరంధ్రమునందును కొన్ని సూక్ష్మతరములగు పోగులు వ్యాపించియుండును. సూక్ష్మములగు రంధ్రములు మూసుకొనిపోకుండ సూక్ష్మతరములగు పోగులు కాపాడుచుండును. ఎప్పటికప్పుడు వెలువరింపబడిన లక్క యీ పోగులద్వారా బయటకు వచ్చి, గట్టిపడి, యిదివఱకేర్పడిన గూటిని మందము నందేమి, దృఢత్వమునందేమి యినుమడింప చేయుచుండును.

ఎనిమిది పది వారముల వయస్సున లార్వాలు పెద్ద పురుగులుగా మారును. మగపురుగులలో 'పక్షసహితములు', 'పక్షరహితము'లని రెండురకములు గానగును. అప్పుడే ఆడపురుగులును మగపురుగులును సంగమించును. అప్పటినుండియు, ఆడపురుగులు శీఘ్రముగ పెరుగుచు, రక్తవర్ణమును బోలియుండి, అంగుళమునందయిద్ధవవంతు వఱకును పెరుగును. ఆ సమయముననే అవి మరింత రసమును త్రాగుచు, అమితముగ లక్కను తమ శరీరరంధ్రములనుండి వెడల జిమ్ముచుండును. ఇట్లు ఎనిమిది పది వారములు గడచి, అవసానకాలము దాపురించుటకు పూర్వము, వానికి గర్భమున గ్రుడ్లేర్పడును. తదుపరి చావు; పిల్లలు బయటకు తరలుట; పూర్వమువలెనే అవి పెరిగి పెద్దవగుట—యీ విధముగ లక్కపురుగులయొక్క జీవనచరిత్రములు తరతరములు గడచిపోవుచుండును. మగ పురుగు పెట్టు లక్కకంటె ఆడపురుగు నూరురెట్లు అధికముగ పెట్టగలదు. ఇట్లు సూక్ష్మములును లఘువులునగు కీటకకోటులు తమ ప్రాణరక్షణార్థమై నిర్మించుకొన్న 'లక్కగూళ్ళ' యొక్క లక్కయే మానవున కత్యంతోపయోగకరమైన పదార్థమై తనరుచున్నది.

## పంటలు

కొన్నిచోట్ల సంవత్సరమునకు రెండు పంటలును, కొన్నిచోట్ల మూడు పంటలును పండించుచున్నారు. మైసూరునందు మూడు పంటలు అభివృద్ధి నందుచున్నవి.

"చిన్న పంట"—ఉత్తరహిందూస్థానమున కార్తీకపంటయని పిలువబడుచున్నది. ఇది జూనునుండి అక్టోబరు వఱకుండును. దీనిలో రెక్కలులేని మగపురుగులు మాత్రము కనబడుచుండును. అగష్టునందు పురుగుల సంగమము, అక్టోబరునందు లక్కను గ్రహించుటయు జరుగును. 'పెద్దపంట' అనగా 8 మాసముల పంట. వైసాకీయని మారుపేరున బిలుతురు. అక్టోబర్ను నుండి జూన్ వఱకునుండును. రెక్కలు గలవి, రెక్కలు లేనివి గూడ ఇందు కానవగును. జనవరిలో సంగమమును, జూలైలో లక్కను గ్రహించుటయు జరుగును.

## పంటను సిద్ధపరచుట

ఎనిమిదిమొదలు పదకొండు అంగుళముల వఱకు పొడవుగల కొన్నివేల యెండుపుల్లలను సిద్ధముచేసుకొందురు. వీనిని లక్కపురుగుల కాహారమగు చెట్లపై లేత కొమ్మల పంగలలో అడ్డముగ గట్టివైతురు. ఆ పుల్లలు పుచ్చు, చచ్చు లేక యుండునట్లు చూచి, వానిని కడిగి యెండబెట్టి, తగు జాగ్రత్తతో కట్టుదురు. లార్వాలు కొద్దికాలములో బయటకువచ్చుటకు ముందీ పని చేయబడును. ఈ కాలము అవృత్తియందున్న జనులకు బాగుగ తెలిసియుండును. అట్లు సిద్ధముచేయబడిన పుల్లలపైన, యీ లార్వాలు తమ లక్కగూండ్లనుకట్టుకొనును. ఈ పుల్లలమీది లక్కను రాలగొట్టి

వైతురు. ఇదియే ముడిలక్క. ఈ ముడిలక్కను ఆర బెట్టి, పెద్దతొట్లలోపోసి కడిగెదరు. ఆకడిగిననీటితో, లక్కరంగును, కొంతమురికియును పోవును. ఈలక్క రంగునీటిని వృథాగ పోనీక వ్రూలునకు రంగు బట్టింతురు. ఆవిధముగ కడిగిన లక్కను ఎండబెట్టిన పిదప జల్లెడబట్టి తయారుచేయుదురు. దానిని 'విత్తులక్క' అందురు. అది గింజల గింజలవలె నుండుటచే ఆపేరును బొందినది. ఈ 'విత్తులక్క'నుండియే మేలిమి లక్కను తయారుచేయుదురు.

విత్తులక్కను, కాలికోతో తయారుచేయబడిన గొట్టములలో పోయుదురు. తదుపరి, తిరుగుచున్న యీగొట్టములను ఉడుకబెట్టుదురు. ఆర్శినిక్ సల్ఫైడ్ కలుపుదురు లోపలిలక్కకరిగి, కాలికో గొట్టమునుండి బయటకువచ్చును. అటుల వచ్చినదానిని రేకు గరిటలతో తీసిపైచి, వేడినీటి తొట్లపై వేయబడియున్న రాతిపలకలపై, ఒక అడుగు మందమున పోయుదురు. తరువాత, నిపుణుడగు నొక పనివాడు దానిని గ్రహించి, కొద్ది సెగజూపి, లేహ్యమువలె తయారైన లక్కను, మూడడుగుల చదరమును, అంగుళము మందముగలిగిన అచ్చులు తయారుచేయును. ఆరినపిదప యీ అచ్చులే యెగుమతి చేయుటకు సిద్ధముగనున్న మేలిమిలక్క.

## లక్క ఉపయోగములు

మేలిమిలక్కను లక్కగాజులు, లక్కబొమ్మలు, చేయుటయందును; రంగులయందును; ఒకవిధమగు మయినమును తయారుచేయుటయందును ఉపయోగించెదరు. బోలు (గుల్ల) సొమ్ములనింపుట మొదలుగాగల పనులలో కంసాలికి లక్క అమితోపకారి.

పారిశ్రామికముగ లక్క, గ్రామఫోను రికార్డులు తయారుచేయుటయందును, విద్యుద్దీపముల సామానులందును ఉపయోగింపబడుచున్నది. ముద్రలు చేయుటలో లక్క మిక్కిలి యుపయోగమును బడయుచున్నది. లక్క మందులలో సైతము ఉపయోగింపబడుచున్నది. లక్కయొక్క గుణములను 'వస్తుగుణదీపిక' యీవిధమున నుడువుచున్నది, "దీని చూర్ణము లేక కషాయము వెగటుగనుండును; వేడిజేసును; క్రిమిరోగమును, రక్తపైత్యము, చర్ది, ఎక్కిళ్లు, నరకులు, శ్లేష్మ, పైత్య, మేహజ్వరములు, పిశాచబాధ, అపస్మారము, అనగా దేహముదెలియని రోగము వీటిని పోగొట్టును; పురాణవిరేచనములను, పురాణజ్వరములను కట్టును. లక్క నూనెలోవేసి కాచి తలకుపూసిన పురాణజ్వరమువలన గలిగిన నీరసమును పోగొట్టును."

లక్క యింటనివాసమునుగూర్చి అందే యిట్లుచెప్పబడినది: "దీనిలో నివాసము జఠరదీప్తిని, దేహపుష్టిని యిచ్చును; కంఠరోగము, నేత్రరోగము, శిరోవాతము, కఫము వీటిని హరించును; తలవెంట్రుకలకు బలము కాంతిని యిచ్చును."

లక్క నీటిలో గరుగదు. సారాయి మొదలగు వానియందు కరుగును.

## లక్క వ్యాపారము

ఒక యకరము మోదుగచెట్లనుండి, 4 లేక 5 మణుగుల లక్క వచ్చునని నిర్ణయింపబడినది. నేటి బజారు ధర మణుగు రూ 30 చొప్పున, యకరమునకు రూ 120 మొదలు రూ 150 వఱకు వచ్చును ఎకరమునకు రూ 10 లేక 20 ఖర్చులుపోగా, రూ 100 మొదలు 130 వఱకు నికరాదాయమును గడింపవచ్చును.

ఇండియా సగటున సంవత్సరమునకు 40,000 టన్నుల లక్కను పండించుచున్నది. అందు నూటికి 90 పాళ్లు పరదేశముల కెగుమతి చేయబడుచున్నది. మహాసంగ్రామానంతరము పరదేశములందు హిందూదేశపు లక్క చాల గిరాకిగ అమ్ముడుపోయినది. 1920-21 సంవత్సరపు లెక్కలప్రకారము, టన్నులక్క రూ 5000 అమ్మినట్లు తెలియుచున్నది. 1922-23 నందు, యిండియా 10 కోట్ల రూపాయల విలువగల లక్క నెగుమతి చేసినది. కాని, గడచిన రెండువత్సరములలో యెగుమతితోకూడ, ధరలు పడిపోయినవి. ఇండియా తన లక్క అమ్మకమునకై యితర దేశములపై ఆధారపడక, లక్కకు సంబంధించిన పరిశ్రమలను వృద్ధిచేసుకొనినచో, యింతింతనరాని లాభమును బడయగలదనుటలో సందియము లేదు.

—జాగు గోపాలరావు.

# జి జ్ఞా స

విజ్ఞానసంపాదనావసరమున అనేకవిషయములందు తప్పక కలుగు సందేహము లను నివారించుకొనుటకు పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటవలని మీమాంసచే వారి వారి సందేహములు తీరుటయేగాక సామాన్యపాఠకులకుగూడ విజ్ఞానము కలుగును. కావున ఆంధ్రభూమిపాఠకులు వివిధవిషయములందు తమకు కలుగు సందేహములను ఈ జిజ్ఞాసపుటయందు ప్రచురింప బంపుచుండ ప్రార్థన. —సంపాదకుడు.

8. స్త్రీలు: యజ్ఞోపవీతధారణ.

స్త్రీలకు యజ్ఞోపవీతధారణ లేని కారణ మేది ?

—కొత్త సుబ్బయ్యచౌదరి.

9. నిమ్మ, నారింజరసములు నిలువయుంచుట.

నిమ్మపళ్ళ రసమును, నారింజపళ్ళ రస మును నిలువయుంచు విధానము ఏమైన కలదా ?

—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

10. స్త్రీలు: సంధ్యావందనము.

పూర్వకాలపు స్త్రీలకు సంధ్యావందనము లుండెడివా ? లేవా ?

—కొత్త సుబ్బయ్యచౌదరి.

11. జర్మనీలోని స్వాస్తికచిహ్నము.

జర్మనీలో హిట్లరు ఆధిపత్యము వచ్చిన ప్పటినుండియు స్వాస్తికచిహ్నము ప్రాధా న్యము వహించినది. ఆ స్వాస్తికచిహ్నము యొక్క పుట్టుపూర్వోత్తరము లెట్టివి ? దాని భావమేమి ? ఆ చిహ్నము హిందూదేశజనిత మనుటలో ఏమైన సత్యముగలదా ?

—కోట కృష్ణమూర్తి.

12. కొన్ని నేలలలోని పొగాకు కాలకుండుట.

ఎంతకష్టపడి బలంచేసినా కొన్ని నేలలలో నుత్పత్తియగు పొగాకు కాలుటలేదు. కార ణమేమి ? కాలునట్లొనర్చుట కవలంబింప వలసిన మార్గమేది ?

—చలసాని రామచంద్రరావు.

13. బెండచెట్లనారనుండి పట్టు.

బెండచెట్లను కాపున కుపయోగింప కుండా పువ్వుల నెప్పటికప్పుడు త్రుంపివే యుచు చెట్లనుపెంచి వాని నారలోనుండి ఉత్కృష్టమైనదియు విలువగలదియు సిల్కును తయారు చేయవచ్చునట—ఎట్లు ? ఎచట తయారుచేయబడుచున్నది ?

—ఆర్. యస్. రావు.

14. బియ్యము: దాని విశేషోపయోగము.

ధాన్యాదులలో వరిపంటకు ధరపూర్తిగా పడిపోవుటకు కారణము ప్రపంచమున వరి పంటయొక్క ఉత్పత్తి యధికమగుటచేతనే అని యనుచున్నారు. ఈ కారణముచే తల క్రిందులగుచున్న రైతుల ఆర్థికపరిస్థితి చక్క బరచుటకు బియ్యమును ఆహారమునకు మా త్రమే గాకుండా అందుండి యేదైన నొక విలువగల ప్రజోపయోగకరపదార్థము నుత్పత్తిచేయుట కేదేశమందయిన ప్రయత్న ములు జరుగుచున్నవా ?

—సి. యన్. చౌదరి.

15. మూలికలవ్యవసాయము.

ఇటీవల మన దేశమున ఆంగ్లాయుర్వేదౌ షధకర్మాగారములు వృద్ధియగుచున్నవి కదా. ఈస్థితియందు మూలికలవ్యవసాయము ఆర్థికముగ లాభదాయకమేనా ? అయినచో నేయేమూలికలను పెంచుట మంచిది ?

—మేకా రామస్వామి.

జిజ్ఞాసపుటను పఠించినమీదట అందు ఏఒక్క దానికైననుసరే తమకు సరియైన సమాధానము తెలిసియున్నచో దయచేసి దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి మా కార్యాలయమునకు పంపవలసినదిగ ఆంధ్రభూమిపాఠకమహాశయులను ప్రార్థించుచున్నాము. మీమాంసలను వ్రాయునపుడు జిజ్ఞాసయొక్క నెంబరు, ఆసంచికయొక్క నెల సూచించుట ముఖ్యము.

—సంపాదకుడు.

### 7. యజ్ఞోపవీత ధారణోద్దేశము.

వేదశాస్త్ర విహితములైన సమస్త కర్మలను ఆచరించుటకు నేను బద్ధుడనై యున్నాడనని తెలుపుటకుగాను ఉపవీతము ధరింపబడుచున్నది. దానియొక్క మూడు పోగులను గురించియు, 96 బెత్తల (షణ్ణవతి) దారముతో ఆ మూడుపోగులను చేయుటనుగురించియు ధర్మార్థకామముల మూడింటికిబద్ధుడనై యున్నాడననియు, షణ్ణవతి శ్రాద్ధముల నాచరించుటకు నేను బద్ధుడనైయున్నాడ ననియు అంగీకరించితిననుటకు చిహ్నమని చెప్పెదరు. ఇట్లే అనేకమైన ఉపపత్తులు కల్పించవచ్చును. యతీశ్వరులు వేదములో కర్మకాండకు సంబంధించినదానిని వదలుచున్నారుగావున వారికి శిఖాయజ్ఞోపవీతముల రెండింటితోడను అవశ్యకము లేదు. —కనుపర్తి మార్కండేయశర్మ.

### 8. స్త్రీలు: యజ్ఞోపవీతధారణ.

వేదాధ్యయనము నిమిత్తము పుట్టిన ఉపనయనము స్త్రీలకు నిషేధింపబడుటచేత తత్ప్రాప్తమైన యజ్ఞోపవీతధారణము స్త్రీలకు లేదు. యజ్ఞములయందు కొన్ని మంత్రములు యజమానియొక్క భార్య, చెప్పవలసినవి గలవు. ఆ మంత్రములను ఆస్త్రీచే చెప్పించుటకుముందు దర్భలతో మేఖల అను ఒక దానిని నడుముకు కట్టించి ఆ మంత్రములు చెప్పించెదరు. ఆ మేఖల కట్టించుటచే ఆస్త్రీకి వేదమంత్రోచ్చారణాధికారము కలిగినదని తలంపబడుచున్నది. —కనుపర్తి మార్కండేయశర్మ.

### 9. నిమ్మ, నారింజరసములు నిలువయుంచుట.

నిమ్మరసము నిలువయుంచుటకు ఒకసేరు నిమ్మరసములో ఒకసేరు పంచదార కలిపి కాచి షరబతుపాకము వచ్చినపిమ్మట దించుకొని సీసాలకెత్తి గాలితగులకుండ భద్రపఱుచుకొనవలయును, ఇది ఆరుమాసముల వఱకు చెడిపోకుండ నుండును. నారింజ రసము నిలువయుంచుటకు ఒకసేరు నారింజరసములో ఒక అరసేరు పంచదారకలిపి కాచి షరబతుపాకము వచ్చినపిమ్మట దించుకొని సీసాలకెత్తి గాలితగులకుండ జాగ్రత్తపెట్టవలయును. ఇదికూడ చెడిపోకుండ ఆరుమాసములు నిలువయుండును.

—కృష్ణంరాజు, యల్. ఐ. యమ్.

### 10. స్త్రీలు: సంధ్యావందనము.

సంధ్యావందనమనగా ప్రాతస్సాయంకాల సంధికాలములందు భగవంతుని గురించి చేసెడి నమస్కారము, స్తుతి మున్నగునవి యని యర్థమగును. ఇట్టి సంధ్యావందనము చేయుటకు స్త్రీలకందఱకు అధికారము గలదు. సంధ్యావందన మనగా ద్విజాతులకు తమతమ వేదకల్పసూత్రములందు విధింపబడినరీతిగా సాయంప్రాతఃకాలములందు చేయవలసిన కర్మవిశేషమనికూడ అర్థము కలదు. అట్టి మంత్రపూర్వకమగు సంధ్యావందనమునకు ఉపనయనాధికారము లేని స్త్రీలకు అధికారము లేదని తలంచుచున్నాము.

—కనుపర్తి మార్కండేయశర్మ.

# జార్జి ఈస్టుమాన్

[పొట్టకూటికి ఒక బ్యాంకులో గుమాస్తాగా ఉండినవాడు కోడక్ కెమెరా సిర్మాతయై ప్రపంచమెఱిగిన వణిక్పుంగవులలో అగ్రశ్రేణికి చెంది కొలది ఇడరాని కీర్తిని, కుబేరుని తలదన్ను ధనమును ఆర్జించిన విచిత్రవృత్తాంతకథనము.]

అమెరికాసంయుక్త రాష్ట్రమునందలి న్యూయార్కు-రాష్ట్రమునకు చెందిన రాచెస్టరునందలి ఒక అమెరికను బ్యాంకుక్లార్కు-యువకుడు- ఇప్పటికి సరిగా అరువది వత్సరములకు పూర్వము ఒకనాడు తన ఆఫీసుమేనేజరు ఎదుట నిలబడియుండెను. దినదినమును కార్యాలయమునకు మఱకలుపడ్డ చేతిత్రేళ్ళతో ఆయువకుడు వచ్చుచుండుటనుగూర్చి మేనేజరు కఠినాక్షరకలితములగు మాటల నాడుచుండెను. "నేను ఫోటోగ్రాఫు విషయిక పరిశోధనలు గావించుచున్నాను. అట్లు గావించుటలో నేను ఎంతజాగ్రత్తగనున్నను అరసాయనికవస్తువులు (కెమికల్సు) నాచేత్రేళ్ళపై మఱకలు పెట్టుచున్నవి." అని ఆ యువకుడు వినయపూర్వకముగ విన్నవించుకొనెను. మేనేజరు మంచివాడే. కాని వ్యాపారము వ్యాపారమే. కావున అతడు ఆ యువకునితో నీవు ఫోటోగ్రాఫువిషయికపరిశోధనలైన విడిచిపెట్టవలయును, లేదా ఇచ్చటి ఉద్యోగమునైన విడనాడవలయును అని చెప్పివైచెను. యువకుడు దీర్ఘముగ ఆలోచించెను, ధైర్యమును చిక్కబట్టెను. బ్యాంకులోని తన ఉద్యోగమును విడనాడుటకే నిశ్చయించెను. తన మనసునకెక్కిన ఫోటోగ్రాఫీని వదలుటకంటే ఉద్యోగమునే వదలి రాగలదారిద్ర్యము ఎదుర్కొనుటయే ఉత్తమముగ అతనికి తోచినది.

ఏబదియేండ్లకు పిమ్మట—1926-వ సంవత్సరములో—ఆనాడట్లు బ్యాంకు ఉద్యోగమును విసర్జించిన యువకుడు లండనులోని ఒకానొక సుప్రసిద్ధవైద్యాలయమున డెంటల్‌క్లినిక్ (దంతవైద్యశాఖ) ఏర్పఱచుటకై 200,000 పౌనులను దానముచేసెను. అప్పటికి అతనికి డెబ్బదిరెండు వత్సరములు. కోటీశ్వరుడయినాడు; ప్రపంచమునందలి దేశములన్నిటియందు విశేషవ్యాప్తినొందిన 'కోడక్'అను ట్రేడుమార్కుగల విస్తృతవ్యాపారమునకు అధ్యక్షుడైనాడు. తన డెబ్బదిరెండవ జన్మదినోత్సవసందర్భమున ఆత డావత్సరమున తూర్పు ఆఫ్రికాకు వేటతమకమున పలువురు మిత్రులతో, అనుచరులతో కలసివెళ్ళెను.

బ్యాంకు వదలిననాటినుండి 1926-వ సంవత్సరము వఱకునుగల అతని—అతని నామము జార్జి ఈస్టుమాన్—జీవితచరిత్ర అత్యద్భుతముగా నుండును. ధనార్జనాతృష్ణయే ఈస్టుమాన్ అద్భుతజీవితమునకు పునాదిరాయి.

ఇప్పుడు జయముకలుగకపోయినను భావికాలమునందెప్పుడో శుభముకలుగ కలదను కాంక్షతో కలలను గాంచు ప్రఖ్యాతపరిశోధకులతీరు అతనికడ కానము. పసివాడు గాకూడ అతడు గొప్ప వ్యవహారజ్ఞానము కలిగియుండెను. అమెరికాసంయుక్త రాష్ట్రమునందలి తొలి జట్టు వ్యాపారకళాశాలలలో నొకదానికి అతని జనకుడు సంస్థాపకుడు. అయితే అతడు యువకుడుగానే జార్జి బాల్యముననే చనిపోయెను. అతని మరణానంతరము కూడ కొద్దివత్సరములు ఆ కళాశాల సక్రమముగనే సాగెను. ఆ వత్సరములలో అతని వితంతువునకును, అతని కుమారుడగు జార్జికిని ఆ కళాశాలనుండి వచ్చెడి వరుమానమే జీవనాధారమైయుండెను. కాని కొన్ని వత్సరములపిమ్మట కళాశాల నిలిచిపోయెను. అప్పటికి జార్జికి పదునాలుగువత్సరములు. ఆ పదునాలుగేండ్ల పసితనమున ఆబాలుడు ఏదైనపనిచేసి నాలుగురాళ్ళు తెచ్చితనకుతోడు తనతల్లిని కూడ పోషింపవలసినవాడయ్యెను.

ఒకటిరెండు చిన్నచిన్న ఉద్యోగములు చేసిన యనంతరము అతడు ఒకానొక బ్యాంకువారి రాచెస్టరు శాఖయందు జూనియరు క్లార్కు పదవిని సంపాదింపగలిగెను. ఆ బ్యాంకును దినదినము రాకపోకలొనర్చు ఖాతాదారులను చూచుచుండుటవలన మానవస్వభావపరిశీలనమునకాతనికి గొప్పఅవకాశము లభించెను. ఆ ఖాతాదారులలో కొందరి ఎక్కౌంటులందు సదా పుష్కలముగ డబ్బుఉండుటకును, కొందరి ఎక్కౌంటులందు అవి చావకుండనుండుపాటి ధనముమాత్రము ఉండుటకును కారణములు ఆరయుటలో యువకుడగు ఆ వ్యవహారజ్ఞుడు ఒక కన్నుంచువాడు. ఆదినములలో ధనము: దాని యావశ్యకతనుగూర్చిన విషయములయందే అతని దృష్టి కేంద్రీకృతమై యుండునది. తమయింట తాము నాలుగు వేళ్లు లోపలకు పోవునట్లు కడుపునిండ అన్నముతినుటకు అనువగుస్థిరమైన వరుమానము తమకు ఉండుటకుగాను ఆ బ్యాంకునందలి తన చిన్నఉద్యోగమును వదలి వైచి అన్యవృత్తి అవలంబింపవలసియుండునని ఆతడు బ్యాంకులోచేరిన కొద్దిదినములకే గ్రహించెను.

కావున సొంతముగ నేదైన వ్యాపారముపెట్టువిషయమున అవకాశమునకై ఆత డెల్లవేళల ఎదురుచూచుచుండువాడు. మోటారురాజు హెన్రీఫోర్డువలెనే జార్జి ఈస్టుమాన్ కూడ యువకుడుగా ఉన్నప్పుడే నిజమైన జయమునందుటకు అందరికీ అక్కఱకువచ్చు వస్తువున కొకదానికి తాను ప్రొప్రయిటరును, విక్రేతయు కావలసియుండునని గ్రహించెను. హెన్రీఫోర్డు గడియారములు కాని, మోటారుకారులు గాని అట్లు అమ్ముటకు అనువైన వస్తువులని తలంచి మోటారుల నెన్నుకొన్నాడు. చాల దినములు యోచించినను జార్జి ఈస్టుమాన్ కు అట్టి జయమునిచ్చువస్తువు యేదియు తొలుత పొడగట్టలేదు. అట్టి వస్తువును కనుగొనుపాటి తెలివి తనకు లేదేమోనని ఆతడు పలుతడవలు అనుమానించువాడు. పాఠకమహాశయా! తీరికూర్చుండి నీవుకూడ అట్టివస్తువు నొకదానిని కల్పింపకలవేమో యోజింపుము. ఎంతగ తలచించుకొని యోజించుచున్నను నీకు అట్టివస్తువు పొడగట్టుటలేదు కదా? యువకుడగు ఆ బ్యాంకుక్లార్కు అట్లు యోజించుటలో ఎంతటి కష్టమునకులోనై యుండెనో ఇపుడైన నీవు పొల్చి పట్టగలవనుకొందుము. ఈశ్వరాదేశమువలె ఒకసారి ఆత డట్టివస్తువు కనుగొనుట కొక చక్కని యవకాశము లభించెను ఒక వేసవిలో బ్యాంకువారు ఆతనికి సెలవులిచ్చిరి. ఆ సెలవుదినములలో ఆతడు వెస్టుఇండీస్ ద్వీపములకు విలాసయాత్ర పోవలయునని సంకల్పించెను. కూడ తల్లినికూడ గొనిపోవదలంచెను. కాని ఆమె దేహమున స్వాస్థ్యముగ లేదు. అట్టిస్థితిలో ఆమె ఇల్లుకదలుటకు అంగీకరించలేదు. ఇంతకు పూర్వము ఈస్టుమాన్ స్వస్థలమునువీడి ఒంటరిగ పయనించినవాడు కాడు. అగుట ఆతనికి తలపెట్టిన ఈయాత్ర యొక సాహసకృత్యమువలె నుండెను. తనతో తనతల్లి రాదు. వెస్టుఇండీసునందలి వింతదృశ్యములను ఆమె చూడగలుగునట్లు చేయుటఎట్లు? ఆవింతదృశ్యముల ఫోటోలను తీసికొనివచ్చుచో ఆమె ఆనందించును. కావున ఆతడు యాత్రవెళ్ళుటకుపూర్వము ఫోటోగ్రఫీ నేర్చుకొనుటకు దొరకొనెను.

నేడు ఫోటోగ్రాఫుల నెత్తుట అతిసులభము. ఆ దినములలో అది అంతటి సులభమైయుండలేదు. ఫోటోగ్రఫీ నేర్చుకొనుట అపు డొక బ్రహ్మవిద్యగానుండెను. ఫోటోగ్రఫీలో అపుడు అతడు నేర్చుకొనిన ప్రథమపాఠమెట్టిది? చిన్నఫోటో ఎత్తుటకైనను ఆదినములలో విశేషసామగ్రి కావలసియుండెను. ఒకడ్దపెట్టెవంటి కెమెరా, ఒక పెద్ద బరువైన త్రిపాది (ట్రిపాడ్), గ్లాసుప్లేటు, సైట్రేట్ బాత్, నీటికొట్టి, ముసుగు కల్పించుటకు నల్లటిబురఖా. ఈ సామగ్రినంతటిని పొందిక గాకట్టి వీపుపై బెట్టుకొని మోయనభ్యసించుటయే కోడక్ కెమెరా రాజు అగు జార్జి ఈస్టుమాన్ ఫోటోగ్రఫీలో నేర్చిన ప్రథమపాఠము. ఫోటోగ్రాఫు తీయతలపెట్టిన తావునకు వీనినన్నిటిని తీసికొనిపోవలసియుండెను—వాని నచట పెట్టి ఫోటో ఎత్త సిద్ధముచేయవలసియుండెను. ఇట్లు సిద్ధముచేయుటకే సుమారు ఒకగంటకాలము పుచ్చుకొనునది. నల్లటిగుడ్డతో చీకటిగుడారము నిర్మించుకొని అందు సొల్యూషనులు కలుపుకొని వానిసాయమున గ్లాసుప్లేటు సెన్సిటైజ్ చేసి, తడిగా ఉండగనే దానిని కెమెరా

రాలోనికి జార్చి, ఫోటో ఎత్తి తిరిగివెంటనే గుడారములోనికి చొచ్చి ఎప్పటికప్పుడే ప్లేట్లను డెవలప్ చేయవలసియుండెను.

ఒక్క ఫోటో ఎత్తుటకే ఈ పరిస్థితులలో ఒకపూట పని పుచ్చుకొనుచుండెను. ఫోటోగ్రఫీ ఒక వినోదకృత్యమై యుండుటకుమారుగా విశేషపరిశ్రమనుగోరు పెద్ద పనియైయుండెను. ఆ సెలవుదినములలో ఈ ఫోటోగ్రాఫిక్ సామగ్రిని వీపుపైవైచుకొని భారవహము మాదిరిగా ఎండలకు కాలిన రోడ్డువెంట కాళ్ళీడ్చుకొనుచు పోవుచు జార్జి ఈస్టుమాన్ ఫోటోగ్రఫీలోగల ఈశ్రమ నంతటి తగ్గించి దానిని సులభసాధ్యముగ నొనరించుటవాంఛనీయమని తలంచెను. తాను అన్వేషించుచున్న ధనార్జనావకాశమునకు ఇదియెంతయు తగియుండుట అతడు దీర్ఘపుటాలోచనపై నిశ్చయించెను. నిశ్చయించినతోడనే అతడు తల్లియొద్దకుబోయి అనుజ్ఞవేడి పరిశోధనలు గావించుటకు ప్రారంభముచేసెను.

ఏదైన నొకదానిని కనుగొనదలచినవానికి పనిముట్లకంటె ఉత్సాహసంపదయే హెచ్చు వాంఛనీయమైనది. జార్జి ఈస్టుమాన్ గావించినదానికి నేడు మనము ఆశ్చర్యపడుచున్నాము. మా అభిప్రాయమున అతడు చేసిన దానికికంటే అతడు పరిశోధనలు ప్రారంభించిన మొదటి దినములలోని అతని పరిస్థితులకు ఎక్కువ ఆశ్చర్యపడవలసియుండును. తమ వంటయిల్లు అతని పరిశోధనశాల. తనతల్లి స్టవ్ అతనికి పరిశోధనసమయమున అగ్నిహోత్రము నిచ్చునది. కొద్ది కాలమునకు పిమ్మట తన పరిశోధనలకు ప్రత్యేక మొకగదిని ఏర్పఱచుకొనగలిగెను. నిత్యమును బ్యాంకువీడినతోడనే పరిశోధనాగారమున ప్రవేశించువాడు. అర్ధరాత్రమగువఱకు—ఒక్కొక్కప్పుడు అర్ధరాత్రముకూడ అతిక్రమించునది—పరిశోధనలు గావించువాడు. ఎండబెట్టబడి పాకెట్టులలోనుంచి విక్రయించుటకు అనువగు ఫోటోగ్రాఫిక్ ప్లేటును తయారుచేయుట ఆ పరిశోధనని సంకల్పము. ఆ సంకల్పము నెఱవేరినచో ఫోటోతీయుటకుముందు ప్లేటును సెన్సిటైజు చేయవలసిన ఆవశ్యకము, ఫోటో తీసిన వెంటనే దానిని డెవలప్ చేయవలసిన ఆవశ్యకము తొలగిపోవును. పరిశోధన ఫలించుననియు అట్టి ప్లేట్లు తయారుచేయగల విధానము తాను కనుగొనగలననియు అతడునమ్మి రాత్రులు వేగించువాడు. కెమికల్సు స్టవ్ మీద ఉడికి తయారగులోపల అతడు తీయుచుండు కోడికునుకులే అతనికి కండ్లునిండిన నిద్రయగుచుండెను.

పెక్కు విధముల పరిశోధనలు గావించెను; తాను చదివినవి, వినినవి అగు విధానములన్నియు పరీక్షించెను. తుదకు ఒక ఆంగ్లదేశపు మాసపత్రికలోగల సూచన నందుకొనెను. దినములు జరుగుచురాగా అతని కీపరిశోధనలతోడిద లోకమయ్యెను. రెండుసంవత్సరముల విశేషపరిశోధనల యనంతరము అతడు పొడిప్లేట్లను కనుగొనెను. వానినిచేయుటకు మొదటిఫ్యాక్టరీ స్థాపితమయ్యెను. ఒకానొకదుకాణముమీద ఒక చిన్నగదియే అప్పటి అతనిఫ్యాక్టరీ. తాను పనిచేయుటకు ఒక అసిస్టెంటు. పొడిప్లేట్లనిర్మాణము ప్రారంభమయ్యెను. నిత్యము బ్యాంకువీడుటతోడనే జార్జి ఈస్టుమాన్ తన ఫ్యాక్టరీలో ప్రవేశించువాడు. ఎముల్షన్ కలుపువాడు. మఱునాడు అతని అసిస్టెంటు ఆ ఎముల్షన్‌ను ప్లేట్లకు పట్టించువాడు.

ఆ ఎముల్షన్ కలుపుటలో అతని ముంజేతులు మఱకలుపడి అసహ్యముగ తయారగుచుండెను. కాని ప్లేట్ల అమ్మకము పెరుగుచుండెను. కావుననే—బ్యాంకులో తనకు ప్రక్కనకూర్చుండి పనిచేయు లేడీక్లార్కు మచ్చలతో మఱకలతో అతివికృతముగనున్న అతని చేతులను గూర్చి మేనేజరుతో రిపోర్టుచేసినపుడు, మేనేజరు అందు విషయమై తనను కఠినాక్షరకలితములగు మాటలు ఆడినపుడు అతడు భయపడలేదు; తన వర్తకముయొక్క జయమునుగూర్చి శంకింపలేదు. అప్పటికి అతనిది చిన్న వర్తకమేయగుగాక. దానిని విరమించి ఉద్యోగమును నిలుపుకొనుటకంటె ఉద్యోగమునకు నివాళాంజలి ఇచ్చి వర్తకమే నిలుపుకొనుటకు అతడు కృతనిశ్చయుడయ్యెను.

అవి అతడు ఉద్యోగముమాని వ్యాపారముమీదనే పూర్తిగ ఆధారపడియున్న క్రొత్త దినములు. రాచెస్టరుజిల్లాదాటి అతని ప్లేట్లు ఇంకను ఇతర ప్రదేశము

లందు వ్యాప్తినందియుండలేదు. ఆ సమయమున న్యూయార్కు నగరమునందలి ఫొటోగ్రాఫిక్ వస్తు విక్రేతయొకడు రాచెస్టరువచ్చెను. ఇచటి ఫోటోగ్రాఫరు ఒకడు ఈస్టుమాన్ పొడిప్లేట్లతో ఛాయాచిత్రములు తీయుటచూచెను. పొడిప్లేట్ల సౌకర్యము ఆ వర్తకుడు వెంటనే గ్రహించెను. ఈస్టుమాన్ చిరునామా తెలిసికొనెను. మఱునాడు ఆవర్తకుడు ఈస్టుమాన్ చిన్నఫ్యాక్టరీని సందర్శించి తాను మాసమునకు నిర్ణీత సంఖ్య ప్లేట్లు వెలకు గొనుటకును, ప్లేట్లు తన కార్యస్థానము చేరుటతోడనే సొమ్ము చెల్లించుచుండుటకును ఆర్డరుఇచ్చెను. హెచ్చుసంఖ్య ప్లేట్లు తయారు చేయుటకు ఈస్టుమాన్ ఇట్టి ఆర్డరునకై ఎదురుచూచుచుండెను. ఎదురుచూచినది దగ్గఱకు వచ్చెను. హృదయము సంతోషములో ఉత్తరంగితమగుచుండగా నాతడు ఆ ఆర్డరును చేకొనెను.

కొన్నినెలలు అంతయు సవ్యముగనే సాగెను. శీతకాలము వచ్చినది. శీతకాలమున ఆదేశమున అప్పుడు ఫొటోలుతీయుట అరుదు. అయినను న్యూయార్కు వర్తకుడు నెలనెలకు తాను నిర్ణయించుకొనిన ప్లేట్లను తీసికొనుచునే యుండెను. ఈ కారణమున జార్జి ఈస్టుమాన్ కొలదిరోజులలో తనఫ్యాక్టరీని పెంపొందింపవలసియుండునని కృతనిశ్చయుడయ్యెను. ఇంతలో వసంతకాలము వచ్చినది. గొప్ప ఆశాభంగమొకటి తటస్థించినది. శీతకాలమున వర్తకుల అరలలో నిలవయున్న ప్లేట్లను కొన్న కాతాదారులందఱును ఆ ప్లేట్లు స్ఫుటముగు ఫొటోలను తీయుటలేదని చెప్పదొడగిరి. న్యూయార్కు వర్తకు డందుమీద తాను కొన్నిప్లేట్లతో ఫొటోలను తీసి పరీక్షించెను. నిజమున కవి మసగమసగగానే యుండెను. తోడనే అతడు ఈస్టుమాన్ కడకువచ్చి నిలవమీద ప్లేట్లు ఈరీతిని పాడగుటకు కారణము విచారించెను తనప్లేట్లు నిలవయుండజాలవను సంగతి ఈస్టుమాన్కు అప్పుడే తెలియవచ్చెను.

గొప్ప ఆశాభంగము. దానికితోడు మఱియొక సమస్యకూడ ఎదురయ్యెను. ఫొటోలను ప్రస్ఫుటముగ తీయని కారణమున వాపసువచ్చి న్యూయార్కు వర్తకుని అరలనిండ మూలుగుచున్న ఆప్లేట్ల నష్టమును ఎవరు భరించుట ? అవి బాగుగ పనిచేయునను దృఢ విశ్వాసముతోడనే కొనబడినవి. ఈస్టుమాన్ కాని, న్యూయార్కు వర్తకుడు గాని అవి చెడిపోవునని ఎఱుగరు. అవి ఇపుడు నిరుపయోగములై యున్నవి.

సాధారణముగ అట్టి పరిస్థితులయందు మఱియొక డైనచో తన ఫ్యాక్టరీ వీడినతరువాతి వస్తువులస్థితికి తాను బాధ్యుడను కానని చెప్పివైచును; లేదా డబ్బు తిరిగి ఈయకుండుటకై మఱియొక సాకు చెప్పియుండును. జార్జి ఈస్టుమాన్ అప్పటికే తానొక గొప్పవస్తు నిర్మాతనని భావించువాడు. జయమందదలచిన వస్తు నిర్మాతకు కావలసినది ఆతడు సత్యశీలుడు, ఋజువర్తనుడు అగువ్యాపారి అను ఖ్యాతియే అని ఈస్టుమాన్ ఎఱుగును. కావున ఆతడు చెడిపోయిన కారణమున వాపసు ఇచ్చిన ప్రతిఒక్క ప్లేటును తీసికొని వాని మూల్యము అణాపైసలతో లెక్కచూచి ఇచ్చివైచెను. అందులో ఆతనిగళ్ళాపెట్టి ఖాళీఅయ్యెను. చేతిలో ఒకపౌను మాత్రము మిగిలియుండెను. ఏదో సాకుచెప్పి పేరు పోగొట్టుకొనుటకంటె ఇటుల వానిఖరీదంతయు ఇచ్చివేసి నష్టభారమునంతయు తానేవహించుట ఉత్తమముగ తలచి అతడు ఉత్తంసుడయ్యెను.

ఇకముందు వ్యాపారము సాగించుటకు ధనము కావలసియున్నది. తనదగ్గఱ యేమియు లేదు. కావున ధనవంతుడగు నొకనిని వాటాదారుగ స్వీకరించెను. వారిద్దరును కలసి కలిగిన నష్టమును కూడదీయుటకు ప్రారంభము చేసిరి. ఈసారివారు ప్లేట్లు కొనువారికి తొలుతనే వార్నింగులు ఇచ్చుచుండువారు : నిర్ణీతకాలమునకు పైన ఆప్లేటులు పనిచేయవని. తిరిగి వ్యాపారము అచిరకాలముననే పూర్వపుస్థితిని పొందెను. జార్జి ఈస్టుమాన్ పొడిప్లేటులను గూర్చి అమెరికను ప్రజలు విశేషముగ చెప్పుకొనజొచ్చిరి; వ్యాసములు వ్రాయజొచ్చిరి. ముప్పది ఏండ్లవయస్సు నిండకపూర్వమే ఆ బ్యాంకుక్లార్కు ప్లేట్లరూపమున జయలక్ష్మిని చేపట్టి అతిలోకుడైనటుల కన్పట్టెను.

కాని జార్జి ఈస్టుమాన్ తన జీవితములో ఎదు

రొక్కనిన గొప్ప ఆశాభంగములలో కెల్ల దారుణమైనది ఈదినములలోనే కలిగెను. ఒకనాడతడు కొలది కాలములో తాను జయశిఖరమునందు క్రొత్తమార్కెట్టులను లోగొని వణిక్పుంగవుడను కాగలనని తలంచెను. మఱునాడు సర్వనాశనము, పూర్తిభ్రష్టత్వము ఆతనికి ఎదురై నిలచెను. ఇది సంభవించినప్పటికి ఈస్టుమాన్ ఇంకను యువకుడే. మఱియే యువకుడును ఈక్లిష్ట పరిస్థితిని తట్టుకొనలేకపోవుననియే చెప్పవలసి యున్నది. పొడిప్లేటులను తయారుచేయుటకు అనువు కల్పించిన ఈస్టుమాన్ ఎమల్షన్ ఉన్నట్టుండి పనిచేయక పోయెను. ప్లేటులు నిరుపయోగములయ్యెను. వీడు మిక్కిలి ఎంత తన్నుకొన్నను ఆ ఎమల్షను పనిచేయకపోవుటకు కారణమేమియో తెలియరాలేదు. రాత్రింబవళ్ళు ఈస్టుమాన్‌కు అదియేధ్యాస. ఫార్ములాప్రకారము అతి జాగ్రత్తతో తిరిగి ఎమల్షను తయారుచేసెను. పూర్వపు పద్ధతికిని ఇప్పటిపద్ధతికిని తుచ తప్పలేదు. వాడినవి అవియే కెమికల్సు, చేసిన పద్ధతియు అదియే. అంతయు సమానము—ప్లేటులు మాత్రము పనిచేయవు; అవి ఫొటోలను తీయవు. పిడుగుపాటునకువలె అతని వ్యాపారము ఒక్కసారిగ అదృశ్యమైనది దోషము ఎక్కడఉన్నదో పోల్చి పట్టుకలుగువఱకు అతడు ఒక ప్లేటు తయారుచేయజాలడు. ఒక కాసీ ఆర్జింపజాలడు. ఆతనిమీద, ఆతని వాటాదారుమీద, ఆతనికి సాయముచేయుచున్న మిత్రబృంధముమీద గొప్ప విపత్తు విఱుచుకొని పడెను. వారు ఫ్యాక్టరీని మూతవైచిరి. ఈస్టుమాన్ ఒక్కడు మాత్రము లాబరేటరిలో కూర్చుండి దివారాత్రములు పరిశోధనలు సలుపుచుండెను. పరిశోధన తరువాత పరిశోధన తప్పిపోవుచుండెను. ఒకదానివెంట ఒకటి అవి తప్పిపోవుటతో ఈస్టుమాన్ ఉద్రిక్తుడు, ఉన్మత్తుడు అగుచుండెను. తాను పొడిప్లేటులు చేసిన వృత్తాంతమంతయు స్వప్నగతవృత్తాంతమువలెనుండెను. తాను ఒకప్పుడు తనఫార్ములాప్రకారము పొడిప్లేటులను తయారుచేసిన విషయము నిజముకాదని అతనికి తోచెను. అది అంతయు ఒకకల. కలగాక అదినిక్కవమే అయినచో అవియే కెమికల్సు, అదియేపద్ధతిగదా ప్లేటులు ఏల తయారుగావు?

ఉన్నట్టుండి ఒకనాడు జార్జి ఈస్టుమాన్ ఫ్యాక్టరీనుండి అదృశ్యుడయ్యెను. మఱియొక మాసము గతించువఱకు ఆతడు ఫ్యాక్టరీలో పొడగానరాలేదు. ఆమాసము దినములలో నాతడు అట్లాంటిక్ మహాసముద్రమును అతిక్రమించి ఆంగ్లదేశమునకు బోయి అచ్చట ఫొటో ప్లేటులను తయారుచేయు ఘరములలో సుప్రసిద్ధ వహించిన ఘరము వారినుండి వారు ప్లేటులు తయారుచేయు ఫార్ములా నొకదానిని కొని తిరిగివచ్చెను. తాను ఫ్యాక్టరీకి చేరిన మఱునాటినుండియు ఫ్యాక్టరీ తిరిగి సాధారణముగ పనిచేయుకాలమును గూడ అతిక్రమించి పనిచేయ నారంభించెను. ప్లేట్లవర్తకము తిరిగి యథాప్రకారము సాగ మొదలిడెను. ఈస్టుమాన్ రక్షితుడయ్యెను. ఆదినములలో ఆతడు పొందిన ఆవేదనను నిరూపించి చెప్పుటకు వాఙ్మయమునకు శక్తిచాలదు. అప్పటికి ఆతనికి ముప్పదియేండ్లయిన నిండలేదు. కాని ఫ్యాక్టరీని మూసియుండిన ఆ నాలుగువారములలో అతని నల్లనిశిరోజములు తెల్లబాఱి పోయినవి. ఈ సంగతి యొక్కటియు ఆత డాదినములలో పొందిన ఆ వేదనకు మానదండము కాగలదు.

తన ఫార్ములా ఎందుకు పనిచేయలేదో ఈస్టుమాన్‌కు తరువాత తెలియవచ్చెను. ఆకారణము ఈ ప్రకరణమునకంతకును రసవంతమైనది. అతడు మొదట ఉపయోగించిన గిలేటైన్ (ముద్దగావండిన జంతుపదార్థము) స్టాకు అయిపోయినది. తిరిగి గిలేటైన్ తెప్పించినాడు. ఈ గిలేటైన్ మొదటి గిలేటైన్‌వలె పనిచేయలేదు. దీర్ఘపరీక్షమీద మొదటకొనిన గిలేటైన్ నికార్సయినదికాదనియు, అందు ఏదియో ఒకపదార్థము కల్తీ చేయబడియుండినదనియు, ఆకల్తీ వలననే అది ప్లేట్లవిషయమున బాగుగా పనిచేసినదనియు తెలియవచ్చినది. క్రొత్తగాకొన్న గిలేటైన్ నికార్సు అయినది; కల్తీచేయబడనిది. ఎప్పటిరీతిన ప్లేట్లు తయారుచేసినను కల్తీపదార్థము లోపించుటచే అవి కడతేరలేదు. నేటికి గూడ ఏ గిలేటైన్‌గాని ఆ మొదటి గిలేటైన్ ఫలమును ఈయజాలకపోయెను. ఒక్కసారిమాత్రమే అతని కక్కఱ దీర్పగల గిలేటైన్ ఆతనికి దొరకెను. అందలి కలితీ

పదార్థమేమియో తెలియరాదు—అట్టిది మఱియొక సారి అతనికి దొరకలేదు. అదృష్టమెక్కడనున్నది అనగా మొదట ఆతడుకొనిన గిలేటైన్ డ్రాక్ ప్లేట్ల వర్తకమున ఆతడు పొడుకొనువఱకు సరిపోవుటలో.

ఆంగ్లదేశమున కొనుక్కొనివచ్చిన ఫార్ములా ధర్మమా అని అత డీకష్టమునుండి గట్టెక్కెను. ఛాయాగ్రహణవిధానమును సులభమొనర్చుటకు ఆత డిక మీదట పూనుకొనెను. గ్లాసు ప్లేటులకంటె తూక మున తేలికగనుండి ఈస్టుమాన్ ఎమల్షన్ సంపర్కము వలన ఛాయాగ్రహణగుణమునందిన పేపరు ఫిలుమును ఆతడు కనుగొనెను. అదియొక క్రొత్తఫిలుము. చుట్టగ చేయబడునది. చేతి కెమెరాలో అమర్చబడునది. ఇందు వలన ఛాయాగ్రహణకళయొక్క చరిత్రలో మొదటి సారి సాధారణులగు అభ్యాసకులకుకూడ అది అందు బాటులోనికివచ్చెను. తోడనే అది ప్రజామోదమును బడసెను. ఈక్రొత్త ఛాయాగ్రహణపు ఫిల్ములను విదే శములందుకూడ అమ్ముటకుగల అవకాశము నుపలక్షించి ఈస్టుమాన్ ప్రపంచమునందలి అన్ని భాషలలోను సుల భముగ ఉచ్చరింపబడగల ట్రేడుమార్కు కొఱకై అన్వేషింప నారంభించెను. ఆ అన్వేషణమునకు ప్రతి ఫలముగా ప్రపంచమునకు ఒక క్రొత్తపదము దొర కెను. అదియే కోడక్ అనునది. కోడక్ ఫిలుములు నేడు ప్రపంచప్రఖ్యాతి నందియున్నవి.

ఈస్టుమాన్ ఫిలుము క్రమముగా పరిశోధనాక్రమ మున సెల్యులాయిడ్ ఫిలుముగా పరిణతినొందు దినము లవి. సినీమాలజనకుడగు థామస్ ఆల్వా ఎడిసను ఆ దినములలో ఒకసారి ఈస్టుమాన్ కడకువచ్చి ఆతడు ట్రాన్సుపెరెంటు ఫిలుములను కనుగొన్నది నిజమేనా యని యడిగెను. నిజమే అని తెలిసికొనెను. తాను కైనిటొస్కోప్ అను ఒక మెషీను కనుగొనియున్నాడు. దానికి ట్రాన్సుపెరెంటు బొమ్మను అందించినచో కొంతదూరమునఉన్న తెరపై అది ఆ బొమ్మను పడు నట్లు చేయసమర్థమైనది. ఆ మెషీనులో ఉపయోగిం చుటకు ఈస్టుమాన్ యొక్క ట్రాన్సుపెరెంటు ఫిలుము లను కొన్నిటిని కొనెను. అయిదువత్సరములు ఎడిసను, ఈస్టుమాన్ సంప్రదించుకొనుచు అన్యోన్యాశ్రితములగు ఆ శాస్త్రసమస్యల విషయమై పరిశోధనలు సాగించు వారు ఆ కాలములో ఎడిసను మొట్టమొదటి ఫిలుము ప్రొజెక్టరును కనుగొనెను. ఈస్టుమాన్ సెల్యులాయిడ్ ఫిలుము తయారుచేసెను. అందులో ఫొటోగ్రఫీని సులభ మొనర్పవలయునను ఆతనికాంక్షయు, మూవింగు పిక్చరు (చలనచిత్రములను)ను తయారుచేయవలయు నను ఎడిసన్ కాంక్షయు నెఱవేరెను. ఎడిసను తన కినోటొస్కోప్ తోడను, ఈస్టుమాన్ తన ట్రాన్సుపె రెంటు ఫిలుముతోడను నేటి చలనచిత్ర (మూవింగు పిక్చర్) పరిశ్రమను సంస్థాపించినవారైరి.

ట్రాన్సుపెరెంటు ఫిలుమును కనుగొనుటతో ఈస్టు మాన్ విశ్రాంతిగొనలేదు. తన వ్యాపారము దినముల వెంట విశ్వవ్యాప్తినొందుచుండగా ఆతడు ఇతరవిధము లైన మెఱుగులు కనుగొనుటలో పర్యాప్తుడై యుండు వాడు. మడతకెమెరాను ప్రసాదించినాడు. క్రొత్త పద్ధతి డెవలపింగు టాంకులను కనుగొనినాడు. లెన్సు లను (అద్దపు బిళ్ళలను) మెఱుగొనర్చినాడు. క్రమ ముగా నేడు ఎల్లరకు బాగుగా పరిచయమైయున్న జేబునందిముడ్చు కెమెరా వెలువడినది.

ధనము ఆర్జించవలయునను తీవ్రమును, ప్రధాన మును అయిన కాంక్షతో ఆతడు వ్యాపారమునకు గడం గినాడు. ధనమును ఆతడు అత్యధికముగ ఆర్జించినాడు. అత్యధికముగ ఆర్జించినాడు కావున పెక్కు వత్సరములకు పూర్వమే ఆతడు ధనమునుగూర్చి చింతించుట మాని నాడు. అయితే ఆతడు వ్యాపారము నింకను సాగింపనే ల? తాను పిల్లవాడుగానుండి వెస్టు ఇండీసు దీవులకు విలా సయాత్ర సాగించు సందర్భమున ఫొటోలుతీయుటకు గాను తాను వీపుమీద వైచుకొని మోసుకొని పోయిన విశేషభారముగల సామగ్రిని నైకొనకయే ప్రజలు సులభ ముగ ఛాయాచిత్రములు తీయుచు ఆనందించుచుండుట చూచుటకే ఆతడు హృదయము తనియ ధనమార్జించియు వర్తకమును సాగించుచున్నాడని చెప్పవచ్చును.

కెమెరాను సర్వజనసామాన్య మొనర్చుటతో ఆ తని వ్యాపారము నేడు ప్రపంచమునంతను చుట్టుముట్టి

యున్నది. యునైటెడ్డుస్టేట్సునందుగల కోడక్ ఫ్యాక్టరీలలో మిక్కిలి పెద్దదాని ఆవరణ ఒక చతురము మైలు వైశాల్యముగలది. ఏడుమొదలు పదునాలుగు అంతస్థులవఱకుగల నూట ఇరువది బ్రహ్మాండభవనములు ఆస్థలమున విరాజమానములగుచున్నవి. బ్రహ్మాండమంతటి ఆఫ్యాక్టరీయందు రెండువందలఏబది వివిధములైన పనులచేయుచు ఇరువదివేలమంది ఉద్యోగులుఉన్నారు. ఒక మందిరమున చింకిపాతలనుండి ఫొటోగ్రాఫిక్ పేపరుచేయబడును. మఱియొక మందిరమున కోడక్కు కెమేరాలు, ఫిలుములు ప్యాక్ చేయబడు పెట్టెలుచేయబడును. ఛాయను గ్రహించుగుణము ఫిలుములకు కలుగుటకై సిల్వర్ బ్రొమైడ్ లేక సిల్వర్ క్లోరైడ్ వాడబడును. ఒక్కొక్క సంవత్సరమునకు ప్రభుత్వమువారి టంకసాలను మినహాయించి మఱియేసంస్థకంటెను ఈ కోడక్ ఫ్యాక్టరియే ఎక్కువ వెండిలోహమును ఉపయోగించును.

ఏటేట కోడక్ కంపెనీ రెండులక్షలమైళ్ళకు తక్కువగాని సినీమాఫిలుములను తయారుచేయును. 1928 వేసవిలో జార్జి ఈస్టుమాన్ తాను మఱియొక క్రొత్తవిషయమును రంగులలోకూడ చలనచిత్రములను తయారుచేయు ఫిలుములను కనుగొనుటనుగూర్చి ప్రకటించెను. ఈస్టుమాన్ జన్మదేశమగు అమెరికాలో ఈ పరిశ్రమ ఎంతవిస్తరించియున్నదో ఆంగ్లదేశమున కూడ అంత విస్తరించియే యున్నది. ఇది అంతయు యువకుడగు ఒక బ్యాంకుక్లార్కు ఒక చిన్నగది స్థలముమాత్రముగల ఫ్యాక్టరీలో ఒకడే అసిస్టెంటుతో ప్రారంభించిన వ్యాపారమునకు ఫలమే. సరియైన ఒక చక్కని ఉద్దేశమునందుకొని ఉత్సాహముతో, దీక్షతో పనిచేయుచో కలుగగల జయమునకు అవధి లేదని జార్జి ఈస్టుమాన్ నిరూపించెను.

అమెరికాదేశమున స్థిరపడిపోయిన ఒక ఆంగ్లకుటుంబమున 1854-వ సంవత్సరమున ఈస్టుమాన్ పుట్టువునొందెను. 1932-వ సంవత్సరము మార్చి 14-వ తేదీని అతడు మృతినొందెను. డెబ్బదిఏడు సంవత్సరములు. అతడు వివాహము చేసికొనలేదు. అతనిచరిత్ర ఎంత విచిత్రమైనదో అతని మరణమంతటి విషాదకరమైనది. కొద్ది వత్సరములుగ ఈస్టుమాన్ రోగగ్రస్థుడై యుండెను. ఒకనాడు తాను రహస్యముగ ఏదియో వ్రాసికొనవలయునని వైద్యుని, సేవకులను గదినుండి బయటకు పంపివేసెను. కొద్ది నిముసముల యనంతరము రివాల్వరుప్రేలినచప్పుడు వినిపించెను. వైద్యుడును, సేవకులును తొందరగ గదిలో ప్రవేశించిరి. ఈస్టుమాన్ చచ్చిపడియుండెను. ప్రక్కను పడియుండి రివాల్వరు తానొనర్చిన దారుణకృత్యమును ప్రకటించుచుండెను. ఆకోటీశ్వరుని ప్రక్కమీద "నాస్నేహితులకు: నేను ప్రపంచమున చేయవలసిన పని ముగిసినది. కావున ఇంకను జీవించియుండనేల?" అని అతని చేతివ్రాతగల కాగితము అచటి వైద్యుడు మొదలగు వారికి దొరికెను.

పదునాలుగవ ఏటనే పాఠశాలకు స్వస్తిచెప్పిన బాలుడు—పొట్టకొఱకు వారమునకు తొమ్మిదిరూపాయిల జీతముమీద ఒక ఆఫీసులో గుమాస్తాగా పని చేసిన యువకుడు—తాను అనారోగ్యవతియైయుండియు కుటుంబపుఖర్చుల నిమిత్తము ఒకబోర్డింగుహౌసును నడుపుచుండిన తనతల్లి శ్రమను తప్పించుటకుగాను తనసంపాదన పెంపొందించుటకై తనకొలది రాబడిలోనే పదునైదురూపాయిలిచ్చి ఛాయాగ్రహణ విద్యను నేర్చుకొనిన మాతృభక్తుడు జార్జి ఈస్టుమాన్ స్థాపించిన కోడక్ కంపెనీవారి నేటి ఆస్తుల విలువ 375,000,000 రూపాయిలు. అతడు దానరూపముగ వెచ్చించిన ధనము 150,000,00 పౌనులు. తాను చిన్నతనమున విశేషవిద్యాసౌకర్యములకు నోచిపుట్టలేదు. కోటీశ్వరుడైనపిమ్మట అతడు ప్రాథమికవిద్యావ్యాప్తికి విశేషధనమును విరాళమొసంగెను. అప్సఫర్డు విశ్వవిద్యాలయమున అతడొక ప్రొఫెసర్ షిప్పును విశేషధనవ్యయముతో ఏర్పఱచెను.

తన జీవితారంభమున వంటయింట ఫొటోగ్రాఫిక్ పరిశోధనలు గావించిన ఈ సామాన్యుడు తనప్రాయపు ప్రొద్దు వాటారకపూర్వమే ప్రపంచమునందలి ఫొటోగ్రాఫిక్ వర్తకులలో అగ్రేసరుడై అలరినాడు.

# మణిమాల

## తియ్యని నిమ్మపళ్లు.

ఫ్లోరిడాలో తియ్యని నిమ్మపండ్లు పండింపబడు చున్నవని అమెరికాదేశపు సుప్రసిద్ధ మాసపత్రికలలో నొకటియగు పాప్యులర్ సైన్సుమంత్లీ అనుపత్రిక తెలుపుచున్నది. నారింజపండ్లవలెనే ఈ తియ్యని నిమ్మపండ్లును తినదగియున్నవి. నిమ్మజాతిలో ఇదియొక క్రొత్తజాతి. ఇవి ద్రాక్షపళ్ళయంత పెద్దవిగామాత్ర ముండును. పంచదార అద్దుకొనకతినినను ఇవి నోటికి అతిమధురముగా నుండును. ఈ క్రొత్త ఫలములందుగల మఱియొక విశేషగుణము ఏమనగా శీఘ్రముగ నలుమూలలు వ్యాపించు హృదయాహ్లాదకరమగు సువాసన. బట్టలను నిలువయుంచు గదులయందు ఈక్రొత్త నిమ్మపళ్ళవాసన కలిగించుటవలన ఆ వాసన రెండుమాసములవఱకు తగ్గిపోకుండ ఉంటున్నదని ఆ ఫ్లోరిడాలోని వ్యవసాయదారులు తెలుపుచున్నారు. ఫ్లోరిడాయొక్క శీతోష్ణస్థితియు హిందూదేశపు శీతోష్ణస్థితియు ఒక్కటియేగాన మధురఫలములనుకాయు ఈ జాతి నిమ్మచెట్లను మన హిందూదేశమున విశేషమైన శ్రమలేకయే పెంచి లాభమును బడయవచ్చును.

—ఇండస్ట్రీ.

* * * *

## ప్రజలు వారిధనమును ఎట్లు వ్యయముచేయుచున్నారు ?

ప్రజలు వారివారి ధనమును ఎట్లు వ్యయముచేయుచున్నారో లెక్కలు తయారుచేయుటకు అమెరికన్ ప్రభుత్వము పూనుకొన్నది. చికాగో పట్టణమునకు చెందిన అట్టి వ్యయములయొక్క లెక్కలు ఇపుడు ప్రచురితములైనవి. ఒకానొక పెద్దపట్టణమునందలి ప్రజలు వారివారి ధనమును ఎట్లు వ్యయముచేయుచున్నారో ఇదివఱకు ఎన్నడును లెక్కలువేసి కనుగొనబడి యుండలేదు. కావున ఇపుడీవిషయము తెలిసికొనుటకు చమత్కారముగ నుండును. చికాగోలో అమాముబాపతు 3 375.285 మంది జనులు నివశించుచున్నారు. ఆ పట్టణమున 43625 స్టోరులు గలవు. 1929-వ సంవత్సరమున వాని యన్నిటియందును కలసి 430,700,000 పౌనులు విలువగల వస్తువుల అమ్మకము సాగెను. వానియందు 171,749 మంది పనివాండ్రు గలరు. చికాగోపట్టణమున పండ్రెండు పెద్ద డిపార్టుమెంటు స్టోర్సు (అనగా బట్టలు మొదలగు సమస్త వస్తువులు అమ్మునవి) గలవు. ఆ పట్టణమున జరుగు వ్యాపారమంతటిలోను నూటికి 16 వంతులు ఈదుకాణములే సాగించును. శాఖాకార్యాలయములు నూటికి సగమువంతు వ్యాపారమును సాగించును. చికాగో పట్టణవాసులు తమతమ ఆహారమునకై నూటికి 20 వంతులును మోటారుకారు సామగ్రులకై నూటికి 12 వంతులును, సామాన్యవస్తువులకై నూటికి ఇరువదిమూడున్నర వంతులును వ్యయము చేయుచున్నారు. అచటి ప్రజలు వారి రాబడిలో నూటికి ఆరువంతులు కాఫీహోటళ్ళకును, నూటికి నాలుగువంతులు మందుల దుకాణములకును, నూటికి నాలుగువంతులు కర్ర సామగ్రి కొఱకును వెచ్చించుచున్నారు. ఒక్క సంవత్సరములో వారు పూవులకై 2,160,000 పౌనులును—నగలకై 4 524,000 పౌనులును వ్యయము చేయుదురు. ఏడాదికి మనిషి ఒక్కంటికి ఈ కొనుగోలు సగము 127 పౌనుల 12 షిల్లింగులకు మించియుండును.

—బిజినెస్ బిల్డర్

* * * *

## వ్యాపారప్రకటనకు మాసపత్రికలు హెచ్చుగ అభిమానింపబడుచున్నవి.

వ్యాపారశిఖరమునంటిన అమెరికాదేశమున విశేషముగ వ్యాపారప్రకటనములను గావించు ఫరములలో మందుల దుకాణములును, సబ్బులు మొదలగు సుభ

గంకరణవస్తువులను తయారుచేయు అంగళ్ళును అయి ఉన్నవి. ఆయాదుకాణముల యజమానులు తమతమ సరుకుల అమ్మకమువలన తాము ఆర్జించు ధనములో నూటికి ఇరువదియైదవంతు వ్యాపారప్రకటనలకు వెచ్చింతురు. ఇట్లు వెచ్చించుదానిలో నూటికి నలుబదివంతులు మాసపత్రికలలో ప్రకటించుటయందును, నూటికి ఇరువదివంతుమాత్రమే దినపత్రికలలో ప్రకటించుటయందును వ్యయముచేయుదురు. ఆహారపదార్థముల వర్తకము సాగించు అమెరికను ఫరములు నూటికి ముప్పదియేడు వంతులు మాసపత్రికలలో ప్రకటించుటయందును, నూటికి ముప్పదియొక్కవంతులుమాత్రము వార్తాపత్రికలలో ప్రకటించుటయందును వెచ్చించును. ఎలక్ట్రిక్, వైర్లెస్సు ఫరములు నూటికి ముప్పదిమూడువంతులు మాసపత్రికలలో ప్రకటించుటకును, నూటికి ఇరువదివంతులు మాత్రమే వార్తాపత్రికలలో ప్రచురించుటకును వెచ్చించును. ఈ అంకెలను బట్టిచూచినచో వ్యాపారప్రకటనలకు మాసపత్రికలు హెచ్చుగ ప్రేమింపబడుచున్నవని తేటతెల్లమగును. దీనికి కారణముగలదు. ఆర్థిక మాంద్యము వ్యాపారస్థుల అందరికండ్లను విప్పినది. తక్కువవ్యయముతో విశేషప్రచారము జరుగు విధానముపై వారి మనములు లగ్నములైనవి. ఒకటి రెండు గంటలుచూచి త్రోసివేయబడునదికాదు మాసపత్రిక. అది పలువురచే చదువబడును. చదువరులు దానిని తొందరగ చదివి పారవేయరు. దినపత్రికలకంటెను, వారపత్రికలకంటెను దానిని నిదానముగను, విశ్రాంతితోడను చదువుదురు. అట్టి పత్రికలయందలి ప్రకటన వార్తాపత్రికయందలి ప్రకటనకంటె లాభదాయకమను నిజమును వర్తకు లందఱు ఆర్థికమాంద్యము ధర్మమా అని గ్రహించినారు.

—ఎడ్వర్టయిజ్మెంటు డిస్ప్లే.

* * * *

## చేపలకు ముసలితనము లేదు.

ఆధునికశాస్త్రమునకు అనేకవిషయములు తెలిసినవి. దానికి తెలియనివికూడ ఇంకను అనేకవిషయములు గలవు. ఉదాహరణముగ చేపలజీవితము నొక దానిని గైకొనవచ్చును. నేటివఱకు ఏశాస్త్రజ్ఞుడుగాని చేపలు ముసలితనమువలన చనిపోవుటను నిరూపించలేక పోవుచున్నాడు. బహుశః చేపలకు ముసలితన మనునది లేనేలేదేమోనని చెప్పవలసియున్నది. వార్ధక్యలక్షణములవలన బాధపడు చేపను ఒక్కదానినైన ప్రపంచమునందలి పెక్కుశాస్త్రజ్ఞులలో ఒక్కడుకూడ ఇంతవఱకు కనుగొనజాలకపోయినాడు. భూమిమీద నివసించెడు జంతువులన్నియు తమతమ పరిణతవయస్సున నరముల సడలుబాటు, కండరములు పుష్టిని గోలుపోవుట మొదలగు వార్ధక్యలక్షణములను చూపును. ఈ లక్షణములు జలచరములగు చేపలకుకూడ కలుగుచో అవి ఇంతవఱకు పరిశోధింపబడనేలేదని చెప్పవలసియున్నది. చేపల బట్టువారి గాలముల బారి పడకుండుపాటియు, పల్లెవాండ్ర వలలను తప్పించుకొను పాటియు, యుద్ధములందు మరణించకుండుపాటియు, పెద్దచేపలచే మ్రింగబడకుండుపాటియు అదృష్టమునకు అవి నోచిపుట్టుచో బహుశః అవి జరయు, మృతియు నెఱుంగక జీవించియే యుండుననుకొనవలసియున్నది. పట్టి పెంచబడిన చేపలలో ముఖ్యముగ కార్పుజాతికి చెందినవి నూరేండ్లు గడచిననుకూడ ఎట్టి వార్ధక్యచిహ్నములను లేకుండుట జంతుప్రదర్శనశాలల అధికారులకు అనుభవపునరుక్తవిషయము.

—నాచురల్ హిస్టరీ.

* * * *

## కొబ్బరిధర తగ్గుటకు కారణము.

మన దేశములో గత అయిదు సంవత్సరములనుండి క్రమక్రమముగా కొబ్బరిధర క్షీణించుచున్నది. కొబ్బరితోటల యజమానులకు, రైతులకు ఇది యెంతయు చింతాకరము. తూర్పు కోస్తాయందును, పడమటికోస్తాయందును, తిరువాన్కూరు, కొచ్చిను సంస్థానములందును, కొబ్బరితోటలు వేలకొలది యకరముల నావరించియున్నవి. పది పన్నెండేండ్ల క్రితము కొబ్బరిధర మిక్కిలి గిరాకిగా ఉన్నసమయమున ప్రజలకు కొబ్బరియందు మోజుకలిగి నూర్లకొలది యెకరముల భూమిని కొబ్బరి సాగులోనికి తీసికొనివచ్చిరి. కొబ్బరి సాగువలన

చాలామంది ప్రజలు చాపలు నేసుకొనియు, బట్టలల్లుకొనియు, నూనె తీసికొనియు, త్రాళ్ళను నేసియు జీవించుచున్నారు. కొబ్బరివలన కలుగు ఉపయోగము లెన్నియేని గలవు. కాని దొరతనమువారు యీ విషయమై అణుమాత్రమును ప్రజలను ప్రోత్సహించుటలో తగినంత శ్రద్ధ బూనక తటస్థులై యుండుట శోచనీయము. ఈ కొబ్బరి పరిశ్రమలు నేటివరకును ఆ నికపద్ధతిని వృద్ధిపొందక ప్రాచీనపద్ధతులమీదనే నడచుచున్నవి. ధరలు తగ్గుటవలన కొబ్బరిరైతులు పలుకష్టములకు పాలగుచు తమకున్న పరపతినిసహితము కోలుపోవుచున్నారు. కొబ్బరి ధర మాంద్యమునకు కారణము ముఖ్యముగ సింహళద్వీపపు కొబ్బరివర్తకపు పోటీయే అని చెప్పనగును. చాలకాలమునుండియు సింహళము మనదేశములోని కొబ్బరి వర్తకమును తన యధీనమందుంచుకొనుటకు ప్రయత్నము చేయుచున్నది. మీదు మిక్కిలి అయిదారు వత్సరములనుండియు హిందూదేశపు కొబ్బరి బజార్లపై ఎక్కువగా దృష్టుంచి నిలుపచొచ్చెను. 1929-వ సంవత్సరమునకు పూర్వము యూరపుఖండమునకు కొబ్బరిని, కొబ్బరినూనెను సింహళము విస్తారముగా ఎగుమతిచేయుచుండెను. కాని యూరపుదేశములు సింహళపు కొబ్బరిని కొనుట మానివేసినవి. ఆయా దేశములకు యెగుమతి క్రమముగ క్షీణింపసాగెను. ఇయ్యది సింహళపు వర్తకుల కాందోళన కలిగించెను. ఆద్వీపమున కొబ్బరితోటలు విస్తారముగ కలవు. ఆ రైతులకు కొబ్బరిని సాగుచేయుటకు ఖర్చు తక్కువ. భూమిధరకూడ తక్కువట. వారు వేలకువేలు కొబ్బరి చెట్లను పెంచియుంచుటచే ఆద్వీపములో కొబ్బరి కాయలు మిక్కుటముగ ఉత్పత్తి కానారంభించెను. యూరపుదేశములకు యెగుమతి తగ్గిపోవుచున్నదని తోచినతోడనే ప్రక్కనేయున్న హిందూదేశముపై సింహళద్వీపపు వర్తకులు కొబ్బరిదాడి వెడలిరి. దీనికి సాయము హిందూదేశపు దొరతనమువారు సుంకముల విలువను 1929-వ సంవత్సరము మొదలు నేటివరకును సింహళమువారికి అనుకూలముగ నుండునట్లు విధించుచువచ్చుచున్నారు. సాధారణముగ దిగుమతి సుంకములు విలువమీద గాని, సంఖ్యనిక్క మీదగాని వసూలుచేయబడును. విలువ బజారువిలువగా ఎంచబడును. కాని కొబ్బరివిషయమై దొరతనమువారు తమకు న్యాయమని తోచిన విలువను గణించి సదరు విలువపై సుంకములు వసూలుచేయుచున్నారు. అట్టి విలువకు ఆంగ్లేయమున టారిఫ్‌వాల్యూ అనెదరు. సదరు సుంకముల విలువ క్రమముగ తగ్గించుటచే సింహళద్వీపవర్తకులకు లెక్కలేని కొబ్బరిని మనదేశమునకు దిగుమతిచేయుటకు అవకాశము కలిగెను. సుంకముల విలువకు ఒక ఉదాహరణ చెప్పెదను 1932-వ సంవత్సరమున కొబ్బరినూనె టన్ను 1-కి బజారుధర 410 రూపాయిలు ఉండగా దొరతనమువారు దిగుమతిసుంకముల వసూలు చేయుటకు టన్ను కొబ్బరినూనె విలువను 310 రూపాయిలుగ నిర్ణయించిరి. సదరు మొత్తముపైన నూటికి 20 రూపాయిల పన్ను వసూలుచేయుచున్నారు. ఇది సింహళపు వర్తకులకు లాభముకాదా? సుంకముల విలువను తగ్గించుటకు తోడు ఒట్టావా ఒడంబడికలు. ఈ ఒడంబడికల ముఖ్యోద్దేశమేమనగా బ్రిటిషు సామ్రాజ్యపు దేశములకు అన్యోన్యస్నేహముచేత వర్తకము అభివృద్ధిపరచుట. ఇది యెట్లనగా ఒండొరులు విధించుచున్న దిగుమతి సుంకములను ఒండొరులకు తగ్గించుట. అనగా బ్రిటిషుసామ్రాజ్యములో లేని ఇతరదేశములకు ఇదివరలో విధించుచున్న సుంకములను అటులనేయుంచి, బ్రిటిషుసామ్రాజ్యములోని దేశములకుమాత్రము సుంకములను తగ్గించి సామ్రాజ్యమునందలి దేశముల వర్తకమును చురుకు చేయుటకు పుట్టిన వీ ఒడంబడికలు. కొబ్బరివిషయములో దిగుమతి సుంకము 100-కి 25 రూపాయిలచొప్పున మన దొరతనము ఇదివరలో విధించుచున్నారు. ఈ ఒడంబడిక ప్రకారము సామ్రాజ్యములోని సింహళమునకు 100-కి 5 రూపాయిల చొప్పున కొబ్బరి సుంకము తగ్గింపబడెను. అనగా సింహళమునకు 100-కి 20 రూపాయిల చొప్పునను ఇతరదేశములకు 100-కి 25 రూపాయిల చొప్పునను కొబ్బరిసుంకము వసూలుచేయబడును. ఇట్లే సింహళము మనదేశమునకు నూటికి 10 రూపాయిల

చౌకైన ప్రత్తి పరిశ్రమల (దూదివస్తువుల) దిగుమతులకు సుంకము తగ్గించెను. అనగా మనదేశమునుండి పోవు ప్రత్తితో తయారుకాబడిన సరుకులకు సింహళమునందు అనుకూలము కలిగినది. అటులనే సింహళమునుండి మన దేశమునకు కొబ్బరి విస్తారముగ వచ్చుటకు మార్గమేర్పడినది. ఇన్నికారణములవలన కొబ్బరిధర క్షీణించినది. కొబ్బరిధర హెచ్చుచేయుటకు మార్గములు:

(1) సుంకములు విధించు విలువను (టారిఫ్ వాల్యూ) హెచ్చుచేయుట.

(2) సుంకమును హెచ్చుచేయుట.

(3) సింహళమునకు అనుకూల సుంకమును (ప్రిఫరెన్సు) రద్దుచేయుట.

కొబ్బరితోటల యజమానులు, రైతులు ఈ విషయమై శ్రద్ధతీసికొనెదరని నమ్ముచున్నాను.

--న్యాపతి కృష్ణారావుపంతులు, బి.ఏ.బి.ఎల్.

* * * *

## ఇంతకుపూర్వపు ఆర్థికమాంద్యములు

నేడు ప్రపంచము ఆర్థికమాంద్యముతో తలక్రిందులగుచున్నది ఈ స్థితిలో లోగడసంభవించిన ఆర్థికమాంద్యములను గూర్చిన క్రిందిసంగతులు గమనార్హములు.

| ఆర్థికమాంద్యప్రారంభము. | | ఉన్నకాలము. | |
|---|---|---|---|
| 1857 | ... | 12 | మాసములు. |
| 1869 | ... | 8 | ,, |
| 1878 | ... | 36 | ,, |
| 1884 | ... | 22 | ,, |
| 1887 | ... | 19 | ,, |
| 1893 | ... | 25 | ,, |
| 1907 | ... | 12 | ,, |
| 1914 | ... | 8 | ,, |
| 1921 | ... | 14 | ,, |

ఆయాకాలములందలి ఆర్థికమాంద్యమును తట్టుకొని సాహసముతో నిలిచినవారే నేడు గొప్పవర్తకులై వర్ధిల్లుచున్నారు. ఆర్థికమాంద్యమువలన చిత్తస్వాస్థ్యము చెడుచుకొని ఆత్మవిశ్వాసము గోలుపోయిన వారిసంఘమున జేరక మంచిరోజులకు స్వాగతోపచారములు సల్పినవారే గొప్ప వణిక్ప్రుంగవులైయున్నారు.

——డెయిలీ ఎక్స్‌ప్రెస్ (లండన్).

రావుసాహెబు, డాక్టరు, గారపాటి

# ఆంజనేయచౌదరిగారు

రావుసాహేబు బిరుదాంచితులును, పశ్చిమగోదావరి మండలమునందలి ప్రజాహిత నాయకులలో నొకరును అగు శ్రీ గారపాటి ఆంజనేయ చౌదరిగారి నామము ఆంధ్రులకు సుపరిచయమైనదే. శ్రీ చౌదరిగారికి ఆంధ్రమునందును, హిందీయందును, వంగభాషయందును మంచి ప్రవేశము గలదు. వీరు కొంతకాలమునకు పూర్వము 'చౌదరి' యను పేరుతో మాసపత్రిక నొకదానిని ప్రకటించిరి. 'ఘటనాచక్రము' మొదలగు నవలలను రచియించియు, 'ప్రబుద్ధాంధ్ర', 'తెలగ', 'దేవదత్తము' మున్నగు పత్రికలకు వ్యాసములు వ్రాసియు శ్రీ వారు తమ విజ్ఞానధనమును ఆంధ్రలోకమునకు పంచియిచ్చిరి.

ఇక వారి ప్రజాహిత జీవితమును గూర్చి కొంత చెప్పవలసియున్నది. పది పదునైదు వత్సరములుగ శ్రీ చౌదరిగారు తమ జన్మమండలమగు పశ్చిమగోదావరి జిల్లాయందలి సహకారోద్యమముతో (కోఆపరేటివ్ మూవుమెంటుతో) సన్నిహితమైన సంబంధము కలిగియున్నారు. ఆయుద్యమమునకు సంబంధించిన అన్ని సంస్థలలోను పెద్దపెద్ద పదవులకు ప్రజాలోకముచే నెన్నుకొనబడిరి. పశ్చిమగోదావరిమండలపు తిలక నగరమగు ఏలూరు మహాపట్టణమునకు ఆరేండ్లపాటు వారు గౌరవన్యాయాధికారులుగ (ఆనరరీ మేజిస్ట్రేటుగ) ప్రభుత్వము వారిచే నియమింపబడిరి. పశ్చిమగోదావరి జిల్లాకు ఆనరరీఅసిస్టెంటురిజిస్ట్రారుగ దొరతనమువారిచే నియమింపబడి పనిచేసిరి.

శ్రీ చౌదరిగారు ప్రస్తుతము ఆర్థికమాంద్యముచే పీడింపబడుచున్న రైతులోకమునకు వ్యవసాయమునందు నూతనమార్గములను చూపి అనుసరింపజేయుటకుగాను 'బ్రతుకుతెరవులు' అను గ్రంథము నొకదానిని వ్రాయుచున్నారు. దేశీయములైనవి, విదేశీయములైనవి కూరగాయలను పండించు విధమును—వానిని సేద్యముచేయుటకు పనికివచ్చు నేలలు—ఏయేకాలములందు ఏయే విత్తనములు పెట్టవలసినది—వాని ఆయవ్యయములు—తోటపైరులు—ఫలవృక్షముల సాగు—ఔషధసంబంధమైన మూలికలను పెంచుట—విలువగల పట్టు, నార మొదలగు వానిని తీయుటకు ఉపయోగపడు మొక్కల ప్రవర్ధనము—పట్టు పరిశ్రమ—తేనెటీగల పరిశ్రమ—చేపల పరిశ్రమ—కోళ్ళు, బాతులు మొదలగు గృహపాలిత పక్షివర్గములను బెంచు విధానములు—లక్కను ఉత్పత్తిచేయు పరిశ్రమ మొదలగు విషయములతో ఈ గ్రంథము నిండారియున్నది.

చౌదరిగారి జీవితమునకు వైశిష్ట్యమును గూర్చినది వారి పరిశోధనాప్రియత్వ మన వచ్చును. మొట్టమొదట వారు వ్యవసాయ సంబంధములైన పరిశోధనల నారంభించిరి. తత్ఫలితముగ వారు ఏనేలయందైనను తియ్యని నారింజపండ్లను పండించు మార్గమును గనుగొని వెల్లడించగలిగిరి. తరువాత పొగాకు ఉత్పత్తినిగూర్చి పరిశోధించి వానికి గల ప్రధానమైన ఆటంకములు మూడిటికి యొకేవిధానమున ప్రతీకారమును గనుగొనిరి. దానిని దొరతనమువారి ద్వారా రైతులలో వ్యాప్తి పొందించుటకు ప్రయత్నించిరి.

అనంతరము శ్రీ చౌదరిగారు రోగములలోకెల్ల భయంకరమైనదని తలంపబడు క్షయవ్యాధికి ప్రస్తుతము వ్యాప్తియందున్న ఏవైద్యసాంప్రదాయమునకును విరోధము కాని యొకనూతనచికిత్సావిధానమును కనుగొనిరి. వీరివిధానమును మనదేశమందలి సుప్రసిద్ధ వైద్యశాస్త్ర పారంగతులగు డాక్టరు ముత్తు, (తాంబరం శానిటోరియం) మేజరు నాయుడు, (హైదరాబాదు) డాక్టరు. బి. సి రాయ్, (కలకత్తా) యస్. వి. దేవధర్, (పూనా) కె. సి. ఘూర్‌పూరే, (పూనా) కెప్టెన్ శ్రీనివాసమూర్తి, (ప్రిన్సిపల్ ఆఫ్ ది స్కూల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్), రావుబహదూర్ యం. కేశవపాయి (మదరాసు) మున్నగువారనేకులు ఆమోదించుచు అభినందనములను, ఆశీర్వాదములను ఒసగిరి. కుష్ఠురోగవిషయమున గూడ వీరు పరిశోధించి యొకనూతన చికిత్సావిధానమును కనుగొని దానికిగూడ గొప్ప వైద్యశాస్త్రవేత్తల ఆమోదమును బడసియున్నారు. మశూచికవ్యాధినిగూర్చి కూడ వీరు పరిశోధనలు సల్పి వ్యాధియొక్క ఉత్పత్తి, స్వరూపస్వభావములను గురించి ఇదివఱకు ప్రజలు పడుచున్న యభిప్రాయములను ఖండించుచు, ఆవ్యాధిని నిరోధించుటకును, నివారించుటకును చికిత్సలను సూచించుచు మదరాసునందు మార్చినెలలో నొక యుపన్యాసము నొసగి పలువురచే మెప్పొంది యున్నారు. వీరు తమ పరిశోధనలనుగూర్చి బొంబాయి, పూనా, మదరాసు మొదలగు ప్రసిద్ధపట్టణములలో నుపన్యాసము లిచ్చుటయేగాక ఆయాప్రాంతముల నింక ననేకమంది ప్రసిద్ధవైద్యులతో తమ నూతన విధానములను గూర్చి చర్చించి వారలను సంతృప్తి పరచి యున్నారు.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౮౩ ప్రేమ.

'నవయువక హృదయహారము' అను గ్రంథమాలలో ఇది ప్రథమకుసుమము. ప్రేమనుగూర్చి వంగభాషయందు అశ్వినీకుమారదత్తుగారు రచియించిన గ్రంథమునకు శ్రీరామవృక్షశర్మగారు హిందీ అనువాదమును చేసిరి. ఆ హిందీ గ్రంథమునకు శ్రీ వెలువోలు సీతారామయ్య చౌదరిగారు తెనుగుగావించి ఆంధ్రులకర్పించిరి. ఈ గ్రంథమునకు పీఠిక వ్రాయుచు కవిరాజ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు 'ఇట్టి సర్వజనోపాస్యమగు ప్రేమయొక్క తత్త్వము ప్రాకృతజనంబులను సైతము బోధపడునటులు తేటతెనుంగున నాంధ్రలోకంబునకు సమర్పించిన కవి చిరస్మరణీయుండు' అని సముచితముగ నుడివియున్నారు. యథార్థప్రేమకు సుందర దృష్టాంతమగు విదులోపాఖ్యానమును వివరించు పట్టున అనువాదకులశైలి అతిగంభీరమైయున్నది. భావములకు ఔన్నత్యమును కలిగించు ఈ గ్రంథము ఎల్లరచే పఠింపబడదగియున్నది. క్రౌను సైజున ౭౮ పుటలు. వెల ఆరణాలు. వలయువారు గ్రంథకర్తపేర గుంటూరుజిల్లా అమృతలూరు వ్రాయునది. గ్రంథము ఆంటిక్ టైపుతో ఆంటిక్ కాగితములపై ముద్రింపబడినది.

## ౮౪. కుప్పుసామి శతకము.

కృతికర్త: కవిరాజు. చిరునామా: సూతాశ్రమము, తెనాలి. 'కుప్పుసామి' అను మకుటముతో ఇందు లోకనీతులు తేట పదములతో చెప్పబడినవి. కవిరాజుగారి ధారాళమగు శైలినిగూర్చి ప్రత్యేకించి పేర్కొనవలసిన పనిలేదు. వారి భావములును క్రొంగ్రొత్తలు. చూడుడు:

"చదువులేనిజాయ సల్లాపములకన్నఁ
జదువుకొన్నజాయ చలము మేలు;
వీనువిందుగాఁగ వినవచ్చునొకమాట
నప్పుడప్పుడైనఁ గుప్పుసామి."

గ్రంథము చిన్నసైజున సుందరముగ ముద్రింపబడినది. వెల రెండు అణాలు.

## ౮౫. చిత్రప్రశంస.

స్నేహలతాకవితాసంఘప్రచురము ౨౬. గ్రంథకర్త కవిజనారాధ్య వాజపేయయాజుల రామసుబ్బారాయఁడు, బి. యే. శ్రీవారు అత్తకోడళ్ళగు లక్ష్మిసరస్వతుల స్వరూపములు ఒకే చిత్రపటమునందుండుటఁజూచి యాశ్చర్యమొంది ఆశువుగా రచించిన ముప్పదినాలుగు పద్యములకు ఇది గ్రంథరూపము. భార్య లక్ష్మిని, భర్త సరస్వతినిపొంది ఒకే గృహమున ఆ అత్తకోడళ్ళ నిలుపవచ్చుటను ఇందు చమత్కారముగ వర్ణింపబడినది చిరునామా: ప్రెసిడెంటు, స్నేహలతాకవితాసంఘము, కొల్లాపురము, మొరవకొండ పోస్టు, కర్నూలుజిల్లా.

## ౮౬. హరిజన శతకము.

హరిజనోద్ధరణమును ప్రబోధించుట కుద్దేశింపబడిన శతకము. వైద్యవిద్వాన్ కుసుమ ధర్మన్నకవి విరచితము. 'ఆలకింపుమయ్య హరిజనుండ!' అను మకుటము. వెల రెండుఅణాలు. వలయువారు గ్రంథకర్తపేర రాజమండ్రి వ్రాయునది.

## ౮౭. జ్యోతిర్మయి.

ఖండకావ్య సంపుటము గ్రంథకర్త శెట్టిపల్లి వేంకటరత్నం చౌదరి.

"భరతభూమికి సౌభాగ్యభాగ్య మమర
విరతంగొల్పు చారిణీ వేషమూని
పల్లె పదముల నెత్తి పాడుకొనుచు
నాంధ్రబాలిక! పల్లెల కరుగుచుమ్మ."

అనునది యీ గ్రింథమునకు మకుట మనవచ్చును. దుర్గాదాసు, పృథ్వీరాజు, జిజియాబాయి, ఛత్రిపతి శివాజి మున్నగు భారతవీరులకు తోడు కృష్ణదేవరాయలు, అప్పాజీ, ఖడ్గతిక్కన మున్నగు ఆంధ్రివీరులు కూడ కీర్తింపబడిరి. వెల రెండుఅణాలు. వలయువారు గ్రింథకర్తపేర ఏలూరుతాలూకా కొవ్వలి వ్రాయునది.

## ౮౮. శ్రీమహారాజానురంజనము.

శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవ ప్రభుమణికి వినతిపత్రము. తుర్లపాటి గోవర్ధనకవి విరచితము. ప్రతులకు బెజవాడ యందున్న కవిగారికి వ్రాయనగును.

## ౮౯. శ్రీ మోక్షమార్గదర్శిని.

అచ్యుతరాయగ్రంథనిలయమునందు చతుర్థ పుష్పము. ఎర్నగూడెము జమీందారులగు శ్రీరాజా చెలికాని చిన జగన్నాథరాయినిం బహద్దరువారు కూర్చినది. అనేక భక్తిరసగ్రంథముల నవలోడించి శ్రీ జమీందారువారు ఈ గ్రింథమును సంకలనమొనర్చిరి. ఇందలి పద్యరత్నములు నిత్యము పారాయణ చేయదగినవి. భక్తులకు పాయరానిది. మూల్యము పండ్రెండుఅణాలు. దొరుకుచోటు: శ్రీ అచ్యుతరాయగ్రింథనిలయము, చిత్రాడ, తూర్పు గోదావరిజిల్లా.

## ౯౦. ఆంధ్రనాటకములు: రంగస్థలములు.

నాటకలక్షణప్రతిపాదకమగు గొప్ప విమర్శక గ్రింథము. నాటకతత్త్వము, కథానిర్మాణము, పాత్రిగుణపోషణము, సుఖాంతనాటక దుఃఖాంతనాటక పరిశీలనము, ప్రదర్శనపక్కి ఇందు తెన్నుగ వివరింపబడినవి. ఆంగ్లసంస్కృతసారస్వతములతో సుపరిచయము గలవారును, ఆంగ్రిమున కొత్తరకపు విమర్శనలకు గడంగినవారును అగు శ్రీ శేషుమళ్ళ అచ్యుతరావుగారు ఈ గ్రింథమునకు రచయితలనుటచే విషయప్రాశస్త్య మును వివరింప నవసరముండదు. ఆంధ్రనాటకరంగము నీతిసంపత్తియందును, జ్ఞానవిజ్ఞానప్రబోధన మందును, నుత్తరోత్తర ప్రవృద్ధిగా వెలయుచు - నాటకశిఖామణులు ప్రజలచేతను ప్రభుత్వమువారిచేతను మన్నననొందుచు ఆంధ్రనాటకయోషితలలామయొక్క కులశీలముల నాచంద్రార్కముగా సంరక్షించుట కిట్టి విమర్శకగ్రంథముల పఠనము సాయపడును. వెల ఆరు అణాలు. పుస్తకములు వలయువారు రాజమండ్రిలోనున్న గ్రంథకర్తగారి పేర వ్రాసుకొనవలయును.

## ౯౧. నీతిమంజరి.

ఉభయభాషాప్రవీణ ఏటుకూరి వేంకటనరసయ్యగారిచే రచియింపబడిన నూటముప్పదియైదు కందపద్యములుగల చిన్నపుస్తకము. పద్యములన్నియు గ్రంథనామము సూచించునట్లు నీతిగర్భితములు. వేంకటనరసయ్యగారి శైలి విలక్షణమైనది. నుడికారముగల తెలుగు పలుకుబళ్ళతో మెండు కొనియుండును. పద్యముల తూర్పు జిగితనము కలిగియున్నది. 'పెనమున నెయివోసి పిడకఁ బేల్చుటగాదే' 'నాకునగంటానఁబడని యక్షరమగురా?' 'నీరము శంఖమునఁబోయఁదీర్థముగాదే', 'ఒంటికిఁ గొఱగాక చెడిన రేవనిగతియా' మొదలగు పలుకుబళ్ళు కవికిగల తెనుగుతనమును తెలుపుచున్నవి. శైలి కొక్కపద్యము:

క. ముంగిట గోధన మున్నను
బంగారము భార్యమెడను భాసిలుచున్నన్
జెంగటఁ గల్పక మేలని
పొంగఁడె యఱచేతలక్ష్మి పుట్టైనటంచున్.

వెల ప్రతియొక్కంటికి నాలుగుఅణాలు. గ్రింథకర్త పేర సత్తెనపల్లి తాలూకా పెదకూరపాడు వ్రాసిన పుస్తకములు బడయవచ్చును.

## ౯౨. అంతా అనుమానం

మాలియరు కథకు అనుకరణము. కథ చమత్కారముగ నున్నది. తుదకు అవాంతరములన్నియు అతిక్రిమించి శీల, లక్ష్మణరావులు ఒండొరులను పెండ్లియాడిరి. రెండుఅణాల బిళ్ళలు పంపినచో బుక్కుపోస్టుద్వారా పుస్తకమును బడయగలరు. చిరునామా: మంత్రిప్రగడ సూర్యనారాయణగారు, మ్యూనిసిపల్ హైస్కూలుదరి, విజయనగరము.

## ౯3· ఏం చేయమంటారు?

ఒక హరిజనుని హృదయావేదన. మాదిగ నరసడు తన గోడుచెప్పుచు నేడు హరిజనులను చుట్టుముట్టియున్న పెక్కు సమస్యలను ప్రదర్శించినాడు. హరిజనోద్యమ ప్రచారమున తగిలియున్న వారల్లరును

చదువతగ్గ గ్రంథము. వెన్నెలకంటి రాఘవయ్యగారు రచియించినది. వారిపేర నెల్లూరు వ్రాసిన పుస్తకము యొక్క ప్రతులు లభించును.

### ౨౮. కార్మికసంఘ ప్రచురణము. నెం. ౫.

కార్మికసంఘోద్ధరణము కొఱకు ఈ సంఘమువారు చేయుచున్న కృషి బహుధా ప్రశంసింప దగియున్నది. కరపత్రములు అచ్చువేయించి ఉచితముగా పంచిపెట్టుచున్నారు. ఇది యైదవకరపత్రము. లక్ష్మయ్య రైతుకడ పాలికాపులుగా చేరిన సోమును, సూరీడు అను సోదరుల కథ. ఉన్నస్థితికి దాసుడుగా ఉండిపోయి సోముడు తుదకు బండితోలువాడు అయినాడు. సూరీడు విదేశములకు పరారీఅయి చదువుకొని పత్రికాసంపాదకుడై 'సైపు' నామముతో కీర్తి విస్తారుడగును. వారి సమావేశము విచిత్రముగానుండును. కాపీలకు కార్మికసంఘం, అనంతవరం, తెనాలితాలూకా అని వ్రాయవలెను.

### ౨౯. శ్రీశంకర ప్రబోధము.

ఇది శ్రీ తత్వానందస్వామి ప్రణీతము. అస్పృశ్యతా నివారకమగు ఏకాంకనాటకము. హరిజనసమస్య నేడు తీవ్రతరమై దేశీయుల మనములను కలగుండు వెట్టుచున్నది. అట్టిచో హృదయశైల్యమును కలిగించు ఇట్టి గ్రంథముల ప్రచురణము వరణీయమైనది. శైలి సులభముగా నుండుటకుదోడు నడుమ నడుమ ప్రసక్తాను ప్రసక్తిగ జొనుపబడిన శ్లోకములకు గ్రంథాంతమున అనుబంధమున తాత్పర్యము వివరింపబడినది. వెల ప్రతి ఒక్కంటికి ఒకకానీ. నూరుప్రతులు రు 1-4-0. ప్రకాశకులు: కార్యదర్శి, గుంటూరుజిల్లా హరిజనసేవా సమితి, కావూరు, చెఱుకుమిల్లి పోష్టు, గుంటూరుజిల్లా.

## క్రొత్త పత్రికలు

### ౧౬. పాంచజన్యము.

సనాతన ధర్మప్రచారార్థము ప్రచురింపబడు తెలుగు వారపత్రిక. శ్రీయుత వేమూరి సుబ్రహ్మణ్యముగారీపత్రికకు సంపాదకులును, స్వామదారులును. మహాత్ముని హరిజనోద్యమప్రచారముతో సనాతనధర్మపరాయణులుగూడ మతప్రచారమునకు తీవ్రముగ పూనుకొనిరి. చర్చవలననే దేనినిర్ణయమైనను తేలును. కావున ఇట్టి పత్రికల ఆవశ్యకము ఎంతేనిగలదు. విమర్శనార్థము మా కార్యాలయమునకు పంపబడిన తొలిసంపుటపు పండ్రెండు, పదమూడు సంచికలయందు 'అస్పృశ్యత-హేతువాదము'; 'ధర్మనిర్ణయము—వాదములు'; 'అస్పృశ్యత - దేవాలయప్రవేశము'; 'ఆలయప్రవేశము లేనంతమాత్రమున అభ్యుదయమడ్డునా?' మొదలగు వ్యాసములు అనేకధర్మరహస్యములను వెల్లడిచేయుచున్నవి. పత్రిక చిరకాలము మని ధర్మరహస్యములను తెనుగువారికి చెప్పుచుండును గాక యని కోరెదము. కార్యస్థానము బెజవాడ. సంవత్సరపుచందా మూడురూపాయిలు.

### ౧౭. ఉషస్సు.

ఈ నూతన మాసపత్రికను మా మనఃపూర్వకముగు స్వాగతము. కుందుర్తిగారి 'విశ్వకళ' వలెను, శ్రీ పాదవారి 'ప్రబుద్ధాంధ్ర' వలెను ఈ ఉషస్సు రచయితలే సంపాదకులుగను, స్వామదారులుగను ఉండుటకు నోచిపుట్టినది. పెట్టుబడిదారులచేతిలోని పత్రికలయందుకంటె ఇట్టి పత్రికలయందు రుచి, శుచి విస్తరించియు విశేషించియు నుండుటకు అవకాశములు గలవు. ఈ పత్రిక సంపాదకులగు మాధవశర్మ - యజ్ఞన్న శాస్త్రిగార్ల రచనాసామర్థ్యమునకు, పరిశీలనాశక్తికిని మా కార్యాలయము నలంకరించిన ఉషస్సు రెండవ సంచిక నిదర్శనమైయున్నదని చెప్పగలము. శ్రీ విశ్వనాథ సత్యనారాయణకవిగారి రెండునక్షత్రాలు అను పద్యవ్యాసము పూజ్యస్థానమందినది. శ్రీమాధవశర్మగారి 'హిమా' వెదజల్లెడి సౌరభవముగల ఉన్నతభావములకు ఎల్లరును ముగ్ధులుగాకమానరు. క్రొత్త పాతల మేలుకలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా అభినవాంధ్రసారస్వతమును పిచ్చిలపెంనరచ్చు సదుద్దేశముతో ప్రారంభింపబడిన ఈ పత్రికాకిశోరమునకు పోషణ పోత్సాహము లొసంగుట ఆంధ్రసారస్వతాభిమానుల విధ్యుక్తకర్మము. ఈ పత్రిక సంవత్సరపు చందా రూపాయి పావలా. విడిసంచిక రెండుఅణాలు. చిరునామా: తెలప్రోలు, కృష్ణాజిల్లా.

# సంపాదకీయ సమాలోచన

## కీ. శే. కేతవరపు వేంకటశాస్త్రిగారు :—

విజ్ఞానచంద్రికామండలివారి బహుమానమునంది వీనుమిగిలిన నవలలో విమలాదేవి తరువాత రాయచూరుముట్టడియే పేర్కొనదగినది. అట్టి సుప్రసిద్ధమైన నవలకు కర్తలును, విశాఖపట్టణమునందలి ఎ. వి. యస్ కళాశాలాంధ్రపండితులును అగు శ్రీయుత కేతవరపు వేంకటశాస్త్రిగారు గతమాసము 4-వ తేదీని విశాఖపట్టణమునందలి తమ స్వగృహమున మరణించిరి. సాధారణముగ ఒకే వ్యక్తియందు పాండిత్యము, కల్పనాశక్తి ఉండుట అరుదు. ఆ అరుదైన విషయమును శ్రీశాస్త్రిగారియందు మనము కంటిమి. శ్రీనాథుని శృంగారనైషధమునకు వారు కావించిన వ్యాఖ్యానము వారి పాండిత్యమునకు ఒక ప్రబల నిదర్శనము పెక్కు నవలలకు - స్వతంత్రములైనవానికి - వారు కర్తలనుటచే వారికల్పనాశక్తిని పోల్చుకొనవచ్చును. నవలలో కూడ వారు ఒకే తెగ నవలలను రచియింపలేదు చారిత్రకములు, సాంసారికములు, సాంఘికములు అగు నవలలను రచియించి వారు తమకల్పనాశక్తికిగల వివిధత్వమును ప్రదర్శించిరి నవలాకారులుగ వారికి శాశ్వతప్రతిష్ఠ నార్జించిన 'రాయచూరుయుద్ధము' చారిత్రకనవల. ఆంధ్రునిచరిత్రయందు చారిత్రకముగ రాయచూరుయుద్ధమంత ప్రాముఖ్యము వహింపక పోయినను ఆంధ్రశౌర్యప్రదర్శనమున దాని కిసుమంతయు దీసిపోవని బొబ్బిలియుద్ధమును గూర్చియు శ్రీశాస్త్రిగారొక నవలను రచియించియుండిరి అగ్రహారము, లక్ష్మీప్రసాదము మొదలగు వారి సాంఘికసాంసారిక నవలలు ఆంధ్రుల విశేషమైన ఆమోదము నంది యున్నవి. చనిపోవుసరికి శ్రీశాస్త్రిగారి వయస్సు దాదాపు ఏబదిసంవత్సరములు. బుద్ధిబలము సడలకుండిన నడివయస్సునందే శాస్త్రిగారివంటి సారస్వతజీవి చనిపోవుట భాషకు నష్టమునక తీరదు వారి ఆత్మకు సర్వేశ్వరుడు శాంతిని ప్రసాదించునుగాక !

## ఆంధ్రుల హిందీభాషాభిమానము :—

మితిమీరుటి వెగటుపుట్టించు స్థితికి వచ్చినది. ఆంధ్రనాయకుడు నోరువిప్పితే హిందీని అభ్యసింపుడని ఉద్బోధ; ఆంధ్రవ్యాసకర్త కలముపట్టితే హిందీ రాష్ట్రభాషయని పేర్కొనుట హిందీభాషలో కాలములకొలది వ్యాసములు ప్రచురించుటకు కూడ కొన్ని తెనుగుపత్రికలు నేడు విశేషశ్రద్ధను చూపుచుండుట కేవలాంధ్రాభిమానులకు విచారమును కల్గింపక మానదు మదరాసునుండి ప్రచురింపబడు హిందీప్రచారక్ పత్రికకు ఆంధ్రదేశములో ఉన్నంతమంది చందాదారులైనను యేఒక్క ఆంధ్ర మాసపత్రికకును ఆ ఆంధ్రదేశమునసే లేరని చెప్పుట సత్యదూర మనిపించుకొనదని మానమ్మకము. ఇట్లు తనదైన దానిని తలయెత్తి చూడకపోవుట తన్నులాడినను తనది కానిదానికై ఇంతమోజుపడుట ఆంధ్రుడు స్వధర్మము నేమరుచుచున్నాడనుటకు చక్కని నిదర్శనము కాగలదు. బెంగాలీవాడు కాని, మహారాష్ట్రుడు కాని, తుదకు సాంబారుస్వామి

అని మనము ఆక్షేపించను అరవవాడు కాని హిందీఅనిన నేటి ఆంధ్రుడట్లు పడి ప్రాకులాడుచున్నట్లు కానము. తనభాషను కూడ మఱచిపోవజాలు ఆవేశముతో ఆంధ్రుడు హిందీని సేవించుచున్నాడు. హిందీపుస్తకములు, హిందీ మాసపత్రికలు కొనుటకు ఆంధ్రులు వెచ్చించుచున్న ధనము ఆంధ్ర పుస్తకములు, ఆంధ్రమాసపత్రికలు కొనుటకు వెచ్చించుచో మన గ్రంథకర్తల స్థితియు, పత్రికాదిలేఖకుల స్థితియు నేడు ఉన్నంతటి శోచనీయస్థితిలో ఉండకుండును. పత్రికలు తెప్పింప కేటాయించుకొనిన ధనముతో మూడునాలుగు హిందీ మాసపత్రికలకు ఆర్డరుఇచ్చి ఇక తెలుగుపత్రికలను తమగ్రంథాలయములకు ఉచితముగ తెప్పించుకొను ప్రయత్నమున ఉత్తరములమీద ఉత్తరములు వ్రాయుటకుగాను కాలమును, తపాలాబిళ్ళలను వ్యయముచేయుటకు జంకని గ్రంథాలయపాలకులు ఒకసారి తమ మూలమున ఆంధ్రసారస్వతమునకు లాభము లేక పోగా విశేషమైన కష్టము, నష్టము కలుగుచుండుటను గమనించుట లెస్స. ఆంధ్రుని హిందీభాషాభిమానము ఆతనికి భారతరాజ్యాంగమున కలుగవలసినంత పలుకుబడిని కలిగింపకపోగా ఆంధ్రసారస్వతాభివృద్ధికి ఒకగొప్ప అడ్డంకిగా నున్నది. విధము చెడుచున్నది, ఫలమును కలుగుట లేదు. ఆంధ్రు డీస్థితిని ఇకనైన తొలగింపకుండుట వివేక మనిపించుకొనునా ?

**చిత్రగుప్త పక్షపత్రిక యైనది:—**

మాసముకాలిక మాసపత్రికయగు చిత్రగుప్త మే మాసమునుండియు పక్షపత్రిక యైనది. సభ్యతవీడని హాస్యము, వినోదమును పుట్టించుచునే విజ్ఞానమును కలిగించు విషయములుకలిగి చిత్రగుప్త ఆంధ్రదేశమున విశేష వ్యాప్తినందుచు నయోజనవిద్యావ్యాప్తికి తోడ్పడుచున్నది. ఆంధ్రులు ఈ పత్రికకు సముచితమగు ప్రోత్సాహ మిత్తురుగాక !

**కాంగ్రెసు: ఆంధ్రుని పలుకుబడి:—**

కాంగ్రెసునడిపిన సత్యాగ్రహ, సహాయ నిరాకరణోద్యమములందు పాల్గొని విశేష త్యాగమును చేయుటలో ఆంధ్రులు భారతదేశమునందలి ఏరాష్ట్రమువారికిని తీసిపోవలేదు. కాని ఇప్పుడు ఆంధ్రునకు కాంగ్రెసులో ఏమైన పలుకుబడికలదా ? మొన్న జరిగిన రాంచిసభలోగాని, నిన్నజరిగిన పాట్నాసభలోగాని ఆంధ్రుడు తానొనర్చిన త్యాగమునకు సరిపోవు పలుకుబడినిపొంది వినియోగించినాడా ? సత్యమూర్తి, రాజగోపాలాచారి నామములే పలుసారులు వినిపించినవి గాని ఒక్క ఆంధ్రనాయకుని నామమైన ఆమ్రేడితము కాలేదు. కాంగ్రెసులో పలుకుబడి సంపాదింప ఆంధ్రునకు కాంక్ష లేదా ? శక్తి లేదా ?

**రాజమండ్రి చిత్రకళా ప్రదర్శనము:—**

సిద్ధహస్తుడు రామారావు తన చిత్రకళా నైపుణ్యముచే భారతీయుల దృష్టులను గోదావరీమహానదితోబాటు రాజమహేంద్రవరమునకు ఆకర్షించినాడు. ఆ కీర్తిపెంపారునిపేర ఆ పావనగౌతమీతీరమున నెలకొల్పబడిన చిత్రకళానిలయమువారు గతమాసమున అఖిలభారతచిత్రకళాప్రదర్శనమును గావించి కళాభివృద్ధికి ఆధునికభారతదేశమున ఇతర రాష్ట్రములతోబాటు ఆంధ్రరాష్ట్రముకూడ యథామతిని కృషిసల్పుచుండుటను చూపిరి. శ్రీ రామారావుగారి యనంతరము ఆయన పెట్టినదీపమును విశేషశ్రమతోర్చి నిలుపుకొనివచ్చుచున్న శ్రీ వరదా వేంకటరత్నముగారికి ఆంధ్రులు విశేషముగ తోడ్పడుట తమజాతికి ప్రతిష్ఠ కూర్చుకొనుట యగును.

## శ్రీయుత కె నారాయణప్ప నాయుడుగారు.

వీరు మదరాసునందలి సుప్రసిద్ధాంధ్ర వర్తకులు. ఆయుర్వేద, యునాని, అల్లోపతిక్ ఔషధములను విరివిగ విక్రయించు అప్పాఅండుకో ప్రొప్రయిటర్లు. 1894-వ సంవత్సరమున స్థాపింపబడినప్పటినుండియు నమ్మకమే వ్యాపారలక్షణమను ఉత్తమాదర్శముతో ఈ కంపెనీ వ్యవహరించుచున్నది.

చెన్నరాష్ట్రపుచరిత్రతో వీరివంశమునకు పదునేడవ శతాబ్దినుండియు సంబంధముకలదు. చెన్నరాష్ట్రమున బ్రిటీషుసామ్రాజ్యసంస్థాపనమునందు ఈస్టిండియా కంపెనీవారికి వీరిపూర్వీకులు ఎంతయు తోడుపడియున్నట్లు పోర్టుసెయింటుజార్జి కోటయందలి రికార్డులలో పెక్కు నిదర్శనములుగలవు. అర్మగాన్‌నుండి కంపెనీవారు తమ ఫ్యాక్టరీని తీసివేయవలసి వచ్చినపుడు మదరాసునందు ఫ్యాక్టరీని ఒకదానిని నిర్మించుటకు చంద్రగిరిప్రభువగు దామెర్ల వెంకటప్పనాయకునితో తమ పలుకుబడినంతయు నుపయోగించి పశ్చిమగోదావరిజిల్లా పాలకొల్లు వాస్తవ్యులగు కత్తె బేరీతిమ్మప్పగారు కంపెనీవారికి పట్టాను సంపాదించిపెట్టిరి. కనుక చెన్నరాష్ట్రమున కంపెనీవారు కాలూనుటకు బేరీ తిమ్మప్పగారె కారణభూతులని చెప్పవచ్చును. ఈ తిమ్మప్పగారు గొప్ప దైవభక్తులు. వీరిదైవభక్తిని చాటుటకు నేటికిని వారునిర్మించిన చెన్నకేశవపెరుమాళ్లు, చెన్నమల్లేశ్వర దేవాలయములు రెండును మహావైభవముతో దర్శనీయములైయున్నవి.

ఈ తిమ్మప్పగారి మనుమలగు నారాయణప్పగారికి నాటి ఫోర్టుసెయింటుజార్జి ప్రభువగు థామస్. పి టి గారు వర్తకపుసుంకము చెల్లింప నవసరములేకుండ 12 వ జూలై 1700 సంవత్సరమునాటి కౌలుద్వార వుత్తరవు నొసంగి వారిని గౌరవించిరి.

నేటికిని ఆ వంశమువారు వర్తకమున మంచి పేరును సంపాదించుచున్నారు. రంగూను, కొలంబో, లండను మొదలగు దేశస్థలములకు మిరపకాయలు మొదలగు కిరాణాసరుకుల ఎగుమతి వ్యాపారమున కమీషనువర్తకము చేయుచున్నారు.

## శ్రీయుత
## కె వేంకటస్వామినాయుడుగారు, బి. ఎల్.

శ్రీయుత కె. నారాయణప్పనాయుడుగారి సోదరులగు శ్రీయుత భాష్యముగారి నలుగురుపుత్రులలో శ్రీయుత కె. వేంకటస్వామినాయుడుగారు జ్యేష్ఠులు. వీరు 1896-వ సంవత్సరమున జననమొందిరి. పట్టభద్రులై న్యాయవాదవిద్య నభ్యసించి శ్రీవారు మదరాసున అడ్వకేటులుగా ఉంటున్నారు.

ఉన్నతవంశజులగుటచే శ్రీ నాయుడుగారు ఉదారభావపూరితులు. ప్రజాహితకార్యనిర్వహణమున వారికి కుతూహలము మెండు. కీల్పాకుపౌరసంఘమునకు వారు అధ్యక్షమహాశయులై, మదరాసు కార్పొరేషనునందు సభ్యులైయున్నారు. మదరాసు కార్పొరేషను సభయందు వీరు ఆంధ్రత్వమునకు పట్టుకొమ్మలైయున్నారనుట అతిశయోక్తి కానేరదు.

శ్రీ నాయుడుగారు శాంతస్వభావులును, ధార్మికగుణ విరాజితులును. బైసాని మాధవశెట్టి ధర్మనిధికి వీరు అధ్యక్షులు; మైలాపూరు హిందూశాశ్వత నిధికి వీరు డైరక్టరులు; పచ్చయప్ప ట్రస్టుబోర్డునకు ట్రస్టీలు.

స్వభావముచే నాయుడుగారు సంఘసేవయందు ఆశక్తిగలవారు. నెమ్మది, దయ వారియందు స్పష్టముగా పొడగట్టుగుణములు. ప్రజాసేవాభిలాష కలవారు గావున వారు ప్రజాహితసంస్థలపెక్కింటి కార్యనిర్వహణశాఖలయందు బాధ్యతగల పదవులయందున్నారు.

విద్యావంతులగుటకు తోడు శ్రీ వేంకటస్వామి నాయుడుగారు విద్యాప్రియులును, విద్యాపోషకులును అయియున్నారు. పట్టణమునందలి శ్రీ త్యాగరాయచెట్టి సెకండరీపాఠశాల కమిటీయందు సభ్యులును, మదరాసు కార్పొరేషనుకుచేరిన విద్యావిషయికమగు స్టాండింగు కమిటీకి అధ్యక్షులును అయియున్నారు.

పళీయశీవరము శ్రోత్రియందారులగు వారు, విభవము, విద్య, వితరణకలిగి సంఘసేవకులు, ప్రజాసేవకులు అయి వంశప్రతిష్టను నిలుపుచు ఆంధ్రకీర్తిని పెంపొందించుచున్నారు.

# జీవితభీమా : కొన్ని ఆలోచనలు

## ౨

## చరిత్ర

భీమాపద్ధతులలో చాలారకాలుఉన్నాయి. మొదటి వ్యాసములో చర్చింపబడిన జీవితపుభీమాతోపాటు, అగ్నిభీమా, సముద్రపుభీమా, ప్రమాదములభీమా, కూలి వాండ్ల యుద్యోగములభీమా, వ్యాపారమందలి లాభ నష్టములభీమా, దొంగతనముభీమా, వర్షములవలన పంట లకు నష్టమురాకుండభీమా మొదలగు రకములు చాల కాలమునుండి వచ్చుచున్నవే! నాగరికతాదేవత తాండ వించుచున్న అమెరికాదేశమునందు, ఈ యిరువదియవ శతాబ్దమునందు, చిత్ర విచిత్రములగు భీమాపద్ధతులు పుట్టినవి. గొప్పవారిండ్లలో శుభకార్యము లప్పుడు వేయు పందరిలు వగైరాలు వర్షములవలన చెడకుండ, భార్యాభర్తలయనురాగమునకు భంగముగలుగకుండ, వివాహనిర్ణయములు విఫలములుగాకుండ భీమా చేయు చున్నారు: చేయించుచున్నారు. ప్రసిద్ధికెక్కిన సినీమా నటులు యింకను నూత్నపద్ధతుల త్రొక్కుచున్నారు. శరీరలావణ్యమునకు, గాత్రసౌకుమార్యమునకు, ప్రత్యే కాంగసౌష్టవమునకు, స్తనముల బిగువునకు, పిఱుదుల ఘనమునకుకూడా భీమాచేయిస్తున్నారు. ఈ రకాల వ్యాపారం సాగించుటకు కంపెనీలుకూడా బయలు దేరినాయి.

పైన జెప్పబడిన అన్నిరకముల పద్ధతులలోను సము ద్రయానభీమా అతిప్రాచీనమైనదని ప్రస్తుతము లభ్యమగు చరిత్రలవల్ల తెలుస్తుంది. అనేక వేల సంవత్స రాలకుపూర్వమే భారతీయులు, గ్రీకులు నౌకా వ్యాపారం బాగా సాగించినట్లు నిదర్శనాలున్నాయి. చిన్నచిన్న నావలలో విలువగల సరుకుల నెక్కించి ఖండాంతరములకు యజమానులు పంపించేవారు. అవి సంవత్సరములకొలది ప్రయాణాలు సాగించి తిరిగి యిండ్లకుచేరేవరకు వాండ్లు బ్రతికియున్నారో, లేక మృతులైనారో, తెలిసేదికాదు. పడవ తిరిగి స్వదేశ మునకు వచ్చువరకు, యజమాని దానిమీద ఆశవదలు కొని భగవంతునిమీద భారంవేసియుండేవాడు. ఏ తుపానుగాలికి, ఎక్కడ పడవ పాడైనప్పటికి, ఆ సం గతి యింటికి తెలియడానికి యిప్పుడున్నట్టుగా సౌక ర్యాలులేవు. అందువలన, సామాన్యముగా పడవయొక్క ఆ ప్రయాణమునకు కావలసినకాలమును నిర్ణయిం చుకొని, ఆ సమయమునకు తిరిగి రాని యెడల, పడవ మునిగిపోయినట్లే తలిచేవాండ్లు. అట్లా నష్టపడిన సొవు కారును తతిమ్మా వర్తకులంతా కలిసి, దాని మొత్తే మును సహాయముచేసి, నష్టపడినవర్తకుడు పడిపోకుండా చూచేవారు. ఈ విధంగా బయలుదేరింది ఈ పరస్పర సహకారవ్యాపారం మొదట్లో. అదే దినదినాభివృద్ధి పొంది, మానవుల జీవితయాత్రలో అనేకపంథాల యుపకరిస్తోంది.

ఈ విధమైన సహకారపద్ధతి కొలదికాలమునకు దూరదేశములకు యాత్రకుగాని, వ్యాపారమునకుగాని ప్రయాణముచేయు వ్యక్తులవిషయంలో అనుకరించారు. (పూర్వము దక్షిణభారతీయులు, కాశీయాత్ర బయలు

దేరునప్పుడు తమయాస్తులు వగయిరాలు తమతమ వారికి, చనిపోవునప్పుడు సామాన్యముగా వ్రాసే విల్లు మాదిరిగా, అప్పజెప్పి పోయేవారట.) కాని యీ వ్యాపారమును ధనవంతులగువారుమాత్రం చేయుచుండేవారు. ఎవరైనా దూరదేశము పొయ్యేటప్పుడు ఒక భీమావ్యాపారస్థునికి, కొంతరుసుము చెల్లించే యడల, ఆయాత్రికుడు మార్గమందు చనిపోయేటట్లయితే, వాడివాండ్లకు అనుకొన్న మొత్తాన్ని యిచ్చేస్తారు. ఇందుకు ఒకటిరెండు సంవత్సరాలుమాత్రము కాలపరిమితి యుండేది.

తదుపరి జబ్బుగావున్నప్పుడు గొప్ప పురుషుల జీవితములమీద, గొప్పయుద్ధాలు జరుగుచున్నప్పుడు సేనానాయకుల జీవితములమీద భీమాచేసేవారట. రెండవ జార్జిప్రభువు డాటింగ్ టక్ మీదకు యుద్ధానికి వెళ్ళినప్పుడు ఆయన జీవితముమీద, జరిగినభీమావ్యాపారం అంతాయింత గాదు. ఈ రకం భీమాపద్ధతిని ఆకాలపు ప్రభుత్వములవారు లాటరీక్రింద భావించేవారు. (ఇప్పటిగుర్రపుపందెములుకూడా ఈలాగేవున్నాయనుకుంటా.)

ఇలాంటి వ్యాపారము 16, 17 శతాబ్దములలో యింగ్లాండులో చాలగొప్పగా సాగిందట. కాని 18వ శతాబ్దమువచ్చేసరికి, 1774 సంవత్సరములలో యింగ్లాండు ప్రభుత్వమువారు ఈ విషయమునుగురించి ఒకచట్టమునుచేశారు. అప్పటికి ఈ వ్యాపారం సక్రమపద్ధతులలోనికి దిగింది. ప్రత్యేకవ్యక్తులకు బదులు, పదిమందికలిసి వ్యాపారసంఘములుగా ఏర్పడి యీ వ్యాపారమును మొదలుపెట్టినారు. చట్టము పుట్టినప్పటినుంచి, భీమా 'జూదమనే' పద్ధతిపోయి, నేటికి చాల గౌరవప్రదమైనట్టియు, ప్రజోపకారమైనట్టియు వ్యాపారమైంది.

ఆంగ్లదేశంలోని భీమావ్యాపారసంస్థలలో కెల్ల 'లాయిడ్సు' సంఘము చాలపురాతనమైనది, గొప్పది. దీనిచరిత్ర చాల యద్భుతమైనది. చదువతగినది. ఆచరిత్ర ముందువ్యాసమున విపులముగాచర్చింప తలపెట్టినాము.

—జమిలి నమ్నాళ్వారు.

# కొన్ని విడ్డూరపు భీమాలు

## భుజముల భీమా

లిక్ డాగోవర్ అనునామె జర్మనుదేశపు సుప్రసిద్ధ సినామానటి. యూరపుఖండమునకెల్ల ఆమె భుజములు అత్యంతసుందరములని వాసిగాంచినవి. అట్టి తన భుజములకు హానికలుగకుండ ఆమె వానిని ఇన్సూరు చేసియున్నది.

## పెదవుల భీమా

ఈ నడుమ ఒక జపాను జవ్వనిదొండపండ్లవంటి తన పెదవులను పదిహేనువేల రూపాయిలకు భీమా చేసియున్నది.

## బుగ్గల సొట్టలు భీమా


ఒకానొక అమెరికాదేశపు సినీమావర్తకుడు తాను ప్రేమించిన ఒక పడుచుయొక్క ముఖసౌందర్యమునకు మెఱుగుపెట్టెడు బుగ్గలసొట్టలను మూడులక్షల రూపాయిలకు భీమాచేసెను. కాని వివాహమైన కొద్దికాలమునకే వారు వివాహమును విచ్ఛేదముగావించుకొనిరి. వారు విడాకులుపుచ్చుకొనుటతో ఈ విడ్డూరపు పోలసీ అమలునుండి తొలగిపోయెను.

## శిరోజముల భీమా

మిస్ లూసిక్లేటన్ అను ఇరువదిరెండు వత్సరముల లండను వన్నెలాడి తనసుందరశిరోజములను పదునైదువేలకు రోగము, ప్రమాదము, అగ్ని మొదలగువాని హానినుండి కాపాడబడుటకు ఇన్సూరుచేసెను.

## వికారరూపమునకు భీమా

పోలెయిర్ అనునామె తన వికారరూపము వలననే పేరుమిగిలిన సినీమానర్తకి యయ్యెను. తన వికృతరూపమునకే ఆమె గొప్పజీతమును పొందుచున్నది. గ్రహచారముచాలక తాను ఎప్పుడైన సౌందర్యమును పొంది వికృతరూపమును ఎడబాయకుండుటకై ఆమె భీమారక్షణమును పొందెను.




## ఏప్రియల్, ౧౯౩౮.

౧౭:—విజయనగరము. మీమాంసభూషణులు గంటి సూర్యనారాయణశాస్త్రి గారి మరణము.

౨౨:—నిడుబ్రోలు. ఆంధ్రరైతాంగ విద్యాలయము శ్రీ సంతానముగారిచే తెరువబడెను.

౨౪:—కాకినాడ. కాకినాడ ముద్రాక్షరశాలవారు వెయ్యిరూపాయల ధరావతుకట్టిరి.

౨౫:—రాజమండ్రి రామరాయ చిత్రకళానిలయము వారి అఖిలభారతచిత్రకళా ప్రదర్శనము.

:—మదరాసు. ఎం. ఎస్. ఎం. రైల్వే యూనియనుకు వి. వి. గిరిగారు తిరిగి అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—ఊటీ. సర్. కూర్మా వెంకటరెడ్డినాయుడు గారు క్రొత్త లామెంబరుఛార్జి పుచ్చుకొనిరి.

౨౬:—బెజవాడ. ఆంధ్రకాంగ్రెసునాయకుల సభ.

:—తెన్నేరు. కమ్మ మహాసభ. శ్రీ చల్లపల్లిరాజా గారి అధ్యక్షత.

౨౭:—తెన్నేరు. కమ్మవిద్యార్థిసభ. శ్రీ త్రిపురనేని గోపీచందుగారి అధ్యక్షత.

:—బెజవాడ. ప్రథమ దక్షిణహిందూదేశగ్రంథాలయ సమ్మేళనము.

౩౦:—ఉంగుటూరు దత్తతదావా పిఠాపురము రాజా వారి పక్షమున తీర్పుచెప్పబడెను.

## మే, ౧౯౩౮.

౧:—బెజవాడ. 'భారతవైశ్య' అను పేరుతో ఒక వారపత్రికను స్థాపించుటకు డిక్లరేషన్.

౪:—విశాఖపట్టణము. కేతవరపు వేంకటశాస్త్రిగారు మరణించిరి.

౫:—అనకాపల్లి. మల్లవరపు సుబ్బారావు, బి. ఏ. బి ఇ. డి. గారు 'సత్యవాణి' అను క్రొత్తపత్రికకు సంపాదకులుగా డిక్లరేషన్ పొందిరి.

౬:—ముంగండ. రాజోలుతాలూకా పంచాయతీ బోర్డుల మహాసభ. భమిడిపాటి సత్యనారాయణ గారి అధ్యక్షత.

:—నరసాపురము. యన్. టి. పి. యూనియన్ 33-వ వార్షికోత్సవము.

౭:—మదరాసు. స్టేటుకౌన్సిలు ఆంధ్రసభ్యులు శ్రీ యార్లగడ్డ రంగనాయకులు నాయుడుగారు ఇంగ్లాండుకు వెళ్ళుటకు ప్రయాణమైరి.

:—విశాఖపట్టణము రేవు. ఆయుధముల దిగుమతి నిషేధము తొలగించు ప్రభుత్వ ప్రకటన.

:—నంద్యాల. మునిసిపాలిటీరద్దుకు నిరసన తెలుపుటకు 13గురు సభ్యుల రాజీనామాలు.

౯:—అమలాపురము. ఉపాధ్యాయపండిత పరిషత్తు వార్షికోత్సవము. వార్షికమహాసభ.

:—అంగలూరు. నందగిరి వేంకటఅప్పరాయ కవి గారి మృతి.

:—నందిగామ. కృష్ణాజిల్లా బోర్డుసభ్యులు బెజవాడ కోటయ్యగారు హత్యగావింపబడిరి.

౧౨:—కలకత్తా. ఆంధ్రకన్య శకుంతల (ఎం. ఏ) గారికి యూనివర్సిటీవారి స్కాలర్ షిప్.

౧౪:—కాకినాడ. కుట్రకేసులో డిఫెన్సు వకీలు మంత్రిప్రగడ శేషగిరిరావు, బి. ఏ. బి. ఎల్ గారిపై తేబడినకేసు కొట్టివేయబడుట.

:—ఏలూరు. బసవరాజు శ్రీ రంగశాయి గారియిల్లు నిషిద్ధకరపత్రములకై సోదా.

౧౬:—రాజమండ్రి. శ్రీయుత సందూరి కృష్ణమాచారి గారి విడుదల.

౧౭:—గుడివాడ. పాట్నాసభకు రాజాలమని టి. ప్రకాశంగారి తంతి.

# ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ

## లిమిటెడ్

## బందరు

స్థాపితము—1925.

కొలది సంవత్సరములలోనే అద్భుతముగు అభివృద్ధిగాంచిన సంస్థ.

| | |
|---|---|
| 1933 లో జరిగిన వ్యాపారము | 19,42,000 |
| సాలీనా ఆదాయము | 3 లక్షలు |
| భీమానిధి | 7 లక్షలు |

మిత వ్యయము, నిర్దుష్టపరిపాలన మా కంపెనీయొక్క ముఖ్యలక్షణములు.

సాలీనా చెల్లించు ప్రీమియములపై నూటికి రు 2—8—0 లు మినహాయింపు; రద్దయిన పట్టాలు, బాకీలుపడిన ప్రీమియములు చెల్లించవలసిన అవసరంలేకుండగా తిరిగి అమలులోనికి తెచ్చుట మొదలగు అనేకసౌకర్యములు కలవు.

మొదటి వాల్యుయేషనులోనే సాలుకు 1000-కి రు 10 లు బోనసుపంచబడినది.

అన్నిచోట్లను మంచి కమీషనుపై పలుకుబడిగల ఏజంట్లుకావలెను.

వివరములకు :—

య. మంగయ్య, బి.ఏ, బి.ఎల్.,

కార్యదర్శి.



# నిద్రాహీనత

మనుజునకు నిద్రాహీనత దేహమనో దౌర్బల్యమువల్లను సంభవించును. మనుజునకు సహజముగ నుండవలసిననిద్ర లేకపోయినచో మలబద్ధము, అజీర్తి, తలనొప్పి, ఆకలి మందము, మెదడుక్షీణత యేర్పడి కండ్లు గుంటలుపడి బహునిస్సత్తువగ నుండును.

జీవామృతము వీర్యవృద్ధిని, కండపుష్టిని, జవసత్వములను పెంపొందించుట కేర్పడి మనుజదేహములకు అమూల్యమైనది. దీని సేవనమువల్లను దౌర్బల్యహేతువగు సమస్తవిధజాడ్యములును అరికట్టబడి సంపూర్ణ ఆరోగ్యస్థితి లభించును. స్త్రీ పురుషులెల్లరు సేవింపతగిన ఉత్తమ బలవర్ధకౌషధము.

## జీవామృతము

(పూర్ణారోగ్యప్రదాయిని)

పెద్దసీసా రు. 3-4-0. చిన్నసీసా రు. 1-12-0.
ఎల్ల ఔషధవిక్రేతలయొద్దను దొరకును, లేక

ఆయుర్వేదాశ్రమము.

151, గోవిందప్పనాయకవీధి, తపాలుపెట్టె287,
మదరాసు.

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 183 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా? ఔను. ఎందువలన? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుట వలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకయే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని, పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

# స్వాతంత్ర్యము

ఉద్యోగపు దాస్యమునుండియు, నిరుద్యోగపు విచారమునుండియు,
స్వాతంత్ర్యమును పొందుటకు "స్టార్" ఏజన్సీని తీసికొనుడు—

1. జీతముమీదగాని లేక ధారాళమైన కమీషనుమీదగాని
2. వంశపారంపర్యమగు పారితోషికము.
3. బీదలకు, భాగ్యవంతులకు వీలైన శాస్త్రీయమైన భీమాపద్ధతులు
4. ఒడంబడిక మూలమైన ఉద్యోగనిశ్చయము.

కంపెని అభివృద్ధి

| | | | |
|---|---|---|---|
| 1. | పూర్తిచేసిన భీమా వ్యాపార మొత్తము | రు. | 20,00,000 పైగా |
| 2. | చెల్లించిన క్లైము మొత్తము | రు. | 2,50,000 |
| 3 | సంవత్సరపు ఆదాయము | రు. | 2,00,000 |
| 4. | గవర్నమెంటు సెక్యూరిటీలు | రు. | 1,00,000 |

వివరములకు:— ఎం. ఎస్. ఆర్. ఏ. గుప్త, మేనేజింగు ఏజంటు.

## ది స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అష్యూరెన్సు కంపెని, లిమిటెడ్.

హెడ్డాఫీసు : 23-24, సెకండులైన్ బీచ్, మద్రాసు.



# Tri-Colour Process Blocks



For Best Results
STUDIO

MCA Appaswamy Chetty & Co.
PROCESS ENGRAVERS
64 Savarimuthu St Mannady MADRAS



# రామప్రియ

గ్రంథకర్త—'కోటీశుతనయ'ను వ్రాసిన
**తాత కృష్ణమూర్తి, బి.ఏ; యల్.టి.**

ఇది సులభశైలిని వ్యవహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్ర కల్పనాకథల పుస్తకము. డాక్టర్ బుర్రా శేషగిరిరావు (ఎం.ఏ; పి. హెచ్.డి.) గారి పీఠిక కలది. క్రౌన్ సైజు, వెల 12 అణాలు.

ఈ మనోహరగ్రంథము భాషాసతి కొక మండనమనుట నిక్కువము. —గృహలక్ష్మి.

హాస్యరసగర్భితము. —వినోదిని.

కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి. —భారతి.

కథలలోన హద్దుమీరని స్వేచ్ఛయొక్క ఛాయలు చిత్రింపబడినవి. —ఆనందబోధిని.

చిరునామా:

**తాత కృష్ణమూర్తి, భద్రాచలం.**




## శ్రీ దత్తాత్రేయ అజీర్ణమాత్రలు

మలబద్ధకము హరించును.

ఒకసీసాకొరకు మాకు వ్రాయవలసిన అవుసరములేదు. మీగ్రామము పచారిషాపునందు తప్పక దయచేసి అడగండి. సీసా 0-4-0 ధరకేదొరకును.

## గంధర్వాకల్ప

రక్తపుష్టి, వీర్యవృద్ధి, నరములకు బిగి కలిగించు తియ్యని లేహ్యము. అనేకులకు మరల మగతనము కలిగించి మెప్పు పొందినది.

పౌను రు. 3—0—0.

గంధర్వఫార్మసీ, రాజమండ్రి.

## శిశుపోషణి

ఇది చిన్నపిల్లలకు కలుగు సమస్తవ్యాధులను బోగొట్టి పిల్లల ఆరోగ్యమును వృద్ధిబొందించును. దీనిని ప్రతినిత్యమును వాడుచుండిన బల్లపెరుగుట, కోరింతదగ్గు, బాలాపస్మారము, పాలు కక్కుట మొదలగు క్రూరవ్యాధులు రాకుండ కాపాడును. మూడుమాసముల వయస్సు మొదలు 5 సం॥ ముల వయస్సువచ్చువరకు నుపయోగింపవచ్చును. ఉపయోగించువిధానము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రల సీసా అణాలు 4.

ఇంకను ఇప్పటికాలమున ప్రతినిత్యము సేవింపదగిన "కూష్మాండరసాయనము", ద్రాక్షారిష్టము, స్వర్ణాదివటి (టానిక్కు-పిల్సు), హిమసారతైలము (బేదింగ్ అండ్ హైరాయిల్) మొదలగు ఔషధములు మావద్ద సిద్ధముగా నున్నవి.

వలయువారు—

లక్ష్మీనారాయణకంపెనీ, కాకినాడ.

డ్రగ్గు కెమికల్‌స్టోర్సు, వెస్టుకలక్టరేటు, గుంటూరు.

భారతభైషజ్యనిలయము, వేపేరి, మదరాసు, అనివ్రాయవలెను.

## స్వర్ణమాలిని

ఇయ్యది కాసరోగములను, జీర్ణజ్వరములను, విషమజ్వరములను బోగొట్టి మిక్కిలి సుగుణ మిచ్చును. క్షయరోగములయందు మిక్కిలి యుత్తమము. వారమురోజులమందు. రు 4-0-0.

### బ్రహ్మీతైలము.

జ్ఞాపకశక్తిని వృద్ధిచేసి మెదడునకు చలువనిచ్చును. ఉన్మాదఅపస్మారములను పోగొట్టును.

6 ఔన్సులువెల 1-0-0

ఇతర ఆయుర్వేదౌషధములన్నియు దొరకును.

భవానీ ఫార్మసి.

320, తంబుశెట్టి వీథి, మదరాసు.